# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - బుధవారం 9 జూలై 2025 | సంపుటి: 9 | సంచిక: 191 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


## 67 మందిని రక్షించిన కుక్క



హిమాచల్ ప్రదేశ్‌లోని మండి ప్రాంతంలో ఘటన 2

## ఆటల్లో రికార్డు సృష్టించిన హీరోయిన్



ట్రయథ్లాన్‌లో డబుల్ ఛాంపియన్‌షిప్ 12

# క్రిటికల్ మినరల్స్‌ను కాపాడుకోవాలె

## వాటిని ఏ ఒక్క దేశానికీ సొత్తుగా మారనీయొద్దు

- బ్రిక్స్ దేశాలకు మోడీ పిలుపు
- పర్యావరణ పరిరక్షణకు సంపన్నదేశాలు మరిన్ని నిధులివ్వాలె
- 'బ్రిక్స్' కూటమిని పునర్నిర్వచించేందుకు భారత్ కృషి చేస్తుందని చెప్పిన ప్రధాని

2





కేంద్ర మంత్రులకు వినతులు..

# యూరియా సకాలంలో సప్లై చేయండి

## దేశీయంగా ఉత్పత్తి అయిన యూరియా కోటాను మా అవసరాలకు అనుగుణంగా పెంచాలె

కేంద్ర మంత్రి నడ్డాకు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

మామునూరుకు ఆర్థిక సాయం చేయాలని పీయూష్ గోయల్‌కు విజ్ఞప్తి

2

ఈవోలపై దాడులు సహించం

# ఆక్రమణదారులపై పీడీ పెడ్తం



## రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హెచ్చరిక

భద్రాచలం ఈవో రమాదేవిపై దాడికి తీవ్రంగా ఖండన, ఫోన్‌లో పరామర్శ

నిందితులను అరెస్టు చేయాలని ఏపీ ప్రభుత్వానికి విజ్ఞప్తి

హైదరాబాద్, జూలై 08, (మనం బ్యూరో): రాష్ట్రంలో దేవుడి భూములు రక్షించే ఈవోలపై దాడి చేస్తే ఊరుకోబోమని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హెచ్చరించారు. దేవాలయ భూములు కబ్జా చేస్తే పీడీ యాక్టు పెడతామని స్పష్టం చేశారు. భద్రాచలం రామాలయ భూములు ఏపీలోని పురుషోత్తమపట్నంలో కబ్జాకు గురవుతుండగా మంగళవారం అడ్డుకున్న ఈవో రమాదేవిపై ఆ గ్రామస్థులు దాడి చేసిన ఘటనపై మంత్రి సురేఖ స్పందించారు. ఈవో రమాదేవిపై దాడికి పాల్పడటం సహేతుకం కాదన్న మంత్రి ఆమెను ఫోన్‌లో పరామర్శించారు. ఈ విషయంలో ఏపీ ప్రభుత్వం, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఘటన పూర్వాపరాలు ...మిగతా 2లో



## భద్రాచలం ఈఓపై భూ కబ్జాకోరుల దాడి

భద్రాచలం, జూలై 8(మనం న్యూస్): భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం ఈఓ రమాదేవిపై పలువురు ఆక్రమణదారులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పురుషోత్తమ పట్నంలో జరిగింది. భద్రాచల రాముడికి సుమారు 1300 ఎకరాల భూమి ఉంది. ఇందులో 888.5 ఎకరాలు ...మిగతా 2లో

## రాజ్‌భవన్‌కు బాంబు బెదిరింపు

అంతా ఉత్తదేనని తేల్చిన పోలీసులు

సిటీబ్యూరో, మనం న్యూస్: గ్రేటర్‌లోని వివిధ ప్రాంతాల్లో బాంబులు పెట్టినట్టు బెదిరింపు మెయిల్ రావడంతో పోలీసు అధికారులు ఉలిక్కిపడ్డారు. గవర్నర్ నివాస భవనమైన రాజ్‌భవన్, సిటీ సివిల్ కోర్టు, జింఖానా క్లబ్, సికింద్రాబాద్ సివిల్ కోర్టుల్లో బాంబులు పెట్టినట్టు గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం తెల్లవారుజామున మెయిల్ చేశాడు. అప్రమత్తమైన పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. కోర్టుల్లో కార్యకలాపాలు పూర్తిగా నిలిపివేశారు. అన్నా వర్సిటీ పూర్వ విద్యార్థుల పేరిట తెల్లవారుజామున 3.43 గంటలకు ఆగంతకుడు మెయిల్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎక్కడా బాంబు ఉన్నట్లు నిర్ధారణ కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

# ప్రజావాణికి ప్రశంసలు



- కార్యక్రమాన్ని పరిశీలించిన మధ్యప్రదేశ్ డిప్యూటీ కలెక్టర్ల బృందం
- ఇన్‌చార్జి చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్యతో భేటీ
- ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తినిచ్చే కార్యక్రమమని ప్రశంస
- మా రాష్ట్రంలో కూడా అమలుకు సిఫారసు చేస్తమని వెల్లడి

హైదరాబాద్, జూలై 08, (మనం బ్యూరో): సీఎం ప్రజావాణి, ప్రవాసి ప్రజావాణి పనితీరు బాగుందనీ, ఇలాంటి విధానాన్ని మధ్యప్రదేశ్ రాష్ట్రంలోనూ అమలు చేసేందుకు తమ రాష్ట్ర ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తామని మధ్యప్రదేశ్‌కు చెందిన డిప్యూటీ కలెక్టర్లు పేర్కొన్నారు. జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాన్ని మధ్యప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ కలెక్టర్ల బృందం సందర్శించింది. ప్రజావాణి కార్యక్రమంలో ...మిగతా 2లో

## మంత్రి పదవుల అంశం నా పరిధిలో లేదు

### ఆపరేషన్ ఆకర్ష్ లైవ్‌లోనే ఉంది

నేను స్పందించే స్థాయి కేటీఆర్‌ది కాదు

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మేమే గెలుస్తం.. సర్వే అదే చెప్పింది

15 లోగా కొత్త డీసీసీల నియామకం

మీడియాతో పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ చిట్‌చాట్



హైదరాబాద్, జూలై 8, (మనం బ్యూరో): ప్రజా సమస్యలపై చర్చించాలంటే అసెంబ్లీ ఉందనీ అక్కడికి రాకుండా ఎక్కడ పడితే చర్చకు రావాలని మాజీ మంత్రి కేటీఆర్ సవాల్ విసరడం హాస్యాస్పదంగా ఉందని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఈనెల 15లోగా కొత్త డీసీసీ కమిటీలు వస్తాయనీ, వీటి కోసం సీనియర్ ఇన్‌చార్జిలను నియమించినట్లు తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ప్రజా సమస్యలపై చర్చకు రావాలన్న మాజీ మంత్రి కేటీఆర్ సవాల్‌పై స్పందిస్తూ తాను స్పందించే స్థాయి కేటీఆర్‌కు లేదన్నారు. అసెంబ్లీలో ప్రతిపక్షాలకే ఎక్కువ సమయం ఇచ్చామనీ, అయినా ...మిగతా 2లో

## నవోదయలో 6వ తరగతి ప్రవేశాలు

దరఖాస్తులకు జూలై 29 చివరి తేదీ!

గ్రామీణ విద్యార్థులకు 75 శాతం సీట్లు రిజర్వ్

హైదరాబాద్, మనం ప్రతినిధి: దేశవ్యాప్తంగా ఉన్న జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఆసక్తిగల విద్యార్థులు అధికారిక ...మిగతా 2లో

## ఆగస్టు 13న 'దివ్యాంగుల మహాగర్జన'

పెన్షన్ల పెంపు హామీని సర్కార్ విస్మరించింది

స్థానిక ఎన్నికల్లో దివ్యాంగులకు రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ తేవాలని డిమాండ్

మహాగర్జనకు మద్దతు కోరుతూ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావుతో భేటీ



హైదరాబాద్, మనం ప్రతినిధి: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగుల పింఛన్లను పెంచకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వారిని మోసం చేస్తోందని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ తీవ్రంగా విమర్శించారు. ఈ విషయంలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ ...మిగతా 2లో

## మెడికల్ కాలేజీలకు పాలనాధికారులు

టీచింగ్ హాస్పిటళ్లకు ప్రిన్సిపాల్స్, సూపరింటెండెంట్ల నియామకం

44 మంది సీనియర్ ప్రొఫెసర్లకు అడిషనల్ డైరెక్టర్లుగా పదోన్నతి

హైదరాబాద్, జూలై 8, (మనం బ్యూరో): తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత తొలిసారిగా ప్రభుత్వం మెడికల్ కాలేజీలు, టీచింగ్ హాస్పిటళ్లకు ప్రభుత్వం ...మిగతా 2లో

## నేనొచ్చిన.. మీరెక్కడ?

రైతు సంక్షేమంపై చర్చకు సిద్ధమంటూ ప్రెస్ క్లబ్‌కొచ్చిన బీఆర్ఎస్ నాయకుడు

సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ ప్రాంతంలో పార్టీ శ్రేణుల హంగామా

2

# విదేశీ విద్యార్థులకు 'బ్యూటిఫుల్' షాక్



## కొత్త చట్టంతో 'వీసా ఫీజు'ల భారం పెంచుతున్న అమెరికా

హైదరాబాద్, జూలై 8: పన్నుల్లో కోత, వ్యయ నియంత్రణలు, వీసా ఫీజులను పెంచే లక్ష్యంతో అమెరికా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన 'వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్లు' చట్టరూపం దాల్చిన విషయం తెలిసిందే. దీని ద్వారా వీసా దరఖాస్తుదారులపై అదనపు భారం పడనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా నాన్-ఇమిగ్రెంట్లకు కొత్తగా 'వీసా ఇంటిగ్రిటీ ఫీజు'ను డిపార్ట్మెంట్ ఆఫ్ హోమ్లాండ్ సెక్యూరిటీ తప్పనిసరి చేసింది. అంతేకాకుండా 2026 నుంచి దీన్ని మరింత పెంచేలా నిబంధనలు రూపొందించారు. ఇమిగ్రేషన్ సేవల సంస్థ ఫ్రాగోమెన్ నివేదిక ప్రకారం.. నాన్-ఇమిగ్రెంట్ వీసా జారీ చేసే సమయంలో 'వీసా ఇంటిగ్రిటీ ఫీజు' కింద 250 డాలర్లు తప్పనిసరిగా చెల్లించాల్సి ఉంటుంది. భవిష్యత్తులో ఈ రుసుమును పెంచే అధికారం డీహెచ్ఎస్ కు కల్పించారు. వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారంగా 2026 నుంచి ఏటా దీన్ని పెంచే అవకాశం ఉంది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ ఫీజును తగ్గించడం కానీ, రద్దు చేయడం కానీ ఉండదు. అయితే, కొన్ని పరిమితులకు లోబడి డీహెచ్ఎస్ మినహాయింపు ఇచ్చే అవకాశముంది. ఐ-94 గడువు ముగిసే ఐదు రోజుల కంటే ముందు (కొనసాగింపునకు లేదా స్టేటస్ మార్పు కోసం దరఖాస్తు ...మిగతా 2లో

# సిగాచీపై ఎన్డీఎంఏ ఆగ్రహం

హైదరాబాద్, మనం ప్రతినిధి: పాశమైలారం సిగాచీ పరిశ్రమను నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ (ఎన్డీఎంఏ) బృందం పరిశీలించింది. అనంతరం అక్కడే సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్వహణ లోపాలపై సిగాచీ యాజమాన్యంపై ఎన్డీఎంఏ ప్రశ్నలు సంధించింది. యాజమాన్యం సరిగా సమాధానాలు ఇవ్వలేకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

ఆ సంస్థ అధికారుల స్పందనపై అసంతృప్తి వ్యక్తి చేసిన ఎన్డీఎంఏ బందం.. రసాయన పరిశ్రమ నిర్వహణ గురించి మొత్తం తమకు తెలుసని, పేలుడు ఎలా సంభవించిందో చెప్పాలని ఘాటుగా వ్యాఖ్యానించింది. సమావేశం అనంతరం పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యమే ఈ ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా అంచనా వేసింది. సిగాచీ పరిశ్రమలో జరిగిన ప్రమాద ఘటనలో ఇప్పటి వరకు 44 మంది మృతిచెందిన విషయం తెలిసింది.

## పెరుగుతున్న మృతులు

చికిత్స పొందుతూ మరో ఇద్దరు మృతి

44కి చేరిన పాశమైలారం మృతుల సంఖ్య

ఇప్పటివరకు ఆసుపత్రుల్లో 8 మంది కార్మికులు మరణం

ఇంకా లభించని మరో 8 మంది ఆచూకీ

శిథిలాల కింద కొనసాగుతున్న గాలింపు చర్యలు

2

# క్రిటికల్ మినరల్స్‌ను కాపాడుకోవాలె

**రియో డి జెనీరో, జూలై 8:** అత్యాధునిక సాంకేతిక సాధనాల తయారీలో కీలకమైన ఖనిజాలను (క్రిటికల్ మినరల్స్) ఏ దేశమూ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకోకుండా అడ్డుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. వాటిని ఇతరులపై ఆయుధాలుగా ఉపయోగించుకునే పరిస్థితి రాకుండా చూడాలన్నారు. ఆ ఖనిజాల సరఫరా గొలుసులను ఏర్పాటుచేసుకునేందుకు కలిసికట్టుగా కృషిచేయాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు. బ్రెజిల్ దేశ నగరమైన రియో డి జనీరోలో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా 'బహుళ పక్షవాదం, ఆర్థిక వ్యవహారాలు, కృత్రిమ మేధ'పై బ్రిక్స్ ఏర్పాటుచేసిన సమావేశంలో మోడీ ప్రసంగించారు. క్రిటికల్ మినరల్స్ రంగంలో చైనా జిత్తులమారి విధానాలను అవలంబిస్తోందని, ఆ ఖనిజాల ఎగుమతులపై ఆంక్షలు విధిస్తోందని కొంతకాలంగా ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ప్రధాని తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీలు), బ్యాటరీ స్టోరేజ్, డ్రోన్ల వంటి అత్యాధునిక సాంకేతిక ఉత్పత్తుల తయారీలో కీలకమైన లిథియం, నికెల్, గ్రాఫైట్ వంటి ఖనిజాలను క్రిటికల్ మినరల్స్ గా పిలుస్తారు.

**భారత్ లో 'ఏఐ ఇంపాక్ట్ సదస్సు'**

రోజువారీ కార్యకలాపాల్లో కృత్రిమ మేధ(ఏఐ) వినియోగంతో జీవితం బాగా మెరుగవుతుందని.. అదే సమయంలో అది దుర్వినియోగమయ్యే ప్రమాదం కూడా ఉందని మోడీ హెచ్చరించారు. డిజిటల్ కంటెంట్ వాస్తవమో కాదో ధ్రువీకరించుకునేందుకు అంతర్జాతీయ ప్రమాణాలను రూపొందించుకోవాల్సిన అవసరముందన్నారు. ఇదే ప్రధానాంశంగా తీసుకుని వచ్చే ఏడాది భారత్ లో 'ఏఐ ఇంపాక్ట్ సదస్సు'ను నిర్వహిస్తామని ఈ సందర్భంగా ప్రధాని ప్రకటించారు.

**గ్లోబల్ సౌత్కు మరింత చేయూతనిద్దాం..**

గ్లోబల్ సౌత్ దేశాలకు బ్రిక్స్‌పై కొన్ని అంచనాలు, ఆశలున్నాయని వాటిని నెరవేర్చేందుకు అందరమూ కలిసికట్టుగా కృషిచేద్దామని పిలుపునిచ్చారు. బ్రిక్స్ శాస్త్ర పరిశోధనల భాండాగారం ఏర్పాటును కూడా మోడీ ప్రతిపాదించారు.

**పర్యావరణ రక్షణ సంపన్నదేశాల ప్రత్యేక బాధ్యత..**

పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలకు, ప్రస్తుత ఆర్థిక వనరుల లభ్యతకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించాల్సిన ప్రత్యేక, ముఖ్యమైన బాధ్యత అభివృద్ధి చెందిన దేశాలపై ఉందని మోదీ అన్నారు. అందుకోసం ధనిక దేశాలు మరిన్ని నిధులు కేటాయించాలని పిలుపునిచ్చారు. వాతావరణంలో ప్రతికూల మార్పుల వల్ల ఆహార, ఇంధన, ఆర్థిక సంక్షోభాలను ఎదుర్కొంటున్న దేశాలకు అండగా నిలవాలన్నారు. వచ్చే ఏడాది బ్రిక్స్ అధ్యక్ష స్థానంలో భారత్ మానవతా విధానాలకు అగ్ర ప్రాధాన్యమిస్తుందని ఉద్ఘాటించారు. బ్రిక్స్ 'బిల్డింగ్ రెసీలియన్స్ అండ్ ఇన్నొవేషన్ ఫర్ కొవాపరేషన్ అండ్ సస్టెయినబిలిటీ' అనే కొత్త రూపంలో పునర్నిర్వచించేందుకు ఢిల్లీ కృషి చేస్తుందని చెప్పారు. 'పర్యావరణం, కాప్-30, ప్రపంచ ఆరోగ్యం'పై బ్రిక్స్ నిర్వహించిన సమావేశంలో మోదీ ప్రసంగించారు. 'జి-20' అధ్యక్ష స్థానంలో ఉన్నప్పుడు దక్షిణార్ధ గోళం (గ్లోబల్ సౌత్) అంశాలకు భారత్ ప్రాధాన్యమిచ్చిన సంగతిని ఆయన గుర్తుచేశారు. బ్రిక్స్ పగ్గాలు చేపట్టాక కూడా ప్రజలే కేంద్ర బిందువుగా ఉండే విధానాలను భారత్ అనుసరిస్తుందన్నారు.

**భవిష్యత్తుపై విశ్వాసం కల్పించాలి**

అభివృద్ధి చెందిన దేశాలకు భవిష్యత్తుపై ఉన్నంత విశ్వాసాన్ని ఇతర దేశాలకూ కల్పించాల్సిన అవసరాన్ని ప్రధాని నొక్కిచెప్పారు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా ఉన్నప్పటికీ.. పారిస్ వాగ్దానాలను గడువులోగా పూర్తిచేసిన తొలి దేశం భారతేనని గుర్తుచేశారు. 2070 కల్లా 'నెట్ జీరో' సాధించాలన్న లక్ష్యాన్ని అందుకునేందుకు వడివడిగా అడుగులు వేస్తున్నామని తెలిపారు.

## బ్రిక్స్‌కు మద్దతిచ్చే దేశాలపై 10% అడిషనల్ టాక్స్

### హెచ్చరించిన ట్రంప్.. కౌంటరిచ్చిన చైనా

వాణిజ్య సుంకాల విషయంలో కఠిన వైఖరిని అవలంబిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా మరో కీలక ప్రకటన చేశారు. బ్రిక్స్ అనుసరిస్తున్న అమెరికా వ్యతిరేక విధానాలకు మద్దతిచ్చే దేశాలపై 10% అదనపు సుంకాలు విధిస్తామని హెచ్చరించారు. ఇందులో మినహాయింపులేవీ ఉండవని స్పష్టం చేశారు. 'ట్రూత్ సోషల్'లో ఈ మేరకు పోస్ట్ పెట్టారు. ఏకపక్ష సుంకాల పెంపుపై బ్రిక్స్ కూటమి ఆదివారం ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో ట్రంప్ ఈ మేరకు స్పందించారు.

**బ్రిక్స్ ఘర్షణ కోరుకోదు.. కానీ..**

బ్రిక్స్కు మద్దతిచ్చే దేశాలపై అదనపు సుంకాలు విధిస్తామన్న ట్రంప్ హెచ్చరికపై చైనా ఆచితూచి స్పందించింది. బ్రిక్స్ ఘర్షణను కోరుకునే కూటమి కాదని స్పష్టం చేసింది. ఏ ఒక్క దేశాన్నీ అది లక్ష్యంగా చేసుకోదని కూడా పేర్కొంది. వాణిజ్య/సుంకాల యుద్ధంలో విజేతలెవరూ ఉండరని వ్యాఖ్యానించింది. చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ బీజింగ్లో విలేకరుల సమావేశంలో ఈ మేరకు మాట్లా

# యూరియా సకాలంలో సప్లై చేయండి



**హైదరాబాద్, జూలై 8, (మనం బ్యూరో):** తెలంగాణ రాష్ట్ర అవసరాలకు కేటాయించిన యూరియాను సకాలంలో సరఫరా చేయాలని కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జెపి నడ్డాకు సీఎం ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. దేశీయంగా ఉత్పత్తి అయిన యూరియా కోటా పెంచాలని పేర్కొన్నారు. ఈమేరకు మంగళవారం కేంద్ర మంత్రిని ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసంలో సీఎం కలిశారు. వానా కాలం సీజన్‌కు సంబంధించి ఏప్రిల్-జూన్ నెలల మధ్య 5 లక్షల మెట్రిక్ టన్నులకు గాను కేవలం 3.07 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేశారని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలో ప్రాజెక్టులకు నీరు రావడం, సాగు పనులు జోరుగా సాగుతున్నందున యూరియా సరఫరాలోఆటంకాలు తలెత్తకుండా చూడాలని కోరారు. జూలై నెలకు సంబంధించి 63 వేల మెట్రిక్ టన్నులు దేశీయంగా ఉత్పత్తి అయిన యూరియా, 97 వేల మెట్రిక్ టన్నుల విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న యూరియా రాష్ట్రానికి సరఫరా చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు కేవలం 29 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా జరిగిందని వివరించారు. యూరియా సరఫరాకు సంబంధించి రైల్వే శాఖ సరైన విధంగా రేక్‌లను కేటాయించడం లేదనీ, వెంటనే వాటి సంఖ్య పెంచాలని విజ్ఞప్తి చేశారు.

**మామునూరుకు ఆర్థిక సాయం చేయండి.. పీయూష్ గోయల్‌కు విజ్ఞప్తి**

జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అభివృద్ధికి సహకరించాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని వాణిజ్య భవన్‌లో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌తో సీఎం భేటీ అయ్యారు. జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అభివృద్ధికి జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి, అమలు ట్రస్ట్ ఆమోదించిన రూ.596.61 కోట్లను వెంటనే విడుదల చేయాలని కోరారు. స్మార్ట్ సిటీకి అవసరమైన నీటి సరఫరా విద్యుత్, ఇతర వసతుల కల్పనకు ఆర్థిక సాయం చేయాలని పేర్కొన్నారు. హైదరాబాద్-వరంగల్ పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా వరంగల్ విమానాశ్రయానికి నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని అభ్యర్థించారు. అలాగే, హైదరాబాద్-విజయవాడ పారిశ్రామిక కారిడార్ ఫీజుబిలిటీని అధ్యయనం చేస్తున్నట్లు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ ప్రభుత్వం ఆదిభట్లలో అత్యున్నత ప్రమాణాలతో ప్రత్యేకమైన రక్షణ, ఏరోస్పేస్ పార్కును ఏర్పాటు చేసిందనీ, ఈ నేపథ్యంలో హైదరాబాద్-బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌ను ఏరో డిఫెన్స్ కారిడార్‌గా మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేయాలి. పెట్టుబడులకు సిద్ధంగా ఉన్న వంద ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కుల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలు సమర్పిస్తామనీ, కేంద్ర ప్రభుత్వం వాటికి మద్దతుగా నిలవాలని కోరారు.

# మంత్రి పదవుల అంశం నా పరిధిలో లేదు

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడకుండా అక్కడికి రా..ఇక్కడికి రా చర్చిద్దాం అంటూ సవాల్ విసరడం వారి చేతగానితనానికి నిదర్శనమన్నారు. డీసీసీ కమిటీల నియామక ప్రక్రియ పూర్తయ్యాక డీసీసీ అధ్యక్షుల నియామకం ఉంటుందనీ, ఇందుకోసం ఏఐసీసీ అబ్జర్వర్లు త్వరలో రాష్ట్రానికి వస్తారనీ, ఈనెల చివరి వరకు అన్ని కమిటీలు పూర్తవుతాయని తెలిపారు. 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చాకనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలన్నది తమ పార్టీ ఆలోచన అనీ, ఈ దిశగా న్యాయ నిపుణులతో చర్చలు జరుపుతున్నామని చెప్పారు. అనిరుధ్‌రెడ్డి అంశంలో మల్లు రవి విచారణ చేస్తున్నారనీ, తీన్మార్ మల్లన్న కులగణన పత్రాలు తగులబెట్టారని చర్యలు తీసుకున్నారని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీలో స్వేచ్ఛ ఎక్కువ ఉందనీ, అందుకే నిరసనలు చేస్తున్నారని పేర్కొన్న పీసీసీ చీఫ్ ఆపరేషన్ ఆకర్ష్ ఇంకా లైవ్‌లోనే ఉందని స్పష్టం చేశారు. మంత్రి పదవుల అంశం తన పరిధిలో లేదనీ, రాజకీయాల్లో ఒక్కోసారి జూనియర్‌లకు ముందు అవకాశాలొస్తాయనీ, సీనియర్లను సైతం పార్టీలు గుర్తిస్తాయని చెప్పారు. ఎక్కడ బై ఎలక్షన్లు వచ్చినా సిద్ధంగా ఉన్నామనీ, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందనీ, సర్వేలు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేశాయని తెలిపారు. ఇక్కడ పోటీ చేసేందుకు 10 మంది సమర్థులు సిద్ధంగా ఉన్నారనీ, వేరే పార్టీ నుంచి అభ్యర్థిని ఎందుకు తీసుకుంటామని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో నిర్బంధ పాలన జరిగిందనీ, నెలలో 15 హౌస్ అరెస్టులు జరిగేవని గుర్తు చేశారు. మా హయాంలో నిర్బంధాలు లేవు, అందుకే కవిత ధర్నాలు చేస్తున్నది. కేసీఆర్ కట్టిన కాళేశ్వరం కూలిందనీ, అవినీతిపై విమర్శలు చేస్తే హౌస్ అరెస్టు చేశారని ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ గుర్తు చేశారు.

## ఆగస్టు 13న 'దివ్యాంగుల మహాగర్జన'

(మొదటి పేజీ తరువాయి)

పెద్ద ఎత్తున ఉద్యమ కార్యాచరణకు సిద్ధమైనట్లు ఆయన ప్రకటించారు. హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 13న హైదరాబాద్‌లో 'ఛలో దివ్యాంగుల మహాగర్జన' కార్యక్రమాన్ని నిర్వహించను న్నట్లు తెలిపారు. మంగళవారం ఆయన హైదరాబా ద్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావును కలిసి తమ పోరాటానికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ... దివ్యాంగుల సమస్యలపై ప్రతిపక్షాలు కూడా సరిగా స్పందించకపోవడం వల్లే తాము ప్రత్యక్ష పోరాటానికి దిగుతున్నామని స్పష్టం చేశారు. 'మహాగర్జన'కు సన్నాహకం గా ఈ నెల 13 నుంచి అన్ని జిల్లాల్లో సమావేశాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ ఎక్కడైతే హామీ ఇచ్చిందో అదే ఎల్బీ స్టేడియంలో మహాగర్జన సభ పెట్టి ప్రభుత్వానికి తమ నిరసన తెలియజేస్తామని అన్నారు. దీంతో పాటు, స్థానిక సంస్థల ఎన్నికలలో దివ్యాంగులకు రాజకీయంగా అవకాశం కల్పించేందుకు ప్రత్యేక ఆర్డినెన్స్‌ను తీసుకురావాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ప్రజావాణికి ప్రశంసలు

(మొదటి పేజీ తరువాయి)

భాగంగా ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్న విధానం చాలా బాగుందని ప్రశంసించింది. ఈ సందర్భంగా ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డా.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్‌లతో భేటీ అయ్యారు.

సీఎం ప్రజావాణి ద్వారా సామాన్య ప్రజలెదుర్కొంటున్న సమస్యలకు ఆయా ప్రభుత్వ శాఖలకు పంపించడమే కాకుండా ఎప్పటికప్పుడు వాటి పరిస్థితి ఏమిటని ఆరా తీస్తూ ఎక్కడా నిర్లక్ష్యం వహించకుండా సత్వరమే పరిష్కారమయ్యేలా చూస్తున్నామని చిన్నారెడ్డి వారికి వివరించారు.

## మెడికల్ కాలేజీలకు పాలనాధికారులు

(మొదటి పేజీ తరువాయి)

రెగ్యులర్ పద్ధతిలో పరిపాలనాధికారులను నియమించింది. 44 మంది సీనియర్ ప్రొఫెసర్లకు, అడిషనల్ మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లుగా ప్రమోషన్లు కల్పించింది. వారందరికీ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రిన్సిపాల్స్‌గా, టీచింగ్ హాస్పిటళ్లకు సూపరింటెండెంట్లుగా నియమించింది. ఈమేరకు మంగళవారం ప్రభుత్వం ఈజవో విడుదల చేసింది. అసోసియేట్ ప్రొఫెసర్లుగా పని చేస్తున్న 278 మందికి ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించే ప్రక్రియ చివరి దశకు వచ్చింది. ఏడీఎంఈల పోస్టింగ్ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో ప్రొఫెసర్లుగా ప్రమోట్ అయిన వారికి కూడా ప్రభుత్వం త్వరలో పోస్టింగ్స్ ఇవ్వనుంది. ఈ ప్రమోషన్లతో అన్ని కాలేజీల్లో ప్రొఫెసర్ల కొరత, డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీల కొరత తీరనుంది. అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పని చేస్తున్న సుమారు 231 మంది అసోసియేట్ ప్రొఫెసర్లుగా ప్రమోషన్లు ఇచ్చేందుకు ఆరోగ్య శాఖ చర్యలు ప్రారంభించింది. అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్, అడిషనల్ డీఎంఈ వంటి పోస్టులను నేరుగా రిక్రూట్ చేసుకునే అవకాశం లేకపోవడంతో ప్రమోషన్ల ద్వారా ఈ పోస్టులను భర్తీ చేస్తున్నది. 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను నేరుగా భర్తీ చేసేందుకు మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఇటీవలే నోటిఫికేషన్ జారీ చేసింది. ఇవి కాకుండా సుమారు మరో 714 పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. ఈ పోస్టులను సైతం త్వరలోనే భర్తీ చేయనున్నారు.

## భద్రాచలం ఈఓపై భూ కబ్జాకోరుల దాడి

(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రాలోని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం పురుషోత్తమ పట్నంలోనే ఉంది. ఈ భూమి చాలా వరకు ఆక్రమణకు గురైంది. దీనిపై చాలా కాలంగా వివాదం నడుస్తోంది. ఇటీవల కోర్టు తీర్పు ప్రకారం ఈ భూములు దేవస్థానానికే దక్కాయి. అయినా పురుషోత్తమ పట్నం వాసుల్లో కొందరు కోర్టు తీర్పును లెక్క చేయకుండా దేవాలయ భూముల్లో నిర్మాణాలకు పూనుకుంటున్నారు. గ్రామంలోకి ప్రవేశించే మార్గంలో నిర్మాణ పనులు చేపడుతున్నారనే సమాచారంతో ఈఓ రమాదేవి మంగళవారం తన సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. ఇది పూర్తిగా రాముడి భూమి అని, ఇక్కడ నిర్మాణాలు చేపట్టవద్దని వివరించారు. అయినా ఆక్రమణదారులు వినకుండా ఈఓపై దాడికి దిగారు. ఈ ఘర్షణలో ఆమె స్పృహ కోల్పోయారు. దీంతో ఆలయ సిబ్బంది ఆమెను భద్రాచలంలోని ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుత ఆమె పరిస్థితి నిలకడగానే ఉంది.

## ఆక్రమణదారులపై పీడీ పెట్టం

(మొదటి పేజీ తరువాయి)

మంత్రికి ఈవో వివరించగా, దేవాదాయ శాఖ నుంచి అన్ని విధాలుగా అండగా ఉంటామనీ, వైద్యుల సూచన మేరకు చికిత్స పొందాలని సూచించారు. ఇదిలా ఉండగా, భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామికి ఏపీలోని పురుషోత్తమపట్నంలో భూములున్న విషయం విదితమే. ఆ భూమిలో అనుమతి లేకుండా భవన నిర్మాణ పనులు చేపడుతుండటంతో భద్రాచలం దేవస్థాన సిబ్బంది దాన్ని అడ్డుకునే క్రమంలో ఆ గ్రామస్థులతో తరచూ ఘర్షణ జరుగుతోంది. ఏపీ, తెలంగాణలో భద్రాద్రి రాముడికి సుమారు 1300 ఎకరాల భూమి ఉండగా, అందులో అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం పురుషోత్తమపట్నంలోనే గరిష్టంగా 889.5 ఎకరాలు ఉంది. పురుషోత్తమపట్నంలోని భూమి ఎక్కువ భాగం ఆక్రమణకు గురైంది. కోర్టు తీర్పు ప్రకారం ఈ భూమిపై దేవస్థానానికి హక్కులు లభించాయి. అయినా, ఈ గ్రామంలో నిర్మాణ పనులు చేపడుతున్నారనే సమాచారం అందుకున్న ఆలయ సిబ్బంది ఈవో రమాదేవి సారథ్యంలో అక్కడికి చేరుకుని రాముడి భూమిలో అనుమతి లేకుండా ఇండ్ల నిర్మాణం చేయొద్దని అడ్డుకున్నారు. ఈవో, దేవస్థాన సిబ్బంది అభ్యంతరాలు వినకుండా స్థానికులు ఈవోపై దాడి చేశారు.

## పెరుగుతున్న మృతులు

**హైదరాబాద్,** మనం ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి ఇండస్ట్రీలో జరిగిన భారీ పేలుడు ఘటనలో మృతుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఈ విషాదంలో మరణించిన వారి సంఖ్య 44కు చేరింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మరో ఇద్దరు కార్మికులు మంగళవారం కన్నుమూశారని అధికారులు వెల్లడించారు. సంగారెడ్డిలో చికిత్స పొందుతున్న అఖిలేశ్వర్, బీరంగూడ ఆసుపత్రిలో ఆరిఫ్ మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. పేలుడు తర్వాత ఆసుపత్రుల్లో చేరిన వారిలో గత వారం రోజుల్లో ఇప్పటివరకు 8 మంది మరణించారు. మరో 16 మంది కార్మికుల కోసం అగ్నిమాపక, ఎస్డీఆర్ఎఫ్, హైడ్రా, పోలీసు బృందాలు శిథిలాల కింద గాలింపు చర్యలను ముమ్మరంగా కొనసాగిస్తున్నాయి. గల్లంతైన తమ వారి కోసం బాధితుల కుటుంబాలు సహాయ కేంద్రం వద్ద ఆందోళనతో ఎదురుచూస్తున్నాయి.

# నేనొచ్చిన.. మీరెక్కడ?

**హైదరాబాద్,** మనం ప్రతినిధి: రైతు సంక్షేమంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విసిరిన సవాల్‌ను స్వీకరించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చర్చకు తానూ సిద్ధమంటూ సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌కు చేరుకున్నారు. గత వారం రోజులుగా సవాల్ ప్రతిసవాళ్ల నడుమ నేను వస్తున్న మీరు సిద్ధమేనా? అంటూ చెప్పినట్లుగానే ఆయన నేరుగా మంగళవారంనాడు ప్రెస్ క్లబ్‌కు బయలుదేరి వెళ్లారు. కేటీఆర్ వెంట పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ పార్టీకి చెందిన కీలక నేతలంతా ప్రెస్‌క్లబ్‌కు తోడుగా వెళ్లారు. వారికి సంఘీబావంగా బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు,అభిమానులు పెద్ద ఎత్తున సోమాజీగూడ చేరుకొని జై తెలంగాణ, జై బీఆర్ఎస్, జై కేసీఆర్, జై కేటీఆర్ అంటూ నినాదాలు చేశారు. దీంతో సోమాజీగూడ ప్రెస్ క్లబ్, పరిసర ప్రాంతాల్లో ఒక్కసారిగా వాతవరణం మారిపోయింది. కాసేపు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి ఎదురైంది. కేటీఆర్ చెప్పినట్లుగా ప్రెస్‌క్లబ్‌కు రావాడంతో తెలంగాణలో మరోసారి రాజకీయ వేడి రాజుకుంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ తనదైన శైలీలో తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. 420 బూటకపు హామీలతో తెలంగాణలో గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కార్ మోసపూరిత పాలన సాగిస్తోందని ఆరోపించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను వంచిస్తోందని విరుచుకుపడ్డారు.

ముఖ్యమంత్రి చాలా బిజీగా ఉంటారు. అందుకే ఆయనకు మరొక అవకాశం ఇస్తున్నాను. ప్లేసు, డేటు ,టైము, మీరు డిసైడ్ చేయండి. జూబ్లీహిల్స్ ప్యాలెస్‌కు రమ్మంటే కూడా వస్తాము. ఏ అంశం మీద చర్చ పెట్టినా చర్చించడానికి కేసీఆర్ తయారుచేసిన గులాబీ దండు సైనికులం తయారుగా ఉన్నాం... రైతు రుణమాఫీ, బోనస్ వంటి కీలక అంశాలపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నాం.. ప్రజా సమస్యలు, ఇచ్చిన హామీలపై ఈ దుష్ట కాంగ్రెస్‌ను ఎన్నిసార్లు నిలదీసిన దున్నపోతు మీద వాన పడ్డట్టే ఉందన్నారు. కనీసం అభివృద్ధిపై చర్చకు రావాలని సీఎంను ఎన్నోసార్లు ఆహ్వానించామని కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఇక్కడకు రాలేకపోతే? ప్రిపేర్ కాకపోతే? 'అసెంబ్లీలో చర్చిద్దామా? అంటూ సవాల్ విసిరారు. పోనీ 'అసెంబ్లీలోనైనా చర్చిద్దామా? అంటే మాకు మైకు ఇవ్వరు?.. అందుకే, మీ సవాల్‌ను స్వీకరించి నేనే ప్రెస్ క్లబ్‌కు వచ్చా.. ఇక్కడనైనా సరే? చర్చకు రావాలి? అని ఆయన డిమాండ్ చేశారు.

ముందుగా చెప్పినట్లుగానే తానూ ఇక్కడికి వచ్చానన్నారు. అయితే, ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటనలో ఉన్నారని తనకు ఇప్పుడే తెలిసిందన్నారు. ఆయన హాజరుకాలేకపోతే? కనీసం.. మంత్రులనైనా చర్చకు పంపాలని కేటీఆర్ సూచించారు. లేదంటే? సీఎం రేవంత్ రెడ్డియే తన వీలు చూసుకొని తేదీ, సమయం, ప్రదేశం చెప్పినా తాము చర్చకు సిద్ధంగా ఉన్నామని కేటీఆర్ మరోసారి స్పష్టం చేశారు. ప్రజాక్షేత్రంలోకి రాలేననుకుంటే? అసెంబ్లీలో తమ మైక్ కట్ చేయకుండా మాట్లాడే అవకాశం ఇస్తే అక్కడే చర్చించడానికి కూడా తమకు ఎలాంటి అభ్యంతరం లేదని కేటీఆర్ ఈ సందర్భంగా తెలిపారు. కేటీఆర్ వెంట మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, పలువురు బీఆర్ఎస్ నేతలు, పార్టీ కార్యకర్తలు, కేటీఆర్ అభిమానులు పెద్ద ఎత్తున సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌కు చేరుకున్నారు. సోషల్ మీడియాలో పిల్లలు పోస్టులు పెడితేనే రేవంత్ రెడ్డి గజ గజ వణికిపోతున్నావు?.. వాళ్ళని తీసుకెళ్లి జైల్లో పెడుతున్నావు? ఆయనకు కేసీఆర్ కావాలా? రేవంత్ రెడ్డికి కేసీఆర్ అవసరం లేదు?.. నేనే కాదు? మా పార్టీలో ఏ నాయకుడైనా రేవంత్ రెడ్డికి సరిపోతరు?...కానీ, ఆయన ముచ్చటపడి మా పేరు తీసిండనే.. నేను ఇక్కడకు వచ్చాను.

# 67 మందిని రక్షించిన కుక్క

**హిమాచల్ ప్రదేశ్‌లోని మండి ప్రాంతంలో ఘటన**

**మండి, జూలై 8:** వరదలతో సర్వస్వం కోల్పోతున్న హిమాచల్ ప్రదేశ్‌లో ఒక కుక్క తన అరుపుతో 67 మంది ప్రాణాలను కాపాడి ప్రశంసలు పొందుతోంది.

భారీ వర్షాలతో మండి జిల్లా తీవ్రంగా ప్రభావితమైంది. అక్కడ సియతి అనే గ్రామంలో జూన్ 30న అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో పెద్ద కొండచరియ విరిగిపడింది. ఆ గ్రామస్థుడు నరేంద్ర మాట్లాడుతూ.. "మా ఇంటి రెండోఅంతస్తులో ప్రతిరోజు ఓ శునకం నిద్ర పోతుంది. అయితే, ఆరోజు ఉన్నట్టుండి అది విపరీతంగా అరవడం మొదలుపెట్టింది. మరోవైపు కుంభవృష్టి కురుస్తోంది. ఆ అరుపుల శబ్దానికి నేను లేచి దాని దగ్గరకు వెళ్లాను. పైకి వెళ్లగా ఇంటిగోడకు పగుళ్లు కనిపించాయి. ఇంట్లోకి నీరు రావడం మొదలైంది. దాంతో వెంటనే కుక్కను కూడా కిందికి తీసుకెళ్లి, అందరినీ నిద్ర లేపాను. ఇంటి చుట్టుపక్కల ఇండ్లకు వెళ్లి వారిని కూడా లేపి, సురక్షిత ప్రాంతానికి వెళ్లమని చెప్పాను. అలా దూరంగా వెళ్లామో, లేదో మా గ్రామంపై కొండచరియ విరిగిపడింది. పదుల సంఖ్యలో మా ఇండ్లన్నీ దానికింద నేలమట్టమయ్యాయి.' అని ఆయన తెలిపారు.

# నవోదయలో 6వ తరగతి ప్రవేశాలు

(మొదటి పేజీ తరువాయి)

వెబ్సైట్ ద్వారా జూలై 29వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని నవోదయ విద్యాలయ సమితి సూచించింది. నవోదయ పాఠశాలల్లో సీటు సాధిస్తే ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్య, వసతి పూర్తిగా ఉచితంగా లభిస్తాయి.

దేశవ్యాప్తంగా మొత్తం 654 నవోదయ విద్యాలయాలు ఉండగా, ఆంధ్రప్రదేశ్లో 15, తెలంగాణలో 9 ఉన్నాయి. ఈ సీట్ల భర్తీ కోసం రెండు దశల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో 2025 డిసెంబర్ 13న పరీక్ష జరగనుంది. కొన్ని పర్వత ప్రాంత రాష్ట్రాల్లో మాత్రం 2026 ఏప్రిల్ 11న నిర్వహిస్తారు. విద్యార్థులు తాము ప్రవేశం కోరుకుంటున్న జిల్లాలోనే 5వ తరగతి చదువుతూ ఉండాలి. మొత్తం సీట్లలో 75 శాతం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కేటాయించారు. గ్రామీణ కోటా కోసం విద్యార్థులు 3, 4, 5 తరగతులను తప్పనిసరిగా గ్రామీణ ప్రాంతంలోని ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన పాఠశాలలో పూర్తిచేయాలి. బాలికల కోసం మూడో వంతు సీట్లు రిజర్వ్ చేశారు. వీటితో పాటు ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం, ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయి. ప్రవేశ పరీక్షను 100 మార్కులకు 80 ఆబ్జెక్టివ్ ప్రశ్నలతో రెండు గంటల పాటు నిర్వహిస్తారు. పరీక్షలో నెగెటివ్ మార్కులు లేవు. ఇక్కడ చదివే విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు, ఇతర నైపుణ్యాల్లో శిక్షణ ఇస్తూ, జేఈఈ, నీట్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు కూడా సిద్ధం చేస్తారు. ఒక్కో నవోదయ పాఠశాలలో గరిష్ఠంగా 80 మంది విద్యార్థులకు 6వ తరగతిలో ప్రవేశం లభిస్తుంది. బాలబాలికలకు విడిగా వసతి కల్పిస్తారు.

## బీసీ బిల్లు మోదించకపోతే? రైలు చక్రాలను కలదలనియ్యం

### ఢిల్లీ మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ కవిత

**హైదరాబాద్/న్యూ ఢిల్లీ,** మనం ప్రతినిధి: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించకపోతే ఒక్క రైలు చక్రాన్ని కూడా ముందుకు కదలనివ్వబోమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్ల బిల్లుపై మంగళవారం ఢిల్లీలోని కానిస్టిట్యూషన్ క్లబ్‌లో తెలంగాణ జాగతి ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ కవిత మాట్లాడారు. తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా కాంగ్రెస్, బీజేపీ పార్టీలు చేస్తున్న మోసానికి నిరసనగా, బీసీ బిల్లులను రాష్ట్రపతి ఆమోదించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి ఈ నెల 17వ తేదీన రైల్ రోకో నిర్వహిస్తున్నట్లు ప్రకటించిన ఎమ్మెల్సీ కవిత... ఒక్క రైలు చక్రాన్ని కూడా కదలనివ్వబోము. డెక్కన్ నుంచి ఢిల్లీకి రైళ్లను రానిచ్చేది లేదు.

## విదేశీ విద్యార్థులకు 'బ్యూటిఫుల్' షాక్

(మొదటి పేజీ తరువాయి)

చేసుకోకుండా) అమెరికాను వీడే వారికి..

ఐ-94 గడువు కంటే ముందే చట్టపరంగా కొనసాగింపు, శాశ్వత నివాస అనుమతి లభించిన వారికి మాత్రమే వీసా ఇంటిగ్రిటీ ఫీజు రీఫండ్ అవకాశం ఉంటుంది.

**విదేశీ విద్యార్థులపై త్రీవ ఆర్థిక భారం..**

అమెరికాలో చదువులు, ఉద్యోగం కోసం వచ్చే వారిపై ఈ చట్టం ప్రభావం చూపనుంది. ముఖ్యంగా అంతర్జాతీయ విద్యార్థులు, సాంకేతిక నిపుణులు, టూరిస్టులు, హెచ్ 1బీ వీసాపై వచ్చే ఉద్యోగులకు ఆర్థికంగా కొంత భారంగా మారనున్నట్లు తెలుస్తోంది. వీసా ఇంటిగ్రిటీ ఫీజుతోపాటు ఐ-94, ఈఎస్టీఏ, ఈవీయూఎస్ ఫీజులు కూడా పెరగనున్నట్లు సమాచారం. శరణార్థులు కొత్తగా, రెన్యూవల్ కోసం దరఖాస్తు చేసుకునే వారిపైనా వీసా రుసుం భారం ఎక్కువ కానున్నట్లు తెలు



# ప్రజా ప్రభుత్వాన్ని గుండెల్లో పెట్టుకొని కాపాడుకోవాలి

- దేశంలో ప్రజల గురించి ఆలోచించే ఏకైక పార్టీ కాంగ్రెస్
- కేసముద్రం సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు




**కేసముద్రం, జూలై 08(మనం న్యూస్):** నిన్న రైతు భరోసా కింద తొమ్మిది రోజుల్లో 9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశాం, ఈనెల 12 నుంచి డ్వాక్రా మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా వడ్డీ లేని రుణాల పంపిణీ ఒక ఉత్సవంలా నిర్వహిస్తాం, ఆ తర్వాత నిరుద్యోగ యువత కోసం 8 వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం ఉత్సవంలా చేపడుతామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం ఆయన మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో ఏర్పాటు చేసిన భారీ సభలో ప్రసంగించారు. ఈ దేశంలో అందరి గురించి ఆలోచించే ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని, చేయి గుర్తును, ప్రజా ప్రభుత్వాన్ని గుండెల్లో పెట్టుకుని కాపాడాలని డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం క్షేమంగా సంతోషంగా ఉండాలన్న ఆకాంక్షతో లక్ష కోట్లకు పైగా పెట్టుబడితో లెక్క లేనన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వంలోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యావత్ క్యాబినెట్ 18 గంటల పాటు రాష్ట్ర సంక్షేమం కోసం విరామం లేకుండా పనిచేస్తున్నారని వివరించారు. రూపాయి రూపాయి పోగుచేసి ప్రజల సంక్షేమం కోసం ఖర్చు పెడుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో 1.12 కోట్ల కుటుంబాలు ఉండగా 90 లక్షల పైగా కుటుంబాలకు ఏదో ఒక సంక్షేమ కార్యక్రమం అందుతుందని తెలిపారు. తెలంగాణ రైజింగ్ దేశంలోనే తెలంగాణ మోడల్ గా ఉండాలని, దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు చూసి వెళ్లేలా ఇందిరమ్మ ప్రభుత్వం పని చేస్తుందని వివరించారు. పంటలు పండించే రైతులకు రైతు భరోసా, బ్యాంకుల్లో రుణాలు తెచ్చుకుని సాగు చేస్తున్న రైతులకు రైతు రుణమాఫీ, పిల్లలు చదువుకునేందుకు రెసిడెన్షియల్ పాఠశాలలు ఇంకా బాగా చదువుకుంటాం అనుకునే వారి కోసం ఫీజు రియంబర్స్మెంట్ పథకం, ఇంట్లో పెద్దలు ఉంటే చేయూత పథకం కింద పెన్షన్, ఇంటిల్లిపాది తినేందుకు సన్న బియ్యం, వంట చేసుకోవడానికి 500 రూపాయలకే గ్యాస్, ఆరోగ్యం బాగా లేకపోతే 10 లక్షల వరకు రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్యం, పనిచేసే శక్తి ఉంటే ఉపాధి హామీ పథకం కింద పని, చదువుకొని ప్రతిభ ఉంటే పబ్లిక్ సర్వీస్ కమిషన్ను ప్రక్షాళన చేసి 56వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసాం, ప్రభుత్వ ఉద్యోగాలు దక్కని వారికోసం రాజీవ్ యువ వికాసం పేరిట 8000 కోట్లతో స్వయం ఉపాధి పథకం, మహిళలు ప్రయాణించేందుకు ఉచితంగా ఆర్టీసీ బస్సు రవాణా సౌకర్యం, మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు వడ్డీ లేని రుణాలు ఇలా పుట్టిన బిడ్డనుంచి వృద్ధుడి వరకు ఏదో ఒక పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వివరించారు. రాష్ట్రంలోని ఏ ఒక్కరిని వదలకుండా ప్రజా ప్రభుత్వం గుండెల్లో పెట్టుకొని చూసుకుంటుందని వివరించారు.. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే, భూక్యా మురళి నాయక్, ఎంపీ బలరాం నాయక్,రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటి రెడ్డి వెంకటరెడ్డి, సీతక్క, సురేఖ,ప్రభుత్వ విప్ రామచంద్ర నాయక్ సీఎం సలహాదారులు వేం నరేందేర్ రెడ్డి ఇల్లందు ఎమ్మెల్యే కనకయ్య,జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు భరత్ చందర్ రెడ్డి, కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి అల్లం నాగేశ్వరావు, అంబటి మహేందేర్ రెడ్డి, రావుల మురళి, అధికారులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాలుగోన్నారు.

# ప్రజల ఆరాధ్య దైవం వైఎస్ రాజశేఖర్ రెడ్డి

- పిసిసి కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ గౌడ్

**కడ్తాల్, జులై 8 ( మనం, న్యూస్ ):** జనహృదయ నేత ప్రియతమ దివంగత మహానేత మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా మంగళవారం కడ్తాల్ మండల కేంద్రంలోని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బీచ్యా నాయక్ ఆధ్వర్యంలో వైఎస్ సేవలను గుర్తు చేసుకుంటూ తమ ఆశయాలను కొనసాగించాలని కోరుతూ అయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా పిసిసి కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, డిసిసి అదికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, అమనగల్ మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ - గూడూరు భాస్కర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ్ మాట్లాడుతూ డా.వైఎస్ఆర్ పేదల ఆశాజ్యోతి, తెలుగు ప్రజల ఆరాధ్య నాయకుడని కొనియాడారు. 108 అంబులెన్స్, ఆరోగ్యశ్రీ, రెండు రూపాయలకే కిలో బియ్యం, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్, అసరా పెన్షన్లు, రైతుల రుణామాఫి, మైనార్టీలకు 4%రిజర్వేషన్లు మరియు మరెన్నో సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిన నాయకుడని అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ విప్లవం తీసుకొచ్చి అనుక్షణం పేదల సంక్షేమం కోసమే ఆరాటపడే నాయకుడు అని అన్నారు. ప్రజల గుండెల్లో ఎప్పుడు చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి వైఎస్ రాజశేఖర్ రెడ్డిని అన్నారు. పేదవాడి గుండె చప్పుడు బాగా తెలిసిన నాయకుడని, తెలుగువారికి బ్రాండ్ అంబాసిడర్ అని కొనియాడారు. తెలుగు జాతి ఉన్నంత కాలం చరిత్రలో రాజశేఖరరెడ్డి నిలిచిపోతారని, డా. వైఎస్ఆర్ ఆనాడు కళలు కన్న రాష్ట్ర అభివృద్ధి ఈనాడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో జరుగుతుందన్నారు. వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న రోజులలో ఆనాడు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపాడో ఈ రోజు రేవంత్ రెడ్డి కూడా అభివృద్ధి మరియు సంక్షేమంతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నాడని ప్రజలందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు హన్మా నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నరసింహ, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేష్, మార్కెట్ డైరెక్టర్ నరేష్, సీనియర్ నాయకులు లక్ష్మయ్య, జహంగీర్ అలీ, సత్యం యాదవ్, యాదయ్య గౌడ్, బాలరాజు, లక్ష్మణ్ నాయక్, రామకృష్ణ, లకృతి నాయక్, జవహర్, బిక్షపతి, శ్రీను, మల్లయ్య, నరేందర్, రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి క్యామ రాజేష్, మండల అధ్యక్షులు బోస్ రవి, స్టాలిన్, భానుకిరణ్, రమేష్, మల్లేష్, తులసి రామ్, సందీప్, ఆకాష్, శ్రీకాంత్, రామకృష్ణ, మహేష్, సేవ్యా నాయక్, శ్రీను నాయక్ మరియు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## మహిళలను కోటీశ్వర్లుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం



- సెర్ప్ ఐబి అధికారి నర్సింహ

**చేవెళ్ల, జులై 8 (మనం న్యూస్ ):** పలు స్కీమ్లు ఏర్పాటు చేసి మహిళలను కోటీశ్వరులను చేయడమే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని సెర్ప్ ఐబి అధికారి నర్సింహ అన్నారు. మంగళవారం చేవెళ్ల మండలం సమాఖ్య కార్యాలయంలో ఇందిరా మహిళ శక్తి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ సహకారంతో మహిళా సంఘాలు ఎంతో ప్రగతిని సాధించాయన్నారు. మహిళా అబివృద్ధి కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందని, ఈ పథకాలన్ని అర్హులైన మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాన్ పార్మ్ డీపీఎం సమాఖ్య అధ్యక్షురాలు భారతీ, అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలి

- నాలుగు లేబర్ కోడ్స్ ను వెంటనే రద్దు చేయాలి
- జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులంతా ఏకం కావాలి
- సిఐటియు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కిషన్



**తుర్కయంజాల్, జులై 8( మనం న్యూస్):** కేంద్ర బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కార్మిక వర్గాన్ని బలిచ్చేందుకు తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ ను వెంటనే రద్దు చేయాలని పాత కార్మిక చట్టాలు యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ జూలై 9 వ తేదీన జరగబోయే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని తెలియజేస్తూ, తుర్కయంజాల్ మంగళవారం మున్సిపల్ ప్రాంతంలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న పారిశ్రామిక కార్మికులకు అసంఘటిత రంగ కార్మికులకు, ట్రాన్స్పోర్ట్, హమాలీ రంగ కార్మికులకు, మున్సిపల్ కార్మికులకు భవన నిర్మాణ రంగ కార్మికులకు సిఐటియు నాయకులు కరపత్రాలు పంచి విస్తృతంగా సమ్మెకు సన్నద్ధం చేయడం జరిగింది. సిఐటియు రంగారెడ్డి జిల్లా కార్యదర్శి డి కిషన్ మాట్లాడుతూ మేడే అమరవీరుల స్ఫూర్తితో దేశ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న హక్కులను చట్టాలను నేడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాలరాస్తుందని పెట్టుబడిదారీ, కార్పోరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చేందుకు కుట్రపూర్తమైన చర్యలకు పూనుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు లేబుల్ కోడ్ లను బలపరుస్తూ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం జీవో నెంబర్ 282 ను ప్రవేశపెట్టి ఎనిమిది గంటల స్థానంలో 12 గంటలు పని చేయించవచ్చని ఆదేశాలు జారీ చేయడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు జూలై 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతికటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు తుర్కయంజాల్ మున్సిపల్ నాయకులు మండల సత్యనారాయణ, జంగిలి ఆశీర్వాదం, కందుకూరి శారద, ఇల్లూరి భాస్కర్, బడుగు శంకరయ్య, నక్కల్ల యాదగిరి,తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేసిన ఎమ్మెల్యే



**చేవెళ్ల, జులై 8(మనం న్యూస్ ):** చేవెళ్ల పట్టణ సమీపంలోని ఇబ్రహీంపల్లి కాలనీకి చెందిన లబ్ధిదారుడి ఇంట్లో ఎమ్మెల్యే కాలే యాదయ్య భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పంపిణీ చేసిన సన్నబియ్యంతో వండిన భోజనం సంతృప్తినిచ్చిందని, సీఎం రేవంత్ రెడ్డి ప్రతి నిరుపేద ఇంట్లో సన్నబియ్యం భోజనం ఉండాలనే లక్ష్యంతోనే ఈ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధు సూధన్ రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్లు దేవర వెంకటరెడ్డి, ప్రతాప్ రెడ్డి,పిఏసి ఎస్ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి,మాజీ సర్పంచ్ శంకర్, గుండాల రాములు, వసంతం, నాయకులు మర్పల్లి కృష్ణా రెడ్డి,జనార్ధన్ రెడ్డి, జగన్ గౌడ్,చాన్ పాషా, మహేందర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలపై టీడబ్ల్యూజేఎఫ్ పోరాటం చేస్తుంది

- టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శి సైదులు.
- మహేశ్వరం నియోజకవర్గం టిడబ్ల్యూజేఎఫ్ నూతన కమిటీ ఎన్నిక.
- మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షుడుగా తడక నరసింహ

**రంగారెడ్డి, జూలై 8 (మనం న్యూస్):** టిడబ్ల్యూజేఎఫ్ (తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్) జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం న్యాయ పోరాటం చేస్తుందని టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శి సైదులు అన్నారు.మంగళవారం మహేశ్వరం మండల కేంద్రంలోని రఘుపతి కాంప్లెక్స్ లో టిడబ్ల్యూజేఎఫ్ మహేశ్వరం నియోజకవర్గం నూతన కమిటీని ఎన్నుకున్నారు. టిడబ్ల్యూజేఎఫ్ మహేశ్వరం నియోజకవర్గం నూతన కమిటీ టిడబ్ల్యూజేఎఫ్ మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడిగా తడక నర్సింహ,కార్యదర్శిగా కోర్వీ సురేందర్, ఉపాధ్యక్షులుగా రాందాస్, మిద్దింటి ప్రభాకర్,మీసాల శ్రీనివాస్ రావు, సహాయ కార్యదర్శులుగా పార్లకుర్ల వెంకటేష్,మారమోనీ ప్రశాంత్, కోశాధికారిగా రాజు, ప్రచార కార్యదర్శిగా రాజేశ్వరిని ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ రిపోర్టర్లు గణేష్ ,సురేష్, టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు శ్రీరాములు,శేఖర్, ఆంజనేయులు,చండీశ్వర్, రిపోర్టర్లు బంటు వెంకటేష్, శేఖర్ , రాము, నాగేష్, రాజేందర్, భాస్కర్, చంద్రశేఖర్ , సాయి, రాజేష్, కిరణ్, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు స్కూల్ బ్యాగ్స్ కుర్చీలు వితరణ



**రంగారెడ్డి, జూలై 8 (మనం న్యూస్):** సగౌర చారిటబుల్ ట్రస్ట్ సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కాలడేరాలో విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ , కుర్చీలు డొనేట్ చేయడం జరిగింది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల బ్లైండ్ దారుల్ సిఫా లో అంద విద్యార్థులకు ఇంటర్నెట్ సౌకర్యము, ఆయాకు గౌరవ వేతనం ఈ విద్యా సంవత్సరానికి అందచేశారు. ప్రధానోపాధ్యాయులు సగౌర చారిటబుల్ ట్రస్ట్ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ జనరల్ సెక్రెటరీ కె.ప్రభాకర్ రావు , మెంబర్లు వి వెంకట్రావు, ఎస్ నాగేశ్వరరావు, డాక్టర్ సూర్య ప్రకాష్ , సైదాబాద్ మండల ఉప విద్యాశాఖ అధికారి రాధాకృష్ణ, సైదాబాద్ మండల ఉప పర్యవేక్షణ అధికారి వర ప్రసాద్ రెడ్డి , పాఠశాల ప్రాధనోపాధ్యాయులు గుమ్మడపు ఆంజనేశ్వరరావు , మందడి వెంకట రెడ్డి , ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు సుజాత, నిర్మల, అమరావతి, సమత, స్వాతి, ఉదయ్ పాల్గొన్నారు.

## వంద రోజుల కార్యాచరణలో బాలబాలికలతో గణవ్యర్థలపై అవగాహన సదస్సు




**తుర్కయంజాల్,జులై 8( మనం న్యూస్):** వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను మంగళవారం విజయవంతంగా అమలు చేయడంలో మహిళా సాధికారత కీలకమైన పాత్ర పోషిస్తోంది. వంద రోజుల కార్యాచరణలో భాగంగా,స్వయం ఉపాధి సంఘాలు, ముఖ్యంగా బాలబాలికల్లో, ఘన వ్యర్థాలపై అవగాహన పెంచే ఉద్దేశ్యంతో కమ్మగూడ లోటస్ లాప్ స్కూల్ ప్రాంగణంలో రీసైకిల్ మేళా ను విజయవంతంగా నిర్వహించారు.ఈ మేళా ద్వారా పాత న్యూస్ పేపర్లు, పాత నోట్ పుస్తకాలు, ప్లాస్టిక్ బాటిళ్లు వంటి 1 టన్ను ఘన వ్యర్థాలు సేకరించబడ్డాయి. వాటిని ఉపయోగకరమైన స్టేషనరీ వస్తువులతో మార్పిడి చేసి విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగింది. దీని ద్వారా పర్యావరణంపై అవగాహన పెరిగడం తో పాటు ,ప్లాస్టిక్ రహిత ప్రత్యామ్నాయాల వినియోగం కూడా ప్రోత్సహించబడింది. ఈ సందర్భంగా కమిషనర్ అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ, బాలబాలికల్లో గణవ్యర్థాల అవగాహన పెంచే ఉద్దేశంతో పాఠశాలలో గణవ్యర్థాల నిర్వహణ, రీస్కైక్లింగ్, కంపోస్టింగ్ పై అవగాహన చేయడం, ప్రాక్టికల్ కార్యకలాపాలు వ్యర్థాలను వర్గీకరించడం, పాత పుస్తకాలతో క్రాఫ్టులు తయారు చేయడం వంటే చేతి పనుల ద్వారా అవగాహన కల్పించడం, తల్లిదండ్రులతో కలిసి ఇంట్లో వ్యర్థాలను తగ్గించే, పునర్వినియోగించే అలవాట్లను ప్రోత్సహించడం జరిగింది.ఇలాంటి కార్యక్రమాలు మహిళల ఆర్థిక స్వావలంబనకు దోహదపడతాయి. అలాగే పర్యావరణ పరిరక్షణలో మహిళల పాత్ర అనన్యసామాన్యమైనది. అని పేర్కొన్నారు.ప్రతి రోజు ప్రతి ఇంటిలో తడి - పొడి చెత్త వేరు చేసి మునిసిపల్ వాహనానికి అందించే విధంగా మహిళా సంఘాలు మరింత చురుకుగా పని చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సానిటేషన్ ఇన్స్పెక్టర్ వినయ్, వార్డ్ ఆఫీసర్లు, మున్సిపాలిటీ సిబ్బంది శివ, పాల్గొన్నారు.

## దివంగత వైఎస్సార్ సేవలు మరువలేనివి

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య





**చేవెళ్ల, జులై 8(మనం న్యూస్):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా దివంగత వైఎస్ రాజశేఖరెడ్డి విద్య, వైద్య, ప్రజా అభివృద్ధి, సంక్షేమా పథకాల సేవలు మరువలేనివని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. వైఎస్సార్ 76వ జయంతి సందర్భంగా చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలోని షాబాద్ చౌరస్తాలో వైఎస్సార్ విగ్రహానికి స్థానిక నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉమ్మడి రాష్ట్రంలో రాజశేఖర్ రెడ్డి నిరుపేదల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని కొనియాడారు. విద్యార్థుల కోసం ఫీజు రీయింబర్స్మెంట్, ఉచిత వైద్యం కోసం ఆరోగ్యశ్రీ పథకాలను రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టి ఉమ్మడి రాష్ట్ర ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సున్నపు వసంతం, పీఏసిఎస్ చైర్మన్లు దేవర వెంకట్ రెడ్డి, గోనె ప్రతాప్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్పల్లి కృష్ణారెడ్డి, మున్సిపల్ అధ్యక్షులు,మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ఉప సర్పంచులు, గుడిమల్కాపూర్ డైరెక్టర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# వైయస్సార్ సేవలు మరువలేనివి

- దేప భాస్కర్ రెడ్డి



**రంగారెడ్డి జూలై 8 (మనం న్యూస్):** ప్రజా సేవకు తమ రాజకీయ జీవితాన్ని అంకితం చేసిన మహనీయ నేతల్లో అగ్రగణ్యులు దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి అని టి పీసీసీ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి కొనియాడారు. వైయస్సార్ 76 జయంతి సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణాపురం డివిజన్ చిత్రలేఅవుట్ లోని వైఎస్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకొనిరావడానికి మండు వేసవిని కూడా లెక్క చేయకుండా రాష్ట్రమంతా పాదయాత్ర చేసి పార్టీకి అధికారాన్ని కట్ట బెట్టిన ధీశాలి అని అన్నారు. ఆయన పేరు చెప్పగానే మొదట గుర్తొచ్చే పథకం రాజీవ్ ఆరోగ్యశ్రీ అని అన్నారు. పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చిన ఘనత వైయస్ఆర్ కు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు గణేష్, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్ రావు, ఖిల్లా మైసమ్మ చైర్మన్ సురేష్, అంజిరెడ్డి, రాజు నాయక్ ,లింగస్వామి గౌడ్, ఎల్లయ్య,కిరణ్, శ్రీశైలం, పెద్దవూర సైదులు,ప్రేమ నాయక్, సందీప్ ,నబి,శ్రీనివాస్ గుప్తా,మహమ్మద్, పటేల్, షఫి, అనుదీప్, సమ్మద్,,చందు, సూరి, వెంకటేష్ గౌడ్, సలీం,విప్లవ రెడ్డి,నాను, మారం సుజాత రెడ్డి, మాధవి పాల్గొన్నారు.

# రోహింగ్యాలపై చర్యలు తీసుకోవాలి

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్కి వినతి పత్రం అందజేసిన శ్రీరాములు అందెల



**రంగారెడ్డి, జూలై 8 (మనం న్యూస్):** మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండల్ లో అక్రమంగా నివసిస్తున్న రోహింగ్యాలపై చర్యలు తీసుకోవాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జ్ అందెల శ్రీరాములు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ను కరీంనగర్ లోని వారి కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోహింగ్యాలు అక్రమంగా పొందుతున్నటువంటి ప్రభుత్వ గుర్తింపు కార్డులు అయిన వాహనాలు, డ్రైవింగ్ లైసెన్స్ లు, సిమ్ కార్డుల వివరాలను సాక్షాదారాలతో బండి సంజయ్ కి అందించి వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. బండి సంజయ్ సానుకూలంగా స్పందించి రాష్ట్ర ప్రభుత్వం , కేంద్ర ప్రభుత్వం తో చర్చించి వీలైనంత త్వరగా చర్యలు తీసుకునే విధంగా ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి, తుక్కుగూడ మున్సిపాలిటీ మాజీ బిజెపి అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్, జిల్లా దిశా కమిటీ మెంబర్ అంబోజి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యం!

ఒకరిని వేరొకరు
కొట్టడమే తప్పనుకుంటే
బట్టలిప్పి కొడతాననడం
అప్రజాస్వామికమే కాదు
నిరంకుశం కూడా!
రాజ్యాంగం మీద
ప్రమాణం చేసిన చేతులు
సిగ్గుతో నేలచూపులు చూస్తుంటాయి
లోపల బయట
అన్ పార్లమెంట్ మాటలు వినీ వినీ
అసెంబ్లీ పార్లమెంటు చెవులు మూసుకుంటవి!
వాగ్దానాలు మేనిఫెస్టోలు
గెలిచే దాకా అతి పవిత్రం
ఆ తర్వాత....
అవి దుమ్ము కొట్టుకుపోయి
ముఖం చాటేస్తుంటాయి!
అధికారం డబ్బు ఏకమై
ఒకచోట చేతులు కలిపాక
ప్రజాపాలన అభాసు పాలై
బిక్కు బిక్కు మంటుంటది
సుదీర్ఘ ప్రజాస్వామ్యాన్ని
చవిచూచిన ఈ భారతదేశం
లోపలి సంక్షోభాల్ని ఎన్నడూ
బయటి ప్రపంచానికి తెలియనివ్వదు!
భ్రమ పూరిత ప్రజాస్వామ్యంలో
ఇప్పుడు హక్కులు బాధ్యతలు
బాగా కలిసిపోయిన పాలూ నీళ్ళే!!

**- కోట్ల వెంకటేశ్వర రెడ్డి**
**9440233261**

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**
**- ఎడిటర్**

# నవ చరిత్రను సృష్టించనున్న దళపతి



తమిళనాడు రాష్ట్ర రాజకీయాలలో ప్రముఖ తమిళ నటుడు 'దళపతి' విజయ్ 'తమిళ నాడు విజయ పక్షం' అనే అర్థంలో 'తమిళగ వెట్రి కళగం' ( టి.వి.కె ) పేరుతో నూతన రాజకీయ పార్టీని స్థాపించి సరికొత్త సంచలనాన్ని సృష్టించి ఇటీవల ముఖ్య మంత్రి అభ్యర్థిగా ప్రకటించబడడం శుభపరిణామం. 'అవినీతిని అంతం చేసి ప్రజలకు మెరుగైన పాలన అందించడమే లక్ష్యంగా తాను పార్టీని స్థాపించానని, ప్రజల సంక్షేమం కోసమే తన సినీ జీవితాన్ని వదులుకుని రాజకీయాల్లోకి వచ్చానని అంతిమంగా ప్రజానీకం అభ్యున్నతి కోసమే తన పోరాటం ఉంటుంది' అని ఆయన స్పష్టం చేయడాన్ని ప్రత్యేకంగా గమనించవచ్చు. కాల గమనంలో ఎం.జి. రామచంద్రన్, జయలలిత, శివాజీ గణేశన్, విజయకాంత్ మరియు కమల్ హాసన్ మొదలైన నటులు తమిళనాడు రాజకీయాలలో ప్రముఖ పాత్రని పోషిం చారు. నేడు అదే సినిమా రంగంలో రజనీకాంత్ తర్వాత అత్యంత ప్రేక్షకారాధన ఉన్న దళపతి విజయ్ ప్రజా సంక్షేమం కోసం ప్రత్యామ్నాయ రాజకీయాలే లక్ష్యంగా ఉద్యుక్తులు కావడం నిజంగా హర్షణీయం.

దళపతి విజయ్ నేతృత్వంలో 'విజయ్ మక్కల్ ఇయక్కం' అనే సంస్థ అనేక సంవత్సరాలుగా అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తున్ననూ లాభాపేక్ష లేని ఆ సంస్థ ద్వారా సువిశాల రాజకీయ మార్పులు సాధ్యం కాని తరుణంలో 'రాజకీయ అధికారం సాధనే లక్ష్యం'గా తమిళగ వెట్రి కళగం పార్టీ ఆవిర్భవించడం శుభ పరిణామం. గతంలో కేవలం పార్టీ పేరుని ఆయన ప్రకటించగానే ప్రజలు పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకోవడం తద్వారా ప్రజలకు ఆయనపై ఉన్న విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తుంది అని చెప్పవచ్చు. 2024 ఫిబ్రవరిలో టి.వి.కె పార్టీ ఆవిర్భవించిననూ అప్పటి లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి ఆ పార్టీ దూరంగా ఉన్న విషయం అందరికి విదితమే. 2026లో జరగబోయే తమిళనాడు రాష్ట్ర శాసనసభ ఎన్నికలలో విజయమే లక్ష్యంగా ముందుకు పయనించే విధంగా నిర్దిష్ట విధివిధానాలను అనుసరించనుండడాన్ని విజయ్ వ్యూహాత్మక దూరదృష్టికి నిదర్శనంగా పేర్కొనవచ్చు.

తమ పార్టీ ఎన్నికల్లో ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోబోమని గతంలోనే స్పష్టం చేసిన విజయ్ దానికే కట్టుబడి ఆ దిశగానే ముందుకు సాగుతుండటం గమనార్హం. 'బి.జె.పి పార్టీతో చేతులు కలపడానికి మా పార్టీ డి.ఎం.కె మరియు అన్నా డి.ఎం.కె పార్టీల మాదిరిగా ఎంతమాత్రం కానేకాదు. బి.జె.పి విభజన రాజకీయాలు చేస్తుంది. బి.జె.పి విషపూరిత రాజకీయాలు తమిళనాడులో చెల్లవు. కేంద్రంలో ఆ పార్టీ అనుసరిస్తున్న విధానాల మూలంగా తమిళనాడులో అధికారంలోకి రాలేదు. అలాగే తమిళనాడులో అరాచక పాలన సాగిస్తున్న డి.ఎం.కె కూటమితో ఎట్టి పరిస్థితులలోనూ చేతులు కలపబోము. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో బి.జె.పి మరియు డి.ఎం.కె పార్టీలతో మాకు ఎలాంటి పొత్తు ఉండబోదు. ఆ రెండు పార్టీలు మాకు ప్రధాన సైద్ధాంతిక శత్రువులు' అని విజయ్ వ్యాఖ్యానించడాన్ని ఈ సందర్భంగా ప్రత్యేకంగా గమనించవచ్చు.

రాజకీయం అనేది ఒక వృత్తి కాదు. ఒక 'పవిత్రమైన ప్రజా సేవ' అని స్పష్టంగా చెప్పవచ్చు. పరిపాలన యంత్రాంగం క్షీణించి అవినీతి, పాలనాపరమైన అవకతవకలతో కూడిన కలుషితమైన రాజకీయాలు ప్రజలను కుల, మతాల ప్రాతిపదికన విభజించే విభజన సంస్కృతి పాదుకొని ఉన్న నేటి స్వార్థపర రాజకీయాలను దళపతి విజయ్ తీవ్రంగా నిరసించడాన్ని స్పష్టంగా గమనించవచ్చు. ఈ రకంగా సమైక్యతను విధ్వంసం చేస్తూ విభజన రాజకీయాలు ఆధిపత్యాన్ని చెలాయించడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించడాన్ని బాహాటంగానే గమనించవచ్చు. 'నిస్వార్థ, పారదర్శక, దూరదృష్టి గల, అవినీతి రహిత, కుల, మత విభేదాలు లేని సమర్థ పాలన యంత్రాంగానికి మార్గం సుగమం చేసే రాజకీయ ఉద్యమం కోసం తమిళులు ఆకాంక్షిస్తున్నారు. తమిళనాడు ప్రజలు మార్పును ప్రజలు ఆకాంక్షిస్తున్న రాజకీయ మార్పునకు మార్గాన్ని సుగమం చేయడం మా లక్షం' అని దళపతి విజయ్ పేర్కొనడం విశిష్ట ప్రాధాన్యాన్ని స్పష్టంగా వెల్లడిస్తుంది. ప్రజా ఉద్యమం మాత్రమే రాజకీయ మార్పు తేగలదని, అది తమిళ నాడు హక్కులను కాపాడగలదని ఆయన స్పష్టం చేయడం గమనార్హం. 'చాలా మంది రాజకీయ నేతలు ఆయా పదవులలో ఉండి సినిమాలలో మాదిరిగా నటించారు తప్ప ప్రజల సంక్షేమం కోసం పెద్దగా పని చేసినది ఏమి లేదు. రాజకీయాలు అంటే సినిమాలు కాదు. ప్రజల జీవితాలతో నడిచే బాధ్యతాయుతమైన ప్రయాణం. నాకు రాజకీయ అనుభవం లేకపోయిననూ భయపడి వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు' అని ఆయన పేర్కొనడాన్ని ప్రత్యేకంగా గమనించవచ్చు. ఏది ఏమైననూ 'దళపతి విజయ్ మిగతా సినీ నటులకు భిన్నంగా తాను నిర్దేశించుకున్న విధివిధానాలను ఆచరణ రూపంలో ముందుకు తీసుకువెళ్లి తమిళనాడు రాష్ట్ర రాజకీయాలలో నవచరిత్రను సృష్టించనున్నాడు' అని ఘంటాపథంగా చెప్పవచ్చు.

**- జె.జె.సి.పి. బాబూరావు**
**94933 19690**



# కాలుష్యంతో అమ్మ పోరాటం?



'గర్భిణులకు పౌష్టికాహారం అందని ద్రాక్షే..!' ఆధునిక టెక్నాలజీ ద్వారా శీఘ్ర ప్రగతి అంటూ పరుగులోవైపు, మరోవైపు అంతర్జాతీయ ఆధిపత్యం కోసం మానవ వినాశకర అణుబాంబులతో యుద్ధాలకు పాల్పడుతున్నారు. ఈ విపరీత ధోరణి తో మానవుడు సృష్టించలేని సహజ సంపదలని కలుషితం (ధ్వంసం) చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితిల్లో మారుతున్న వాతావరణ పరిస్థితులు గర్భిణులపై తీవ్ర దుష్ప్రభావాలు చూపే అవకాశం ఉందని పరిశోధకులు చెబుతున్నారు.గత ఐదేళ్లలో భూ ఉష్ణోగ్రతలు ప్రమాదకర స్థాయిలో పెరుగు దల చోటుచేసుకుంటున్నట్లు 'క్లైమెట్ సెంట్రల్' తాజా అధ్యయనంలో వెల్లడైంది. దీనివల్ల మాతాశిశు ఆరోగ్యానికి సమస్యలుఎదురవుతాయని సంస్థ స్పష్టం చేసింది. ప్రపంచవ్యాప్తంగా 90 శాతం దేశాల్లోని 63 శాతం నగరాల్లో పరిస్థితులు ప్రమాద కరంగా ఉన్నాయి. భారత్ లోనూ ఈ వాతావరణం ఉందని 'క్లైమెట్ సెంట్రల్ ' తన అధ్యయన పత్రంలో హెచ్చరించారు. గత ఐదేళ్లలో అధిక ఉష్ణోగ్రతలు నమోదు అనూహ్యంగా పెరుగుతుంది. మనదేశంలో ఏప్రిల్ మే నెలలో 37-45 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఉంటాయి. కొన్ని సార్లు 49 డిగ్రీల వరకు కూడా నమోదు అవుతాయి. సగటున 30 రోజులు ఈ తరహా ఎండలు ఉంటాయి. తాజా అధ్యయనంలో 37 డిగ్రీల కంటే అధిక ఉష్ణోగ్రతలు ఎండా కాలంలోనే కాకుండా ఇతర సీజన్లోనూ ఉన్నట్లు గుర్తించారు. 2020-24 వరకు ఐదేళ్లపాటు 247 దేశాలలో, 940 నగరాల్లో ఈ సంస్థ రోజువారి ఉష్ణోగ్రతలను విశ్లేషిం చింది. 2020 కి ఐదేళ్ల ముందు వాతావరణంలో మార్పులు, ఉష్ణోగ్రతల నమోదు, గర్భిణుల ఆరోగ్యం ,ముందస్తు జననాలు తదితర అంశాలను కూడా పరిశీలించింది. వాతావరణంలోని మార్పుల వల్ల గర్భిణులకు ముప్పు దాదాపు రెట్టింపు అయినట్లు పరిశోధనలో గుర్తించారు. ఇలా క్రమంగా భూ వాతావరణం వేడెక్కు తోంది. ఏడాది పొడవునా ఉక్కపోత వాతావరణం ఉంటుంది. మరో వైపు అకాల వర్షాలు ఎక్కువయ్యాయి.

చలికాలంలోనూ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. వాతావరణంలో ఇంతలా మార్పులకు ప్రధాన కారణం. 'పొల్యూషన్, పెస్టిసైడ్స్, ప్లాస్టిక్స్'(పీపీపీ)గా నిర్ధారించారు. వాహనాలు, పరిశ్రమల ద్వారా వెలువడుతున్న హానికర ఉద్గారాలు భూతాపాన్ని పెంచేస్తున్నాయి.భూమి,వాయు, జల కాలుష్యాలు, అడ్డగోలుగా అడవుల నరికేయడం,లాంటి మానవ చర్యల వల్ల భూతాపం పెరుగు తుంది. దీంతో అనేక దుష్ప్రభావాలు ఇప్పటికే ఎదురవుతు న్నాయి.తాజా అధ్యనంలో అధిక ఉష్ణోగ్రతలు గర్భిణులకు ఎలా అపాయంగా మారుతాయో వివరించింది. ఈ తరహాలో మొదటి విశ్లేషణ ఇదేనని 'క్లైమెట్ సెంట్రల్' పేర్కొంది..

**కీలక ఫలితాలు**

247 దేశాల్లో విశ్లేషణ జరపగా.. 222 దేశాల్లో గత ఐదేళ్లలో వాతావరణంలో ప్రమాదకరమైన మార్పులు చోటు చేసుకున్నాయి. గర్భిణులకు ఇబ్బంది పెట్టే హెచ్చు ఉష్ణోగ్రతల రోజులు దాదాపు రెట్టింపు అయ్యాయి.78 దేశాల్లో 2020 నుంచి 2024 సంవత్సరాల్లో గర్భిణులకు ముప్పును పెంచే ఉష్ణోగ్రతలు నమోదయ్యే రోజుల సంఖ్య దాదాపు 30 అదనంగా పెరగడం ఆందోళన కలిగించే అంశం. బొగ్గు, చమురు, గ్యాస్ తదితర శిలాజ ఇంధనాలను అధికంగా వినియోగించడం ద్వారా ఏర్పడిన వాతావరణ కాలుష్యం.. గర్భిణులపై ప్రమాదకర ప్రభావాన్ని చూపుతోంది. మన దేశంలోనూ అధిక ఉష్ణోగ్రతల ప్రభావం వారిపై తీవ్రంగానే ఉంది. పనాజీ(గోవా)లో 39 రోజులు, తిరువనంతపురంలో 36,సిక్కింలో 32,ముంబాయిలో26 చెన్నై, బెంగళూరు పూణే నగరాల్లో అదనంగా7 రోజులు గర్భిణులు అధిక ఉష్ణోగ్రతలను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఇవన్నీ కూడా గత పది ఏళ్లలోనే చోటు చేసుకున్నాయి.

**ముప్పును తగ్గించడం ఎలా..?**

అడవులను ఇష్టానుసారంగా నరికి వేయకుండా, సంరక్షణ చర్యలు చేపట్టాలి. గ్రామాలు, పట్టణాల్లోనూ చిన్నపాటి వనాలను పెంచాలి. కర్బన ఉద్గారాలను తగ్గించాలి.. గాలి, నీటి కాలుష్యం అరికట్టాలి. కాలుష్య రహిత పరిశ్రమలను, వాహనాలను ప్రోత్సహించాలి.

ఇంతగా పొల్యూషన్ పెరుగుతున్న పరిస్థితిలో గర్భిణీ దశ నుంచి ప్రసవం వరకూ.. సాధారణం కంటే ఒక్క డిగ్రీ ఎక్కువ ఉష్ణోగ్రత నమోదైన ఆ ప్రభావం మనపై ఖచ్చితంగా పడుతుందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ముఖ్యంగా గర్భిణులపై అధిక ఉష్ణోగ్రతల వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా కూడా దుష్ప్రభావం ఉంటుంది. గర్భిణిగా ఉన్నప్పుడే కాదు, ప్రసవం తర్వాత కూడా డిప్రెషన్, కండరాలు పట్టేయడం వంటి సమస్యలు ఎదురవుతాయి. ఈ ప్రభావం కడుపులో పెరుగుతున్న శిశువుపై కూడా ఉంటుంది. ముందస్తు జననాలకు కారణం అవుతుంది. వాయు కాలుష్యంలోని కార్బన్ డైయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్,సల్ఫర్ డయాక్సైడ్ తదితర ప్రమాదకరమైన వాయువులే కాకుండా.. 10మైక్రో మీటర్ కంటే తక్కువ పరిమాణం ఉన్న ధూళికణాలు వంటివి కూడా గర్భిణులకు సమస్యలు కలగజేస్తాయి.అధిక రక్తపోటు, మధుమేహం ఆసుపత్రుల్లో చేరాల్సి రావడం. తొలి మూడు నెలల్లోనే గర్భస్రావం,తల్లికి తీవ్ర అనారోగ్యం, తల్లి మరణం మృత శిశువు జననం, ముందస్తు జననం తక్కువ బరువుతో, అవయవ లోపాలతో పుట్టడం వంటి సమస్యలు ఎదురవుతాయని అధ్యయనాలు చెబుతున్నాయి.

ఇదే కాకుండా 'ముల్లే నక్కపై తాటి పండు పడ్డట్టూ' మరోవైపు గర్భిణులు పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉంటేనే పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారు. అప్పుడే మన భావి భారతం ఆరోగ్యంగా ఎదుగుతుంది. ఇది ఎవరు కాదనలేని వాస్తవం. కానీ మన దేశంలో పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నం.దేశంలో 15 నుంచి 49 ఏళ్ల లోపు గర్భిణుల్లో సగానికన్నా ఎక్కువమంది రక్తహీనతతో బాధపడుతున్నారని అనేక గణాంకాలు చెబుతున్నాయి.ఐదో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (2019-21) ప్రకారం మన దేశంలో గర్భం ధరించిన మహిళల స్థితిపై పై విధంగా ఉందని చెప్పింది.

అలాగే మన తెలుగు రాష్ట్రాల్లో కూడా రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణుల సంఖ్య రోజురోజుకు పెరుగుతూనే ఉంది. తెలంగాణ మహిళల్లో రక్తహీనత ఎక్కువగా ఉంటుందని చెప్పారు.15 నుంచి 45 ఏళ్ల గల మహిళలు రాష్ట్రంలో 57.6శాతం ఉండగా,వీరిలో అత్యధిక శాతం పౌష్టికాహార లోపం, రక్తహీనతతో బాధపడుతున్నారని తెలిపింది. గర్భిణీ దశలో పోషకాహార లోపం వల్ల తల్లి బిడ్డలపై దుష్ప్రభావం చూపుతోందని ఎన్నో నివేదికలు చెబుతున్నాయి. పైన చెప్పినట్లు నేడు మారుతున్న వాతావరణ పరిస్థితులు కారణంగా గర్భిణుల ఆరోగ్యం మరింత అధ్వాన్నంగా తయారవుతోంది.మానవ జాతి సృష్టికర్తలైన గర్భిణీ స్త్రీల ఆరోగ్యం బాగుంటేనే భావి తరం ఆరోగ్యవంతంగా ఉంటుంది. కావున పాలకులు సమస్యల మూలాల్లోకి వెళ్లి పరిష్కారం కోసం తక్షణం దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. అప్పుడే ఆరోగ్య భారతం నిర్మిత మవుతుంది. పై సమస్యల తీవ్రత దృష్ట్యా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో తక్షణ చర్యలు చేపట్టాలి. ఈ పరిణామాలను నిర్లక్ష్యం చేస్తే, నేటి పాలకులు రేపటి తరం దృష్టిలో దోషులవుతారు.

**-మేకిరి దామోదర్**
**9573666650**

## ప్రైవేట్ టీచర్లకు రక్షణ కల్పించాలి

ప్రైవేట్ ఉపాధ్యాయుల జీవితాలు అమనవీయం. తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 15,360 ప్రైవేట్ పాఠశాలలు, అందులో 1,40,000 విద్యార్థులు, 41,360 మంది ఉపాధ్యాయులు ఉన్నారని ఒక అంచనా.ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులు, తక్కువజీతాలతో బాధపడుతున్నారు. వీరికి ఉద్యోగ భద్రత కరువు. వారు తీవ్ర మైన పనిభారం,వేగంగా మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా ఒత్తిడిని కూడా ఎదుర్కొం టున్నారు. ప్రైవేట్ పాఠశాలలో కఠినమైన విద్యా ప్రమాణాలను విద్యార్థుల మార్కులు సాధించ డానికి ఉపాధ్యాయులపై యాజమాన్యాలు ఒత్తిడి పెంచుతున్నాయి.

ఉపాధ్యాయులు తరగతుల్లో పాఠాలు చెప్పడమే కాకుండా పాఠశాలలు నిర్వహించే ఇతర కంప్యూటర్, ఫీజు వసూలు చేసే పనులు కూడ చేయవలసి వస్తుంది. పిల్లలు పరీక్ష ఫలితాల్లో మార్కులు తక్కువ వస్తే బలి పశువుగా మారేది ఉపాధ్యాయులే.ప్రభుత్వ పాఠశాలల్లో బోధించే ఉపాధ్యాయుల కంటే ఎక్కువ విద్యార్హతలు ఉన్నను వారి కంటే తక్కువ వేతనం పొందుతూ ఉన్నారు.కాంట్రాక్ట్ ఆధారిత ఉద్యోగాల వలన వారికి ఎటువంటి ఉద్యోగ భద్రత లేకుండా ఉంది..పి.ఎఫ్, గ్రాట్యుటీ, వైద్య భీమా లాంటి సౌకర్యాలు లేకుండా ఎటువంటి సామాజిక, ఆర్థిక, ఆరోగ్య భద్రత లేకుండా జీవిస్తున్నారు. అధిక గంటలు ఏకబిగిన తరగతుల్లో భోదించడం వలన గొంతు ఇన్ఫెక్షన్లు, స్వర పేటిక దెబ్బ తినే ప్రమాదం ఉంది. ఎప్పుడో ఒక సారి కార్పొరేట్ పాఠశాల విద్యార్థి ఏదో కారణంతో మరణించగానే విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీలు చేసే ధర్నా, నిరసన ఒక రోజుకు పరిమితం.నిత్యం శ్రమ దోపిడీకి గురవుతున్న ఉపాధ్యాయులు పరిస్థితి ఏమిటి? ప్రైవేట్ ఉపాధ్యాయులు ఎటువంటి హక్కులు లేకుండా, అటు కార్మిక హక్కులు ఇటు ఉపాధ్యాయ హక్కులు లేకుండా విగత జీవులుగా జీవిస్తున్నారు. కానీ ప్రైవేట్ ఉపాధ్యాయుల మాటేమిటి? ఒకే వృత్తిలో పని చేసే వారి పట్ల వివక్షత ఉండరాదు. టీచర్స్ నుంచి శాసన మండలికి ఎన్నికైన సభ్యులు కూడా వీరి గురించి నోరు మెదపక పోవడం బాధాకరం. గిగ్ వర్కర్ల కొరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ బోర్డ్ ఏర్పాటు చేసినట్లుగా ప్రైవేట్ ఉపాధ్యాయులను కూడా గిగ్ వర్కర్ల జాబితా లో చేర్చి వీరికి సామాజిక, ఆర్థిక, ఆరోగ్య భద్రత కల్పించే అవసరం ఎంతైనా ఉంది.

**- ఆళవందార్ వేణు మాధవ్**
**8686051752**

## సాకులు వద్దు సంకల్పమే ముద్దు

మనిషిని జీవిత
కోరికలు
తీర్చుకోవడానికి
ప్రయత్నిస్తాడుత
ఇతరులకంటే
మెరుగైన జీవితాన్ని
కోరుకుంటారు
జీవితంలో మారాలని .
మార్చుకోవాలని
ఉన్నత స్థాయిలో
ఉండాలని
కోరుకుంటాడు

బలమైన కోరికలు
ఉన్న వారికి అందుకు
అవసరమైన
మార్గాలు తప్పక
దొరుకుతాయి
సంకల్పంతో పాటు
తపన లేని వారికి
సాకులు మాత్రమే
దొరుకుతాయి
నెగెటివ్ ఆలోచనలతో
ప్రగతిని అడ్డుకుంటారు

చెల్లని రూపాయికి
గీత లెక్కువ
చాతగానోనికి
మాటలెక్కువ
సాకులు వద్దు
సంకల్పంతో
సక్సెస్ పర్వంతో
సాగిపో

వంకర మాటలు
కట్టిపెట్టు
గట్టిమేలు తలపెట్టు
సమాజహితమే
నీ అభిమతమైతే
చరిత్ర నిర్మాతమౌతావు

వాయిదా తత్వంతో
వృద్ధి అభివృద్ధి
మందగిస్తుంది
వ్యక్తిత్వ వికాసం
కోసం ఎన్ని పుస్తకాలు
చదివినా మహనీయుల
జీవిత గాథలు విన్నా
సాకులు చెప్పే వారికి
ఎలాంటి ఉపయోగ
ఉండదు
సాకులు వెతకద్దు
లక్ష్యసాధనలో
ప్రతికూల పరిస్థితులు
ఎదురైనా సడలని
విశ్వాసంతో
వైఫల్యాలు
పలకరించిన
చేతులు ఎత్తేయకుండా
సడలని మనో ధైర్యంతో
ముందుకు వెళ్ళే వాడే
నిజమైన
పోరటయోధుడు
సంకల్పం చురుకైన
కార్యాచరణే ప్రగతికి
దిక్సూచి కావాలి

**-నేదునూరి కనకయ్య**
**9440245771**

# కొత్తపుంతలు తొక్కుతున్న ప్రపంచ ఫ్యాషన్ టెక్నాలజీ



ప్రతి ఒక్కరు తమ ఫ్యాషన్ భావాలను వ్యక్తీ కరించడానికి ఒక ప్రత్యేక మార్గాన్ని ఎంచుకుంటా రు. ఒక్కొక్కరి వస్త్రధారణ ఒక్కో విధంగా ఉంటుంది. కులాలు, మతాలు, జాతులు, దేశాలు, ప్రాంతా లను బట్టి ఫ్యాషన్స్ మారుతుంటాయి. ఒక్కో జాతికి ఒక రకమైన విలక్షణ వస్త్రధారణ పద్ధతులు ఉంటాయి. ఫ్యాషన్ ప్రపంచం, పరిశ్రమ చాలా పెద్దది. ఫ్యాషన్ టెక్నాలజీ క్షణక్షణం మారుతోంది. తరాలు మారిన కొద్దీ ఫ్యాషన్లు కూడా మారు తున్నాయి, కొన్ని సందర్భాల్లో వెర్రి పోకడలు కూడా సంతరించుకుంటున్నాయి.

ప్రపంచ మాన వాళి దృష్టిని తమ ఫ్యాషన్ల వైపుకు మరల్చడానికి, ప్రత్యేక సౌందర్య భావాలను వ్యక్తం చేయడానికి, వారి వారి విభిన్న దుస్తులు లేదా ఉపకరణాలను ప్రదర్శించడానికి ఒక వేదికగా ప్రతి ఏట 09 జూలై రోజున అంతర్జాతీయ ఫ్యాషన్ దినోత్సవం (ఇంటర్నేషనల్ ఫ్యాషన్ డే) పాటించుట 2016 నుంచి ఆనవాయితీగా మారింది.

**ఫ్యాషన్ ప్రపంచం చాలా పెద్దది:**

ఫ్యాషన్ రంగం చాలా పెద్దది. నేడు ప్రపంచ ఫ్యాషన్ పరిశ్రమ/మార్కెట్ దాదాపు 1.84 ట్రిలియన్ డాలర్ల వ్యాపారంగా మారింది. ప్రపంచ మానవ జనాభా 8 బిలియన్లకు సాలీనా దాదాపు 100 బిలియన్ల వరకు దుస్తులు ఉత్పత్తి అవుతున్నాయి. ప్రతి ఒక్కరికి సగటున ఒక ఏడాదికి 12 - 14 దుస్తులు కొనుగోలు చేస్తున్నారు. వస్త్ర ఉత్పత్తిలో అతి పెద్ద దేశంగా చైనా తొలి స్థానాన్ని ఆక్రమించింది. ఫ్యాషన్ పరిశ్రమ ద్వారా సృజన, ఆవిష్కరణ, సంస్కృతి, వేషధారణ, పలు రకాలు దుస్తులు, కేశాలంకరణ, అలంకరణ, ఆభరణాలు లాంటి పలు అంశాలు ఉంటాయి. ఫ్యాషన్ ప్రపంచంలో వ్యక్తులు, డిజైనర్లు, క్రియేటర్స్, మోడల్స్, ఇన్నొవేటర్స్, ట్రెండ్స్, ఇన్ఫ్లుయెన్సర్స్ ద్వారా పలు రకాల ఫ్యాషన్స్ పుట్టుకొస్తున్నాయి, మార్కెట్ను ముంచేస్తున్నాయి. నిన్నటి ఫ్యాషన్ నేడు పాత బడిపోయి, నేటి ఫ్యాషన్స్ కోకొల్లలుగా పుట్టు కొస్తున్నాయి. ఫ్యాషన్ అంటే దుస్తులు మాత్రమే కాదని, ఇది ఒక హద్దులు లేని వింత ప్రపంచమని అర్థం అవుతున్నది. ఫ్యాషన్ రంగం అంటేనే సృజనశీలత, ఆవిష్కరణ, సంస్కృతికి వైవిధ్యం, ప్రత్యేక గుర్తింపు లాంటి అంశాలకు పుట్టిళ్లు. సామాజిక మార్పులు, కళలకు అపూర్వ వేదికగా అంతర్జాతీయ ఫ్యాషన్ దినం ఉపయోగ పడుతున్నది.



**ఫ్యాషన్ టెక్నాలజీ - ఫ్యాషన్ డిజైనర్స్:**

ఫ్యాషన్ డిజైన్ అంటే దుస్తులు, కొన్ని వస్తువులను అందంగా, వినూత్నంగా తీర్చి దిద్దే కళ అని తెలుసుకోవాలి. దీనిలో అవలంభించే పద్ధతుల సమాహారాన్ని ఫ్యాషన్ టెక్నాలజీ అని పిలుస్తాం. మానవ అభిరుచులను బట్టి దుస్తులు, అలంకార వస్తువులను తయారు చేసే నిపుణులను ఫ్యాషన్ డిజైనర్స్ అంటాం. దుస్తులు, ఉపకరణాల రూపకల్పన, ఉత్పత్తిలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించడాన్ని ఫ్యాషన్ టెక్నాలజీగా పిలుస్తున్నాం. ఫ్యాషన్ టెక్నాలజీలో ఫ్యాషన్ డిజైన్స్, వస్త్ర సాంకేతికత, ఫ్యాషన్ ఉత్పత్తులు, ఫ్యాషన్ మార్కెట్, రిటైల్ లాంటి పలు రంగాలు ఉంటాయి. నేటి డిజిటల్ యుగంలో కంప్యూటర్-సహాయ ఉత్పత్తి/ డిజైన్స్, 3డి ప్రింటింగ్, ఆగ్మెంటెడ్ రియాలిటీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ లాంటి పరిజ్ఞానాలు వాడబడుతున్నాయి. ఇవి ఫ్యాషన్ ప్రపంచ పరిశ్రమను మరింత సమర్థవంతంగా, సుస్థిరంగా, వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా, ఆకర్షణీయంగా మార్చడంలో సహాయ పడుతున్నది.

**అంతర్జాత ఫ్యాషన్ దినోత్సవ వేడుకలు:**

ఆధునిక పౌర సమాజ అభిరుచులకు అద్దం పడుతున్నది నేటి ఫ్యాషన్ పరిశ్రమ. మారుతున్న కాలంతో పాటు ఫ్యాషన్లు కూడా అత్యంత వేగంగా మారుతున్నాయి. అంతర్జాతీయ ఫ్యాషన్ దినం వేదికగా ప్రదర్శనలు, పోటీలు, సామాజిక మాధ్యమ అవగాహనలు, నూతన బ్రాండ్ల ప్రదర్శనలు, డిస్కౌంట్స్, స్థానిక బ్రాండ్ల ప్రోత్సాహం, కొత్త బ్రాండ్ల ప్రారంభం, ఫ్యాషన్ టెక్నాలజీ సృజనకారుల గుర్తింపు లాంటి కార్యక్రమాలను నిర్వహించవచ్చు. మానవ జాతి పుట్టుక నుంచి నేటి వరకు ఫ్యాషన్ రంగం కొత్తపుంతలు తొక్కుతూనే ఉన్నది. ఇదో వింత, విచిత్ర ప్రపంచం. పౌర సమాజంతో విడదీయరాని సంబంధం కలిగిన ఫ్యాషన్ ప్రపంచం నిన్నటి, నేటి, రేపటి తరాలకు తగిన విధంగా తమ ఉత్పత్తులను విడుదల చేస్తూనే ఉన్నాయి. ఫ్యాషన్ టెక్నాలజీ పెరగడం శుభ సూచకమే అయినప్పటికీ ఫ్యాషన్లు వెర్రితలలు వేయకూడదు, మన సాంస్కృతిక మూలాలను మరిచి పోకూడదు. మన ప్రాంత వాతావరణాన్ని, అవసరాలను, సందర్భాలను బట్టి మన వేషధారణ ఉండాలి. ఫ్యాషన్ పేరుతో అసహ్యకర రూపును పొందరాదని గమనించాలి.

**(9 జూలై అంతర్జాత ఫ్యాషన్ దినోత్సవం)**

**- డా. బుర్ర మధుసూదన్ రెడ్డి**
**9949700037**



## నూతన అధ్యక్షుడి సారధ్యంలో తిరుగులేని శక్తిగా బిజెపి



- రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురేష్ రెడ్డి

పెద్దపల్లి, జూలై 08( మనం ప్రతినిధి): తెలంగాణా రాష్ట్రంలో బిజెపి తిరుగులేనిశక్తిగా అవతరించబోతున్నదని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టెముక్కుల సురేష్ రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇటీవల భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా బాద్యతలు చేపట్టిన రామచంద్రారావును మంగళవారం రాష్ట్ర కార్యాలయంలో కలిసిన సురేష్ రెడ్డి ఆయనతో కాసేపు చర్చించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, చాలాయేళ్ళుగా సిద్దాంతమే ఊపిరిగా పార్టీకి వివిధ హోదాల్లో సేవందించిన రామచంద్రారావు నియామకం చారిత్రక మలుపన్నారు. కొత్త నాయకత్వం సారధ్యంలో తెలంగాణాలో బిజెపి జెండా పాతబోతున్నామన్నారు. రాబోయే మునిసిపల్ ఎన్నికల్లో సత్తాచాటి, అసెంబ్లీ ఎన్నికల నాటికి విజయానికి మార్గం సుగుమం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. పెద్దపల్లి జిల్లాలో పార్టీ పటిష్టతకు కృషి చేస్తామని సురేష్ రెడ్డి ప్రకటించారు.

# అగ్రహారం అంజన్న భక్తులకు మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు

- రూ.150 కోట్లతో రాజన్న ఆలయ అభివృద్ధి
- రాజన్న, అంజన్న ఆలయాల అభివృద్దే లక్ష్యంగా ముందుకు
- అగ్రహారం అంజన్న ఆలయంలో రూ. 34.5 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం
- ప్రతి మండలంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఫంక్షన్ హాల్ నిర్మిస్తాం
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్





రాజన్న సిరిసిల్ల జూలై - 08 (మనం ప్రతినిధి): అగ్రహారంలోని ఆంజనేయస్వామి ఆలయం శ్రీ రాజ రాజేశ్వరస్వామి, దేవస్థానం అభివృద్దే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. వేములవాడ అర్బన్ మండలం అగ్రహారంలోని ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో మార్బుల్ ఫ్లోరింగ్ పనులు రూ.34.50 లక్షల సాండ్ ఫండ్ మంజూరు చేసి మంగళవారం భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించగా ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే అది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇతరమంత్రుల సహకారంతో రాజన్న ఆలయ అభివృద్ధికి శ్రీకారం చుట్టామని, దాదాపు 150 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టనున్నామని తెలిపారు. ఈ నెల మూడో వారంలో రూ.76 కోట్ల పనులకు టెండర్ కానున్నట్లు వివరించారు. అలాగే రోడ్డు విస్తరణ పనులు కూడా ఇటీవలే మొదలయ్యాయని తెలిపారు. వీ.టీ.డీ.ఏ వైస్ చైర్మన్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమగ్ర ప్రణాళిక తో పనులు వేగవంతంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. రాజన్న ఆలయానికి భక్తుల తాకిడి రానురాను పెరుగుతోందని దానికి అనుగుణంగా సౌకర్యాలు కల్పించాలని ఉద్దేశంతో ప్రజా ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని గుర్తు చేశారు. భక్తుల సంఖ్య కనుగుణంగా ఆలయాన్ని విస్తరిస్తామని స్పష్టం చేశారు. భక్తుల రద్దీతో వేములవాడలో చిరు వ్యాపారులు, వ్యాపారులకు ఉపాధి దొరుకుతుందని తెలిపారు. అగ్రహారం అంజన్న ఆలయంలో ఇటీవల ప్రాకారం, ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేశామని గుర్తు చేశారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా చొరవతోనే అంజన్న ఆలయ అభివృద్ధి పనులు ముందుకు సాగుతున్నాయని అభినందించారు. అంజన్న ఆలయ ఆవరణలో కళ్యాణ మండపం నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో అన్ని వర్గాల పేదల శుభ కార్యక్రమాలకు ఉపయోగపడుతుందని ఆర్థికంగా కూడా వారికి ఇబ్బంది కలగదని తెలిపారు. నియోజకవర్గం జిల్లాలోని ప్రతి మండలంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఫంక్షన్ హాల్ కట్టేందుకు ఆలోచిస్తున్నామని తెలిపారు.ఎస్.డీ.ఎఫ్ నిధుల నుంచి ఒక్కో ఫంక్షన్ హాల్ కు రూ. 10 లక్షలు కేటాయిస్తామని మిగతా నిధులతో కలిపి వాటి నిర్మాణాన్ని పూర్తి చేస్తామని వెల్లడించారు. దేశ ఆధ్యాత్మిక సాంప్రదాయాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు. వేములవాడలో ఇటీవల వేద విద్యార్థులకు నాలుగు రోజులపాటు నాలుగు వేదాంశాల్లో పరీక్షలు నిర్వహించారని గుర్తు చేశారు. ఈ పరీక్షలకు దేశంలోని ఆయా ప్రాంతాల నుంచి 160 మంది వేద విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. గతంలో ఈ పరీక్షలు తిరుమల తిరుపతి దేవస్థానం లో జరిగాయని చెప్పారు. రాజన్న ఆలయ ఖ్యాతి దేశమంతా విస్తరిస్తోందని పేర్కొన్నారు. వేములవాడ రాజన్న ఆలయం, అగ్రహారం అంజన్న ఆలయం అభివృద్ధికి అంతా కలిసి ముందుకు వెళ్తామని పేర్కొన్నారు.

### మార్బుల్ ఫ్లోరింగ్ పనులను 15 రోజుల్లో పూర్తి చేయాలి: కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సూచనల మేరకు అగ్రహారంలోని అంజన్న ఆలయంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. మార్బుల్ ఫ్లోరింగ్ పనులను 15 రోజుల్లో పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

భక్తుల సంఖ్య కనుగుణంగా ఆలయంలో సౌకర్యాలు కల్పిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పి.ఆర్. అధికారులు సుదర్శన్ రెడ్డి, ఆలయ అధికారులు శ్రీనివాస్, పురోహితులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల గీతానగర్ బడిలో షురూ

- ప్రభుత్వ స్కూళ్ల లో మధ్యాహ్న భోజనం సిద్ధం చేసేందుకు గ్యాస్ కనెక్షన్లు మంజూరు
- రాష్ట్రంలోనే ప్రథమంగా జిల్లాలో అమలు
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



రాజన్న సిరిసిల్ల, జూలై 8( మనం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 458 ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం సిద్ధం చేసేందుకు గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వెల్లడించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గీతా నగర్ జెడ్పి.హెచ్.ఎస్ లో మధ్యాహ్న భోజనం సిద్ధం చేసే గ్యాస్ కనెక్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ మంగళవారం మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప రెడ్డి తో కలిసి లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడారు. విద్యార్థులకు కట్టెల పొయ్యి పై ఆహార పదార్థాలు సిద్ధం చేయవద్దని సూచించారు. దీంతో వాతావరణ కాలుష్యం, ఇతర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. జిల్లాలోని 458 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమిక ఉన్నత, ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం గ్యాస్ స్టౌ పై సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధముగా ప్రతి ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం గ్యాస్ స్టౌ లపై సిద్ధం చేయనున్నారు. ఇందులో భాగంగా ముందుగా సిరిసిల్ల లోని గీతా నగర్ జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో ప్రారంభించారు.

# ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇల్లు అందించడమే లక్ష్యం

- గ్రామాల అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు వెచ్చిస్తున్నాం
- గత పాలకులు ఇల్లు, రేషన్ కార్డులు ఇచ్చిన పాపాన పోలేదు
- ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఫ్రీ ఇసుక అందిస్తున్నాం
- ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు



సుల్తానాబాద్, జూలై 8 (మనం న్యూస్): సుల్తానాబాద్ మండలంలోని కందునూరిపల్లి, నారాయణపూర్, కొదురుపాక, దేవునిపల్లి, చిన్న కాల్వల గ్రామాల్లో మంగళవారం సిసి రోడ్లు, డ్రైనేజీలు, హెల్త్ సెంటర్, కమ్యూనిటీ హాల్, బోర్ వెల్ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన అనంతరం పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ పత్రాలను అందజేసి ముగ్గులు పోసి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణా రావు. తదుపరి సుల్తానాబాద్ మండలం నారాయణపూర్ గ్రామంలో ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలలో పాల్గొని కేక్ కట్ చేసిన అనంతరం వైయస్ రాజశేఖర్ రెడ్డి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణా రావు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రతి గ్రామంలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు అందించి వారి కళ్ళల్లో ఆనందం చూసేందుకు కృషి చేస్తున్నామని సంవత్సరం నర కాలంలోనే ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేస్తున్నామని ప్రతి గ్రామంలో లక్షలాది రూపాయలతో సిసి రోడ్లు డ్రైనేజీల నిర్మాణం చేపడుతున్నామని అందులో భాగంగా నేడు కందునూరి పల్లి గ్రామంలో 56 లక్షల రూపాయల సిసి రోడ్లు డ్రైనేజీలు నారాయణపూర్ గ్రామంలో 37 లక్షల 50 వేల సిసి రోడ్ డ్రైనేజీలు 25 ఇందిరమ్మ గృహాల మంజూరు కొదురుపాక గ్రామంలో 55 లక్షల రూపాయలతో హెల్త్ సెంటర్ దేవునిపల్లి గ్రామంలో 25 లక్షల రూపాయలతో సీసీ రోడ్లు డ్రైనేజీలు కమ్యూనిటీ హాల్ బోర్ వెల్ నిర్మాణాలు చేపట్టామని అలాగే అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డును అందిస్తున్నామని గత పది సంవత్సరాలు రేషన్ కార్డ్ డబుల్ బెడ్ రూమ్ ఇచ్చిన పాపాన గత ప్రభుత్వం పోలేదని ఇచ్చిన మాట ప్రకారం రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇల్లు అందిస్తున్నామని, 80శాతం పై చిలుకు మందికి కరెంట్ బిల్లు ఉచితంగా వస్తుందని అన్నారు గత పాలకులు దళిత కాలనీలను చీకటిమయం చేసి వారు, కారు చీకట్లో మగ్గేలా పాలనను కొనసాగించారని ముక్కు పిండి కరెంట్ బిల్లులు బస్సులు చేసిన సందర్భాలు ఉన్నాయని రాష్ట్రంలో 200 యూనిట్ల వరకు ఫ్రీ కరెంట్ ఇచ్చిన ఘనత తమదేనని బి.ఆర్.ఎస్ పాలనలో సన్న వడ్లు పండించాలని చెప్పి రైతులను నట్టేట ముంచారని పేర్కొన్నారు. రైతులు పండించిన పంటకు వడ్లు కటింగ్ లేకుండా కొనుగోలు చేసిన ఘనత తమదేనని నియోజకవర్గంలో గతంలో ఇసుకను అమ్ముకున్న పాలకులు ఉన్నారని ప్రస్తుతం తాము అతి చౌకగా ఇసుకను అందిస్తున్నామని అన్నారు. సంవత్సర నర కాలం పూర్తయిందని ఇంకా మూడున్నర సంవత్సరాల కాలం మిగిలి ఉందని ఇచ్చిన హామీలను అన్నింటిని దశలవారీగా అమలు పరస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రేషన్ కార్డుల ఇందిరమ్మ గృహాల ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ దివ్యదర్శన్, పంచాయతీ రాజ్ ఏ ఈ సచిన్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినిపల ప్రకాష్ రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చిలుక సతీష్,పన్నాల రాములు,కళ్లేపెల్లి జానీ,దానాయక్ దామోదర్ రావు, శ్రీగిరి శ్రీనివాస్, పన్నాల తిరుపతి, అన్నమనేని మాధవ రావు, మండల రమేష్, అన్నమనేని కొండల్ రావు, సాగర్ రావు, వేగోళం అబ్బాయి గౌడ్, ఆకుల రాములు, ఆమిరిశెట్టి రాజలింగం,భూషణవేణి అభినయ్ గౌడ్, జుపెల్లి తిరుమల్ రావు, ఎనగందుల నారాయణ, భూషణవేణి రాజ గౌడ్, శ్రీనివాస్, పోలవేణి కుమార్, అట్ల కుమార్, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# స్వచ్ఛ కాలనీలుగా తీర్చిదిదెందుకు ప్రజలు సహకరించాలి



- మున్సిపల్ కమిషనర్ టి రమేష్

సుల్తానాబాద్ జూలై 8 (మనం న్యూస్): సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని ప్రతి కాలనీలు స్వచ్ఛ కాలనీలుగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ టి.రమేష్ అన్నారు. మంగళవారం సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని పలు వార్డులలో 100 రోజుల ప్రణాళికలో భాగంగా సానిటేషన్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ, స్వచ్ఛత పై తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ప్రజలందరూ కాలనీలను పరిశుభ్రంగా చూసుకుంటే ఎలాంటి రుగ్మతలు దరి చేరవని తద్వారా ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. స్థానిక 3వ వార్డు లో తడి పొడి చెత్త పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి నిత్యం కాలనీలకు వచ్చే మున్సిపల్ చెత్త సేకరణ వాహనాలకు విధిగా తడి, పొడి చెత్తను అందించాలని , రోడ్లపై మురుగు కాలువలలో చెత్తను , ప్లాస్టిక్ వ్యర్థాలను వేయవద్దని వార్డు ప్రజలకు తెలియజేశారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని మెయిన్ రోడ్, శ్రీరాంపూర్ రోడ్లని పరిశీలించి చెత్తని ఎపట్టికప్పుడు తొలగించాలని శానిటేషన్ సిబ్బందికి అది సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తో పాటు శానిటరీ ఇన్స్పెక్టర్ నాగరాజు, వార్డు ఆఫీసర్ శ్రీనివాస్, ఆర్ పి రజిత, శానిటేషన్ సిబ్బంది శ్రవణ్ కుమార్, రాజ్ కుమార్ తో పాటు వార్డు ప్రజలు పలువురు పాల్గొన్నారు.

# జర్నలిస్టు కుటుంబానికి అండగా ఉంటా

- పిల్లల పై చదువులకు, ప్రసాద్ తల్లిదండ్రుల వైద్యానికి భరోసా
- రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల, జూలై 8 (మనం ప్రతినిధి): సిరిసిల్ల నియోజకవర్గనికి చెందిన టీవీ9 రిపోర్టర్ గార్దాసు ప్రసాద్ కుటుంబానికి అండగా ఉంటానని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ భరోసా ఇచ్చారు. ప్రసాద్ గుండెపోటుతో ఇటీవల మృతిచెందిగా విషయం తెలుసుకున్న విప్ మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని వారి ఇంటికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరుపున రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని, విప్ ఆది శ్రీనివాస్ స్వయంగా 20 వేల రూపాయలను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. భవిష్యత్తులో కూడా ఈ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పిల్లల పై చదువులకు అండగా ఉంటానని తెలిపారు. వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ప్రసాద్ తల్లిదండ్రుల ఆరోగ్య చికిత్సకు ప్రభుత్వం తరపున సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు.మార్కెట్ కమిటీ చైర్పర్సన్ స్వరూప రెడ్డి, డి.పి.ఆర్.ఓ. వి.శ్రీధర్, ప్రింట్ ఎలెక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన డైరెక్టర్



గోదావరిఖని, జూలై 8 (మనం న్యూస్): సింగరేణి సంస్థకు నూతన డైరెక్టర్ (పిఏడబ్ల్యూ) గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన గౌతం పొట్రూ ఆర్జీ-1 ఏరియాకు మొదటి సారిగా వచ్చిన సందర్భంగా సింగరేణి ఏరియా హాస్పిటల్ ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్పిటల్ లో అవుట్ పెషంట్స్ ఇన్ పెషంట్స్ వివరాలను, సమస్యలను, గుండెకు సంబంధించిన క్యాత్ లాబ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, డిజిఎం సివిల్ వరప్రసాద్, డిజిఎం వర్క్ షాప్ జితేందర్ సింగ్, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి, హాస్పటల్ సీనియర్ పర్సనల్ ఆఫీసర్ శ్రీనివాస్, పిఓ ఏబి మురళి, హాస్పటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ముంపు గ్రామాల సమస్యలకు శాశ్వత పరిష్కారం

- కొత్త సంవత్సరం లోపు ఇందిరమ్మ ఇండ్ల నిర్మించాలి
- రూ. 76 కోట్లతో వేములవాడ ఆలయ అభివృద్ధి చర్యలు
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల జూలై 08:( మనం ప్రతినిధి): మిడ్ మానేర్ రిజర్వాయర్ ముంపు గ్రామాల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ తో కలిసి వేములవాడ అగ్రహారం వద్ద గల శ్రీ ఫంక్షన్ హాల్ లో మిడ్ మానేర్ రిజర్వాయర్ ముంపు గ్రామాల నిర్వాసితులకు ఇల్లు కట్టుకొని ఖాళీ ఫ్లాట్స్ ఉన్నవారికి స్పెషల్ కోటా కింద 847 ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్ల మొదటి విడతలో మంజూరు చేశామని, వీటిలో వేములవాడ నియోజకవర్గానికి కేటాయించిన 3500 ఇందిరమ్మ ఇండ్లను ఇప్పటికే పంపిణీ చేశామని, స్పెషల్ కోట కింద మిడ్ మానేరు నిర్వాసిత గ్రామాల ప్రజలకు నేడు 847 ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్నామని, మరో 3 వేల ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులు పెండింగ్ విచారణలో ఉన్నాయని, ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, త్వరలో మిగిలిన వారికి తప్పనిసరిగా ఇండ్లు మంజూరు చేస్తామని అన్నారు. వేములవాడ అర్బన్ ప్రాంతంలోని ముంపు గ్రామాల రిజర్వాయర్ నిర్వాసితులకు తప్పనిసరిగా ఇండ్లు మంజూరు అవుతాయని అన్నారు. ముంపు గ్రామాల నిర్వాసితుల శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ఆ దిశగా మనమంతా సంయుక్తంగా పని చేయాలని అన్నారు. భారత దేశంలో ఎక్కడ కూడా పేదలకు ఇంటి నిర్మాణం కోసం 5 లక్షల రూపాయలు ఖర్చు చేయడం లేదని, రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం మాత్రమే పెద్ద ఎత్తున పేదలకు నిధులు మంజూరు చేస్తుందని అన్నారు. 76 కోట్లతో వేములవాడ ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ఈ పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ ప్రస్తుతం జరుగుతుందని అన్నారు. ధనిక రాష్ట్రం తెలంగాణను గత పాలకులు అప్పుల కుప్పగా మార్చి ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేశారని ప్రభుత్వ విప్ ధ్వజమెత్తారు. ఆర్థికంగా రాష్ట్రం ఇబ్బందులు పడుతున్నప్పటికీ గత పాలకుల హయంలో ప్రారంభించిన పథకాలను కొనసాగిస్తూనే, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాట మేరకు ఒక్కొక్క హామీ అమలు చేస్తున్నామని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల వ్యవధిలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి 10 లక్షలకు పెంపు, మహిళలకు ఆర్టిసి బస్సులో ఉచిత బస్సు ప్రయాణం పథకాలను ప్రారంభించామని అన్నారు. వైయస్సార్ జయంతి సందర్భంగా ఆయన హయాంలో ప్రారంభించిన ఆరోగ్యశ్రీ, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఫీజు రీయింబర్స్ మెంట్ వంటి పథకాలను కొనసాగిస్తూ అదనంగా పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని అన్నారు. పేదలు చాలా కాలంగా ఎదురు చూస్తున్న నూతన రేషన్ కార్డుల జారీ చేస్తున్నామని అన్నారు. 500 రూపాయల గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తున్నామని, 25 లక్షల రైతులకు 2 లక్షల వరకు పంట రుణ మాఫీ, సన్న వడ్లకు క్వింటాళ్ల 500 బోనస్, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రెసిడెన్షియల్ పాఠశాలలో 40% డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్ చార్జీల పెంపు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం వంటి అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల చేపట్టామని అన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద మహిళలకు వడ్డీ లేని రుణాలు అందించి వారిని పారిశ్రామిక వేత్తలుగా ప్రోత్సహిస్తున్నామని అన్నారు.

ముంపు గ్రామాల నిర్వాసితులకు రాజీవ్ యువ వికాసం పథకం క్రింద వ్యాపార యూనిట్ల ప్రత్యేకంగా మంజూరు చేసేలా కృషి చేస్తామని ప్రభుత్వ విప్ తెలిపారు. పేదల పట్ల కారుణ్యం తో జిల్లా కలెక్టర్ పనిచేస్తున్నారని ప్రభుత్వ విప్ ప్రశంసించారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ స్టేట్ రిజర్వు నుంచి మొట్టమొదటి సారిగా 5 వేల ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వ విప్ మిడ్ మానేరు ముంపు గ్రామాల నిర్వాసితులకు ప్రభుత్వ విప్ ప్రత్యేక చొరువతో మంజూరు చేయడం జరిగిందని అన్నారు.

ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు 4 దశలలో 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందుతుందని అన్నారు. బేస్మెంట్ నిర్మాణం పూర్తైన తర్వాత లక్ష రూపాయల, గోడలు నిర్మిస్తే లక్ష రూపాయలు, స్లాబ్ నిర్మించిన తర్వాత 2 లక్షల రూపాయలు, ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత మరో లక్ష రూపాయలు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని కలెక్టర్ తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం 400 నుంచి 600 చదరపు గజాల లోపు మాత్రమే నిర్మించాలని కలెక్టర్ తెలిపారు. 600 చదరపు గజాల కంటే ఎక్కువ విస్తీర్ణంలో నిర్మిస్తే చెల్లింపు లలో ఇబ్బందులు ఎదురవుతాయని అన్నారు.అమ్మ నాన్న చనిపోయిన కేసులలో పిల్లలకు ఆ ఇల్లు వచ్చేలా చూస్తామని అన్నారు. నేడు 847 మంది లబ్ధిదారులకు ఇండ్లు మంజూరు చేస్తున్నామని, వీరు కొత్త సంవత్సరం లోపు నిర్మాణ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాము, పిడి హౌసింగ్ శంకర్, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ ఇతర ప్రజా ప్రతినిధులు ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు, నాయకులు లబ్ధిదారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించండి

- మైనార్టీ గురుకుల పాఠశాలలో ఆకస్మిక తనిఖీ
- విద్యా బోధన, వసతి, పరిశుభ్రత, ఆహార నాణ్యతపై ప్రత్యేక దృష్టి.
- జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య



**సంగారెడ్డి, జూలై 8(మనం ప్రతినిధి):** సంగారెడ్డి జిల్లా, కంది మండలంలోని మైనార్టీ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థుల వసతులు, ఆహార నాణ్యత, పరిశుభ్రత , విద్య బోధన వంటి ముఖ్య అంశాలపై సమగ్రంగా పరిశీలించారు. ముందుగా కలెక్టర్ హాస్టల్ గదులను తనిఖీ చేశారు. మెనూ బోర్డు ప్రదర్శనను తిలకించారు. అనంతరం కిచెన్ షెడ్, డైనింగ్ హాల్ను పరిశీలించారు. ఆ సమయంలో వసతి గృహంలో భోజనం చేస్తున్న విద్యార్థుల వద్దకు వెళ్లి ముచ్చటించారు. డైనింగ్ టేబుల్ వద్ద భోజనం చేస్తున్న విద్యార్థులను ఆప్యాయంగా పలకరించిన కలెక్టర్ ఆహారం రుచి ఎలా ఉంది? సమయానికి భోజనం అందుతుందా? మేను ప్రకారం భోజనం అందిస్తున్నారా వంటి ప్రశ్నలు అడిగి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. తర్వాత తరగతి గదులను కలెక్టర్ పరిశీలించారు. అందరికీ పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు అందాయా? అని అడిగి తెలుసుకున్నారు. గురుకుల పాఠశాలల్లో ఎదుర్కొంటున్న సమస్యలు అవసరాలపై కూడా వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేందుకు అవసరమైన బోధన ఉపకరణాలను ఉపయోగించి విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆరోగ్యపరంగా విద్యార్థులపై తగిన శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. గురుకుల ప్రాంగణం శుభ్రంగా ఉండేలా చూడాలని ,వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న వసతులను విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందేలా చూడడం అధికారుల బాధ్యత అని అన్నారు. గురుకులాల లక్ష్యం సామాన్యుల పిల్లలకు ఉత్తమ విద్యను అందించడమేనని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట జిల్లా మైనార్టీసంక్షేమ అధికారి దేవుజ, గురుకుల ప్రిన్సిపాల్ , ఉపాధ్యాయులు, అధికారులు ఉన్నారు.

# సిగాచి పరిశ్రమను సందర్శించిన ఎన్‌డీఎంఏ బృందం



- ప్రమాద స్థలాన్నినిశితంగా అధ్యయనం చేసిన కేంద్ర బృందం

**రామచంద్రాపురం, జూలై 8(మనం న్యూస్):** ఇటీవల భారీ ప్రమాదం జరిగిన పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగాచి ఫార్మా కంపెనీని మంగళవారం జాతీయ విపత్తు నివారణ సంస్థ బృందం సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్డిఎంఏ కేంద్ర బృందం కమిటీ సభ్యులు, సిగాచి పరిశ్రమలో ప్రమాదం జరగడానికి గల కారణాలపై నిశితంగా అధ్యయనం చేశారు. పరిశ్రమలో జరిగిన భారీ ప్రమాదానికి గల అధ్యయనం చేశారు. పరిశ్రమలో జరిగిన భారీ ప్రమాదానికి గల కారణాలు అధ్యయనం చేయడంతో పాటు ఇలాంటి సంఘటనలు పరిశ్రమలలో పునరావృతం కాకుండా చేపట్టాల్సిన చర్యలపై కేంద్ర ప్రభుత్వం నిర్వహణ సంస్థ కమిటీ సభ్యులు సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సంఘటన జరిగిన తీరును బృందం సభ్యులకు వివరించారు.

ప్రమాదం జరిగిన తర్వాత చేపట్టిన సహాయక చర్యలను కమిటీ సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, పరిశ్రమల శాఖ, అగ్నిమాపక శాఖ,కార్మిక శాఖ, పోలీసు, రెవెన్యూశాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆస్తిని లాక్కొని తల్లిదండ్రులకు బువ్వ పెట్టనన్న కొడుకు

- ఉన్నది లాక్కొని చంపేస్తా.. అంటూ బెదిరింపులు
- సీనియర్ సిటిజన్స్‌కు తప్పని కష్టాలు
- ఎస్పీకి ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు



**మేడిపల్లి, జూలై 8 (మనం న్యూస్):** మేడిపల్లి మండల కేంద్రంలో చోటుచేసుకున్న ఈ వార్త వివరాల్లోకి వెళ్తే సురకంటి భూమరెడ్డి, లక్ష్మీ అనే వృద్ధ దంపతులకు కొడుకు లింగారెడ్డి, కోడలు పుష్పలత, మనుమడు రంజిత్‌లు ఉన్నారు. వృద్ధులను పట్టించుకోకపొగ మానవత్వాన్ని మరచి వారిని చంపుతామని బెదిరింపులకు గురిచేస్తున్నారని మంగళవారం జగిత్యాల జిల్లా ఎస్పీ గారిని కలిసి తమ గోడును వెళ్ళిబుచుకున్నారు. ఇదే క్రమంలో సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ జిల్లా సంఘానికి ఫిర్యాదు చేశారు. ఆ వినతిపత్రాల్లోనీ వివరాల్లోకి వెళ్ళితే తమ పేరు మీదున్న భూములను కొడుకు పేరు మీద మార్చాలని రైతు బంధు డబ్బులు వారికే ఇవ్వాలని తరచుగా కొట్టుతూ,చంపుతామని బెదిరిస్తూ చాలా ఇబ్బందులకు గురిచేస్తున్నారని అవేదన వ్యక్తం చేశారు. వారిపై తగు చర్యలు తీసుకోనీ సీనియర్ సిటిజన్ కు న్యాయం జరిగేలా చూడలని వారు కోరుట్ల ఆర్డీవో కార్యాలయంలో పిర్యాదు చేశారు. వృద్ధుల సంరక్షణ కింద కేసు దాఖలు చేశామని,వేధింపులు మానక పోతే 3 మాసాల జైలు శిక్షతో పాటు జరిమానాకు వారు చట్ట ప్రకారం శిక్షకు గురువుతారని సీనియర్ సిటీజేన్స్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్, కౌన్సెలింగ్ అధికారి పి.సి.హన్మంత రెడ్డి లు పేర్కొన్నారు.

# మద్యం సేవిస్తూ పట్టుబడిన వారికీ జరిమానా



**రాజన్న సిరిసిల్ల, జూలై 8(మనం ప్రతినిధి):** సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఆదేశాల మేరకు 14 రోజులుగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా 27 మంది మందు బాబులు పట్టుబడగా వారిని సిరిసిల్ల పోలీసులు మంగళవారం రోజున కోర్టులో ప్రవేశపెట్టగా 24 మందికి ఒక్కొక్కరికి 1000/- రూపాయలు, ముగ్గురిలో ఒక్కొక్కరికి 1500/- జరిమానా,బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ పట్టుబడిన 13మందిలో ఒక్కొక్కరికి 1000/- రూపాయలు జరిమానా విధిస్తు మేజిస్ట్రేట్ జయశ్రీ గారు తీర్పు వెల్లడించినట్లు టౌన్ ఇన్స్పెక్టర్ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ లో డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన మందు బాబులకు సిరిసిల్ల ట్రాఫిక్ ఆర్.ఎస్.ఐ దిలీప్ ఆధ్వర్యంలో మందుబాబులకు ఇంకెప్పుడు మద్యం సేవించి వాహనాలు నడపమని ప్రతిజ్ఞ చేపించారు.ఈసందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూప్రతి రోజు పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు,వాహన తనిఖీలు నిర్వహించడం జరిగుతుందని, మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వ్యక్తుల పై,బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ పట్టుబడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.మద్యం సేవించి వాహనాలు నడుపుతు పట్టుబడిన వారికి వారి తల్లితండ్రుల, లేదా కుటుంబ పెద్దల సమక్షంలో కౌన్సెలింగ్ ఇవ్వడం జరిగుతుందని అన్నారు.మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడితే భవిష్యత్తులో వచ్చే ఉద్యోగ అవకాశాలు కానీ, ఉపాధి అవకాశలకు పోలీస్ వెరైఫికేషన్ సమయంలో ఇబ్బందులు కలుగుతయని,ట్రాఫిక్, రోడ్ భద్రత నియమ నిబంధనలను ఉల్లంఘిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# బీఎల్ఓలు క్షేత్ర స్థాయిలో ప్రతి ఇల్లు సందర్శించాలి

- జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి



**కరీంనగర్, జూలై 8(మనం బ్యూరో):** బూత్ స్థాయి అధికారులు కొత్త ఓటర్ల నమోదు సందర్భంలో క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటినీ సందర్శించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి అన్నారు.చొప్పదండిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన బూత్ లెవెల్ ఆఫీసర్ల శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్తగా ఓటర్లను నమోదు చేసినప్పుడు, లేని ఓటర్లను జాబితా తొలగించినప్పుడు అత్యంత జాగ్రత్తతో వ్యవహరించాలని సూచించారు. ఫారం 6, 7, 8 పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరూ ఓటు హక్కు లేకుండా ఉండరాదని సూచించారు. క్షేత్రస్థాయిలో సందర్శిస్తూ పూర్తి ఆధారాలతో ఎప్పటికప్పుడు ఓటర్ల నమోదు, తొలగింపు చేపట్టాలని తెలిపారు. తప్పులు లేని ఓటర్ల జాబితా తయారు చేయడంలో బిఎల్ఓల పాత్ర ఎంతో ముఖ్యమైనదని అన్నారు. కొత్తగా వచ్చిన నిబంధనలు, మార్పులు, సడలింపులపై ఎప్పటికప్పుడు అవగాహనతో ఉండాలని, ఏమైనా అనుమానాలు ఉంటే ఉన్నతాధికారులతో నివృత్తి చేసుకోవాలని సూచించారు. బూత్ లెవెల్ ఆఫీసర్లలో ఎవరైనా ఇంటర్ పూర్తి చేయని వారు ఉంటే ఓపెన్ స్కూల్లో తప్పకుండా చేరాలని అన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఎంపీడీవో ఆర్.వేణుగోపాలరావు, డిప్యూటీ తహసిల్దార్ శ్రీనివాస్,ఎం.పి.ఓ రాజగోపాల్ రెడ్డి, ఎలక్షన్ డి.టి మనోజ్ పాల్గొన్నారు.

# బాల కార్మికుడి నుంచి కవిగా, అధ్యాపకుడిగా వాసరవేణి





**ఎల్లారెడ్డిపేట, జూలై 8(మనం న్యూస్):** పేదరికంలో పెరిగి బాల కార్మికుడిగా జీవితం ప్రారంభించి విద్యారంగంలో నిలకడగా ఎదిగి తెలుగు బాల సాహిత్యంలో తనదైన ముద్ర వేసిన వ్యక్తి డాక్టర్ వారసవేణి పరుశరాములు 1978జూన్ 10న రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని సింగారం గ్రామానికి చెందిన పర్శరాములు తల్లిదండ్రులు లక్ష్మి నరసయ్య జన్మించాడు వృత్తి పని చేసుకునే తల్లిదండ్రులు కూలీ పని చేస్తూ జీవనము కొనసాగించారు. పర్శరాములు కూడా చిన్ననాటి నుంచి కూలీగా పనిచేస్తూ చదువును కొనసాగించినాడు. ప్రైవేటు ఉపాధ్యాయులుగా అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉపన్యాసకునిగా ఎదిగారు.

2001లో మొదటి కథ సంపుటి చుక్ చుక్ రైలు, తరువాత చల్ చల్ గుర్రం, మట్టిలో మాణిక్యం, చైతన్య మూర్తి ,చిర్రగోని, చెట్టెరిక నారుమడి మట్టి ఎద్దు కర్రే ఎద్దు తెలంగాణ వ్యవహారిక పదాలు ఓ స్వార్థ రాజకీయ నాయకులారా, వంటి అనేక రచనలు బాలల శతకం బాలలకోసం రాసిన పాటలు నాన్న చెప్పిన కథలు, శతకాలు, జానపద గీతాలు వేల సంఖ్యలో ఉన్నాయి , వయ్యారాలు పేరుతో జానపద పాటల క్యాసెట్ కూడా విడుదల చేశారు. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ జాతీయ సాహిత్య పరిషత్, నవీన బాలకాండ సాహితీ సంస్థల నుండి ఉత్తమ బాల సాహిత్య అవార్డును పొందారు. తెలుగు యూనివర్సిటీ బాలసాహిత్య కీర్తి పురస్కారం నవీన బాలానంద పురస్కారం వాసాల నరసయ్య బాల సాహితీ పురస్కారం బిఎస్ రాములు అవార్డు తెలంగాణ రాష్ట్ర బాలసాహిత్య ములు తొలి తెలుగు పీహెచ్డీ గ్రహీత వాసరవేణి పరశురాములు 400కు పైగా వ్యాసాలు వివిధ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. 2016లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ గౌరవప్రదస్కారం అందుకున్నారు బాలల కోసం సమాజం కోసం అంతరాల నుంచి రాసే వాసవేణి పరశురాములు నేటి యువతకు స్ఫూర్తిదాయక వ్యక్తిత్వం.

# పేకాట స్థావరంపై పోలీసుల దాడి

## రూ. 43,099 వేలు, 9 ఫోన్లు, 9 మోటార్ సైకిళ్లు స్వాధీనం



**హుస్నాబాద్, జూలై 08, మనం న్యూస్:** హుస్నాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే హుస్నాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవేంద్ర నగర్ గామానికి చెందిన వడ్లూరి లక్ష్మణ్ కుంచెందిన పశువుల కొట్టంలో పలువురు పేకాట ఆడుతున్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు, హుస్నాబాద్ పోలీసులు వెళ్లి రైడ్ చేసి పది మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ.43,099 వేల నగదు, 9 మొబైల్ ఫోన్లు, 9 మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పేకాట అడిన వారిలో హుస్నాబాద్ పట్టణానికి చెందిన దొంతరవేణి ఐలయ్య, బొర్రా శ్రీనివాస్, చెన్నూరి శ్రీనివాస్, కుట్ల రాజయ్య, బసవేణి సాగర్, ఐపాక శ్రీనివాస్, పత్రి మహేందర్, మహమ్మద్ షబ్బీర్, వంటడుపాల వెంకటస్వామి, తూర్పాటి అనిల్ లు ఉన్నారని వారిని ఆదుపులోకి తీసుకొని కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో, అతిధి గృహాల్లో ఎవరైనా పేకాట ఆడినా, మరే ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు.

# ప్రభుత్వం చేయూతతో విద్యార్థుల భవిష్యత్తు బంగారు బాట

- టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్



**కడ్తాల్, జులై 8 ( మసనం, న్యూస్):** కడ్తాల్ మండలం మైసిగండి ఆశ్రమ పాఠశాలలో స్థానిక ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్ కిరణ్ తో కలిసి పిసిసి సభ్యుడు శ్రీనివాస్ గౌడ్ హాస్టల్లో పరిసరాలు పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్య సమస్యలు తెలుసుకొని వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ హాస్టల్లో చదువుకునే విద్యార్థిని విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డైట్ చార్జీలు కాస్మోటిక్ చార్జీలు పెంచడం పెంచడం వలన విద్యార్థిని విద్యార్థులు లు వారి తల్లిదండ్రులు చాలా సంతోషంగా ఉన్నారని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గత 16 సంవత్సరాల నుండి కాస్మో టిక్ ఛార్జీలు గత 8 సంవత్సరాల నుండి డైట్ చార్జీలు పెంచకుండా విద్యార్థులను ఇబ్బంది పెడుతుంటే రేవంత్ రెడ్డి గారు కాస్మోటిక్ చార్జలు 200% డైట్ చార్జీలు 40 శాతం పెంచి ఈ రాష్ట్రంలో 8 లక్షల లకు పైగా విద్యార్థులను న్యాయం చేశారని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. అలాగే ప్రతి హాస్టల్లో ఐదు లక్షల రూపాయలతో త్రాగు నీరు కోసం ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసి విద్యార్థులకు స్వచ్ఛమైన ఫిల్టర్ నీరు అందిస్తున్నారని అన్నారు. అలాగే స్కూల్స్ హాస్టల్స్ ప్రారంభం నుండే పర్మనెంట్ ఆర్టికల్ కింద ట్రంకు బాక్సు కార్పేట్,బెడ్, డ్రెస్సులు తినడానికి కావలిసిన వస్తువులు, నోట్ బుక్స్ విద్యార్థులకు కావలసినవి అన్నీ కూడా స్కూల్ ప్రారంభం రోజే అందజేయడం జరిగిందన్నారు. అలాగే ఆశ్రమం పాఠశాలల్లో సి ఆర్ టి కాంట్రాక్ట్ టీచర్లను నియమించి టీచర్ల కొరత లేకుండా చేశారన్నారు ఇంకా కొరత ఉంటే ఏ వి సి విద్యా వాలంటీర్లను కూడా నియమించి విద్యార్థులకు తగు బోధించడం జరుగుతుందన్నారు. గతంలో ఎప్పుడు లేని విధంగా 23 వేల రూపాయలు జీతం ఇచ్చి ఒక ఏఎన్ఎం నియమించి విద్యార్థుల ఆరోగ్యం చూసుకోవడానికి అలాగే ప్రతివారం స్థానిక ప్రభుత్వ వైద్యాధికారి వారి బృందంతో విద్యార్థులను ఆనారోగ్య సమస్యలు లేకుండా తగు చర్యలు తీసుకుంటుందన్నారు. డైట్ చార్జీల పెంపుతో ప్రతి వారంలో ఐదు రోజులు గుడ్లు పండ్లు రెండు రోజులు చికెన్ పెట్టి విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహారం అందిస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై 500 కోట్లకు పైగా భారం పడుతున్న విద్యార్థుల బాగుకోసం విద్యార్థుల భవిష్యత్తు కోసం ఎంత భరించడానికి అయినా సిద్ధంగా ఉందన్నారు. ప్రైవేట్ స్కూల్లోకి దీటుగా ఆశ్రమ పాఠశాలలో ప్రభుత్వము విద్యను అందిస్తుందని పిల్లల చదువులో క్రమశిక్షణలో ఆటపాటల్లో అన్నిట్లల్లో ఆశ్రమ పాఠశాలలో గురుకులాలలో హాస్టల్లో చదువుకుంటున్న పిల్లలే ఎక్కువ రాణిస్తున్నారని వారికి భవిష్యత్తులో ఇంకా ఏమి కావాలన్నా సమకూర్చడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు సుముఖంగా ఉన్నారని ప్రభుత్వం పేరు రాష్ట్ర ఖ్యాతి తీసుకురావాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. హాస్టల్ ఉన్న సమస్యలు విద్యార్థుల ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకొని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేపిస్తామని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమం లో జవహర్ లాల్ నాయక్,హీరా సింగ్ నాయక్ తులసిరాం నాయక్, రాము నాయక్,వార్డెన్ బాలరాజ్, హెడ్ మాస్టర్ పాపయ్య, టీచర్లు భగవతి, సరిత, నహీమోద్దీన్, సంతోష్ కుమార్, వెంకటయ్య, సురేష్, శ్రీశైలం, మంజుల హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలి

- తొగుట ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి



**తొగుట, జూలై 8(మనం న్యూస్):** ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించేందుకు కృషి చేయాలని తొగుట ఎంపిడిఓ శ్రీనివాస్ రెడ్డి సూచించారు. మంగళవారం తొగుట మండలం వెంకట్రావుపేట గ్రామంలో వనమహోత్సవాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రకృతిని మనం కాపాడితే ప్రకృతి మనల్ని కాపాడుతుందని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రతి వ్యక్తి భాద్యతగా భావించి గ్రామంలో ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటడమే కాకుండా వాటిని రక్షించే బాధ్యత కూడా మనమే తీసుకోవాలని అన్నారు. జన్మదిన కార్యక్రమాలలో భాగంగా పర్యావరణాన్ని కలుషితం చేయకుండా పర్యావరణాన్ని కాపాడేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు బెజ్జనబోయిన అనిల్,బి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి రవీందర్, దుబ్బాక ఆత్మ కమిటీ డైరెక్టర్ బి.ప్రవీణ్, పిల్ అసిస్టెంట్ నవీన్, అంగన్వాడీ టీచర్స్, ఆశ వర్కర్స్, గ్రామ పార్టీ అధ్యక్షులు వోలపు నారాయణ, ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షులు ఎర్రోళ్ల అర్జున్, వెంకటయ్య, స్వామి గౌడ్, సాజిద్, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రైతు బాంధవుడు, ప్రజాసంక్షేమ సారథి, మహానేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా ఆ మహనీయునికి గాంధీ భవన్ లో నివాళులు అర్పించిన టి పీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త.
(రంగారెడ్డి మనం న్యూస్)

# నేటి సమ్మెకు జర్నలిస్ట్ ఫెడరేషన్ సంఘీభావం

**తుర్కయంజాల్, జులై 8(మనం న్యూస్):** తూర్కయంజాల్ జర్నలిస్ట్ సంఘం దేశవ్యాప్తంగా జూలై 9న కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన సమ్మె పిలుపునకు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ సంపూర్ణ సంఘీభావం ప్రకటిస్తోంది. వర్కింగ్ జర్నలిస్టుల చట్టం, వేతన చెల్లింపు చట్టాలతో పాటు 44 చట్టాలను రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా కార్మిక సంఘాలు చేస్తున్న ఆందోళనకు సంఘీభావం ప్రకటిస్తున్నాం. అందులో భాగస్వాములమవుతున్నాం. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా. , నియోజకవర్గం కమిటీలు జూలై 9న అన్ని జిల్లా కేంద్రాలలో కేంద్ర కార్మిక సంఘాలతో పాటు జరిగే ఆందోళనలో పాల్గొనాలని కోరుతున్నాం. కేంద్ర కార్మిక సంఘాల నిర్వహించే ధర్నాలు ప్రదర్శనలు ఇతర ఆందోళన కార్యక్రమాల్లో భాగస్వాములం కావడం ద్వారా కార్మిక ఐక్యతను ప్రదర్శించాలని విజ్ఞప్తి చేస్తున్నామని, జర్నలిస్టులకున్న వర్కింగ్ జర్నలిస్టుల చట్టం వేతన చెల్లింపు చట్టాల పునరుద్ధరణతో జర్నలిస్టు వృత్తి ప్రమాణాలను నిలబెట్టుకోగలమని చాటి చెబుదామన్నారు.

# క్రీడాకారులకు ఆర్థిక సహాయం అందజేసిన ఉప్పల



**రంగారెడ్డి జూలై 8 (మనం న్యూస్)** అండర్ 13 డబుల్స్ విభాగంలో నేషనల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన పొద్దుటూరి అన్య , వైభవ్ రమ్య క్రీడాకారులకు నాగోల్ లోని ఉప్పల నివాసం లో సన్మానించి ఇద్దరికీ తలో రూ. 10 వేల రూపాయల ఆర్థిక సహాయం టిపిసిసి ప్రధాన కార్యదర్శి, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తఅందజేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో అత్యున్నత ప్రతిభ కనబరిచిన సమాజానికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆయన కోరారు. క్రీడాకారులకు ఉప్పల ఫౌండేషన్ ద్వారా అనేక సేవా సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కోశాధికారి హర్ష , క్రీడాకారుల తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# పేదలపాలిట దేవుడు వైఎస్ఆర్



**జగిత్యాల, జూలై 8( మనం ప్రతినిధి):** పేదల పాలిట దేవుడు స్వర్గీయ వై ఎస్ రాజశేఖర్ రెడ్డి అని బుగ్గారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల సుభాష్ అన్నారు. జిల్లాలోని బుగ్గారం మండల కేంద్రంలోని రైతువేధిక వద్ద మంగళవారం నిర్వహించిన దివాంగత మహానేత తెలుగు రాష్ట్రాల గుండె చప్పుడైన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 16వ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 76 వ జయంతి వేడుకలను బుగ్గారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల సుభాష్ ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల సుభాష్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా రాజశేఖర్ రెడ్డి చేసిన 108,104, ఆరోగ్యశ్రీ ఉచిత కరెంటు, రైతులకు రుణమాఫీ, ఉపాధిహామీ పథకం లాంటి ఎన్నో సేవలను అందించారని గుర్తు చేశారు. కొండపల్లి సంతోష్ రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గజ్జెల రాజు, కుంట మహేష్,గజ్జెల విజయ్ , నంది తిరుపతి, బండారి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల ఆర్థిక అభివృద్ధికి అండగా సహకార సంఘాలు



**సిద్దిపేట అర్బన్, జూలై 08(మనం న్యూస్):** రైతులు ఆర్థిక అభివృద్ధి సాధించే విధంగా సహకార సంఘాలు అండగా నిలుస్తున్నాయని మిట్టపల్లి పిఎసిఎస్ చైర్మన్ చింతల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం అంతర్జాతీయ సహకార సంవత్సరం పురస్కరించుకొని సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లిలోని పిఎసిఎస్ కార్యాలయం ఎదుట చైర్మన్ చింతల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పిఎసిఎస్ ద్వారా తక్కువ వడ్డీకే రైతులకు వ్యవసాయ రుణాలను పెద్ద మొత్తంలో అందిస్తున్నట్టు తెలిపారు. అలాగే సబ్సిడీలో ఎరువుల బస్తాలు అందిస్తున్నట్టు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రైతులు పిఎసిఎస్ కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ జీ.. రామయ్య భూములను కాపాడలేరా?

## ఆంధ్రలో ఉన్న భద్రాద్రి రామయ్య భూములకు రక్షణ కల్పిస్తారా...!

## అక్రమాలను అడ్డుకునేందుకు వెళ్లిన దేవస్థానం ఈవోపై దాడి

**భద్రాచలం, జూలై 8 (మనం న్యూస్):** దేవాలయం భూములు ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అనేక సందర్భాల్లో ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. దేవాలయం భూములంటే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సంబంధించిన భూములేనా, దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి భూములకూ కూడా వర్తిస్తుందా అని రామభక్తులు ప్రశ్నిస్తున్నారు . రాష్ట్ర విభజన జరిగిన తర్వాత శ్రీ సీతారామచంద్ర స్వామివారి భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. కొందరు నాయకులు, స్థానికలతో కలిసి రాముల వారి భూములను ఆక్రమిస్తున్నారు. అడ్డుకుంటున్న భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం ఈఓ , సిబ్బందిపై పలు దఫాలుగా దాడులు జరిగాయి. దేవుడు భూములకే రక్షణ లేకపోతే, సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రజలు,రామ భక్తులు ఆశ్చర్యం



వ్యక్తం చేస్తున్నారు.... ఆంధ్రాలోని ఎటపాక మండలం, పురుషోత్తమ పట్నం గ్రామంలో ఉన్న భద్రాచలం రామాలయం భూమిలో అక్రమ నిర్మాణం చేపట్టారని తెలుసుకున్న రామాలయం అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని, అక్రమ కట్టడం తొలిగించే ప్రయత్నం చేశారు. ఈ వివాదంలో ఆక్రమణ దారులు రామాలయం ఇఓ రమాదేవిపై తిరగపడ్డారు. రామాలయం భూములలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదని గతంలో గౌరవ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పు ఇచ్చిన కూడా అక్రమ నిర్మాణాలు ఆగటం లేదు. ఈ విషయం తెలుసుకున్న దేవస్థానం ఈఓ మంగళవారం తన సిబ్బందితో కలిసి పురుషోత్తపట్నం వెళ్లి ఆక్రమణదారులతో మాటలేందుకు ప్రయత్నించగా వారు ఆమెపై దాడి చేశారు. ఆ దాడిలో ఈవో రమాదేవి స్పృహ కోల్పోయారు. కొన్ని సంవత్సరాలుగా రామాలయం భూముల పై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, హైకోర్టు దృష్టికి శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం అధికారులు తీసుకువెళ్లినా ఆక్రమణదారల ఆగడాలు ఆగడం లేదు. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు స్పందించాలని రామభక్తులు, ప్రజలు కోరుతున్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ జన్మదిన వేడుకలు





**దమ్మపేట, జూలై 8 (మనం న్యూస్):** అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ జన్మదినాన్ని స్వగ్రామం గండుగులపల్లి, క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో మంగళవారం నిర్వహించారు. అందులో భాగంగా మొదటిగా వారి చేతులతో గండుగులపల్లి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వివిధ రకాల పండ్ల మొక్కలు నాటారు. అనంతరం దమ్మపేట మండల కేంద్రంలో దివంగత నేత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి,జయంతి సందర్భంగా వారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

**మొద్దులగూడెంలో నోట్ పుస్తకాలు పంపిణీ**

అశ్వారావుపేట, శాసన సభ్యులు జారే ఆదినారాయణ జన్మదినం సందర్భంగా మొద్దులగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో స్థానిక కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో సుమారు నలభై మంది విద్యార్థులకు,నోటు పుస్తకాలు, పెన్నులు, చాక్లెట్లు,బిస్కెట్లు పంపిణీ చేశారు. దమ్మపేట, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు, కాక రమేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చాలా కష్టపడి ఉన్నతమైన చదువులు చదువుకొని ఉపాధ్యాయ వృత్తిలో ఉద్యోగం సాధించి అనేక మంది విద్యార్థులను ప్రయోజకులుగా తయారుచేశారన్నారు. అంతటితో సంతృప్తి చెందకుండా ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాలలో గత పది సంవత్సరాల నుండి ప్రజలలో మమేకమువుతూ ప్రజా శ్రేయస్సు కోసం శ్రమిస్తూ ప్రజల పక్షాన నిలబడినారని తెలిపారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను, ఏర్పరచుకొని. చదువులో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్ర మంలో దమ్మపేట, మండల నాయకులు ముళ్ళపూడి వేంకటేశ్వరరావు,దొడ్డ నరేష్, నిమ్మగడ్డ త్రినాద్,బొంతు రాజశేఖర్, దొడ్డ లక్ష్మణరావు,బొగ్గం యేహోషువ, కర్లపూడి బాలు, తంగేళ్ల విశ్వనాథ్,మడివి వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఓటర్ జాబితా తయారీలో బిఎల్ఓల పాత్ర కీలకం




**మధిర,జూలై8(మనం న్యూస్):** ఓటరు జాబితా తయారీలో బిఎల్ఓల పాత్రం కీలకమని తహశీల్దార్ రాంబాబు పేర్కొన్నారు. మండలంలోని బిఎల్ఓలకు నేషనల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్, కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ కార్యక్రమం స్థానిక టివిఎం స్కూల్లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఆర్. రాంబాబు మాట్లాడుతూ బిఎల్ఓలందరూ 18 సంవత్సరాలు నిండిన వారిని ఓటరుగా నమోదు చేయాలని, ప్రతి బిఎల్వో ఫారం 6,6అ,7,8 లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, క్షేత్రస్థాయిలో మీ,మీ విధులను చక్కగా నిర్వహించాలని ,మీ పాత్రను సమర్థవంతంగా పోషించాలని తెలిపారు .ఎన్నికల డి టి డేవిడ్ కరుణాకర్ మాట్లాడుతూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్‌లో బిఎల్ఓ విధులు ,ఇంటింటి హౌస్ టు హౌస్ గణన గురించి, ప్రతి బిఎల్ఓ యాప్, ఓటర్ హెల్ప్ లైన్ యాప్, సి విజిల్ యాప్ కలిగి ఉండాలని తెలిపారు. మధిర నియోజకవర్గం ఏఎల్ఎంటి ఎండి. జమీర్, జె.విశ్వనాథం శిక్షణ కార్యక్రమంలో ఫారం 6,6అ,7,8, జటఆర్వో ఆఫీసులో తయారు చేయవలసిన, అభ్యంతరాలకు సంబంధించిన వివిధ పారాలు 9, 10, 11,11 అ, 11 బిబి, నజరీ నక్ష, బిఎల్ఓ ఆప్, ఓటర్ హెల్ప్ లైన్ యాప్, బూత్ స్థాయి వాలంటీర్లు బి ఎల్ వి, బూతు స్థాయి అవగాహన బృందాలు బిఏ జి, బూత్ లెవెల్ ఏజెంట్ బి ఎల్ ఏ, స్పెషల్ ఇంటెన్సీ రివిజన్ ఎస్ ఐ ఆర్ ల గురించి పూర్తి అవగాహనతో పి పి టి ల ద్వారా వివరించారు. చివరగా బిఎల్ఓ ల అందరికి ఆన్లైన్ లింకు ద్వారా ఎగ్జామ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ భాను ప్రసాద్, ఏ ఎస్ ఓ సాయి, ఎస్ ఏ వాసు, ఆఫీసు సిబ్బంది, మండలంలోని బిఎల్వోలు పాల్గొన్నారు.

## వాతావరణాన్ని నియంత్రించడంలో మొక్కలు ఉపయోగపడతాయి

- **వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం**

**మణుగూరు, జూలై 8(మనం న్యూస్):** మణుగూరు మండలం సంతోష్ నగర్ ఎఫ్‌డీఓ ఆఫీస్ నందు వన మహోత్సవ కార్యక్రమంలో పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ మొక్కల వల్ల ఎన్నో ఉపయోగాలున్నాయి. అవి మనకు ఆహారం, నీడ, గాలి, ఔషధం, ఇతర వస్తువులను అందిస్తాయి. మొక్కలు పర్యావరణాన్ని కూడా శుభ్రపరుస్తాయని అన్నారు. మనకు పండ్లు, కూరగాయలు, ధాన్యాలు, గింజలు, నూనెలు ఇతర ఆహార పదార్థాలను అందిస్తాయి. ఇవి మన శరీరానికి అవసరమైన పోషకాలను మొక్కలు కిరణజన్య సంయోగక్రియ ద్వారా కార్బన్ డయాక్సైడ్ ను గ్రహించి, ఆక్సిజన్ ను విడుదల చేస్తాయన్నారు. గాలిలోని హానికరమైన కాలుష్య కారకాలను విషాన్ని శుభ్రపరుస్తాయన్నారు. అనేక మొక్కలలో ఔషధ గుణాలు ఉన్నాయి. వీటిని వివిధ వ్యాధుల చికిత్సకు ఉపయోగిస్తారన్నారు. మొక్కలు వాతావరణాన్ని నియంత్రించడంలో సహాయపడతాయి. ఇవి వర్షపాతాన్ని పెంచడానికి, ఉష్ణోగ్రతలను నియంత్రించడానికి గాలిని శుభ్రపరచడానికి దోహదం చేస్తాయన్నారు. అందరూ బాధ్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డి ఎఫ్ ఓ మక్సుద్, రెంజర్ ఉపేందర్ ఫారెస్ట్ అధికారులు, తహసిల్దార్ నరేష్ , ఎం.పి.డి.ఓ శ్రీనివాసరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, టౌన్




అధ్యక్షులు శివ సైదులు, మండల మహిళా అధ్యక్షురాలు సౌజన్య, పినపాక నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తరుణ్ రెడ్డి , మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సతీష్ , ఉపాధ్యక్షులు చైతన్య నాయుడు ,మణుగూరు శివాలయం చైర్మన్ కూచిపూడి బాబు మండల ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజల గుండెల్లో వైయస్సార్‌ది చెరగని ముద్ర

### పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో ఘనంగా వైఎస్ జయంతి

**చుంచుపల్లి, జూలై 08(మనం న్యూస్) :** రెండు రాష్ట్రాల ప్రజల గుండెల్లో దివంగత మాజీ సీఎం డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి చెరగని ముద్ర వేసుకున్నారని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దేవి ప్రసన్న, మాజీ జెడ్పి చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తూము చౌదరి, పెద్ద బాబు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్ అన్నారు. రెవిన్యూ మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 76వ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రమాణస్వీకారం చేయగానే ఎల్బీ స్టేడియంలో ప్రజాసమక్షంలో ఉచిత కరెంటు హామీ అమలుకు తొలి సంతకం చేసిన మహా నాయకుడని కొనియాడారు. ప్రజలకు ఆరోగ్యశ్రీ ద్వారా మేలైన వైద్యాన్ని అందించిన ఘనత ఆయనదని కొనియాడారు. వైయస్ పాలనలో పేద ప్రజలు అడిగిన రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్లు లభించాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సోసైటీ చైర్మన్ మండే వీర హనుమంత్ రావు, రైల్వే బోర్డు సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, టెలికాం బోర్డు సభ్యులు బోదాసు కనకరాజు, మైనారిటీ జిల్లా సెక్రటరీ గౌస్ పాషా, సుజాతనగర్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చింతలపూడి రాజశేఖర్, మాజీ ఏఎంసి చైర్మన్ భూక్యా రాంబాబు, చుంచుపల్లి మండల మాజీ కున్సోత్ కిషన్, మాజీ కౌన్సిలర్లు తలుగు అనిల్, రావి రాంబాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్ష్మణ్ అగర్వాల్, సుందర్ లాల్ కోరి, జయప్రకాశ్, మాధవ్ రావు, క్లాసిక్ బ్యాండ్ రమణ, హరి, జోగు ప్రదీప్, పూణేం శ్రీనివాస్, బండ వెంకటేశ్వర్లు, అయూబ్ ఖాన్, అఫ్సర్ ఖాన్, పైడా ప్రసాద్, చిమట నాగేశ్వరావు, లోసెట్టి నాగార్జున, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు మాజీ ఎంపీటీసీ రుక్మిణి, వాణి రెడ్డి, రాజలక్ష్మి, వసంత, ఆకునూరి సుప్రియ, యూత్ కాంగ్రెస్ నాయకులు గులాం మతిన్, తాటి పవన్, కసనబోయిన రామ్మూర్తి, వాంకుడోత్ శ్రీకాంత్, మద్దెల జయసూర్య పాల్గొన్నారు.

## దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

- **అఖిలపక్ష ఆధ్వర్యంలో మోటర్ సైకిల్ ర్యాలీ**

**మధిర, జూలై 7(మనం న్యూస్):** జులై 9 వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సోమవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ యార్డ్ నుండి అంబేద్కర్ సెంటర్, మెయిన్ రోడ్డు, వైరా రోడ్డు,మీదుగా మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, తెలుగుదేశం అధ్యక్షులు మల్లాది హనుమంతరావు, సిపిఐ మండల కార్యదర్శి ఓట్ల కొండలరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేయాలని 8 గంటల పని విధానాన్ని అమలు పరచాలని, కనీస వేతనం చట్టం అమల పరచాలని, కార్మిక సంఘాల హక్కులను హరించకుండా ఉండాలని తదితర డిమాండ్లతో దేశవ్యాప్తంగా 9 తారీకు జరుగు సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. 9 తారీఖు



సమ్మెలో కార్మిక సంఘాలు రైతు సంఘాలు వ్యవసాయ కార్మిక సంఘాలు వివిధ ప్రజా సంఘాలతో పాటు సిపిఎం, సిపిఐ, తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీలు బలపరచను ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికులు రైతులు వ్యవసాయ కార్మికుల తో పాటు వివిధ రాజకీయ పార్టీలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చలా నరసింహారావు, పట్టణ మండల కార్యదర్శిలు పడకండి మురళి,మందా సైదులు, రైతు సంఘం డివిజన్ అధ్యక్షులు పాపినేని రామ నరసయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు తెలపాల రాధాకృష్ణ, మండల అధ్యక్షుడు తెలుగుదేశం మండల అధ్యక్షులు మారినేడు పుల్లారావు, రాణి, సిపిఐ నాయకులు అన్నవరపు సత్యనారాయణ, పెరమాలపల్లి ప్రకాష్ రావు, కాంగ్రెస్ నాయకులు కర్ణాటక రామారావు, నిడమనూరు వంశీ సిపిఎం పార్టీ డివిజన్ కమిటీ సభ్యులు ఓట్ల శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తం చేయాలి

- **బాధితుల సమస్యల పరిష్కారానికి బాధ్యతగా కృషి చేయాలి**
- **జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**
- **కొత్తగూడెం 3టౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ**



**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 8 (మనంప్రతినిధి):** సైబర్ బారిన ప్రజలు పడకుండా నిత్యం అప్రమత్తం చేయాలని ఎస్పి రోహిత్ రాజు పోలీస్ అధికారులకు సూచించారు. మంగళవారం కొత్తగూడెం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ముందుగా కొత్తగూడెం డిఎస్పి రెహమాన్ పుష్పగుచ్ఛం అందించి జిల్లా ఎస్పీకి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ స్టేషన్లో విధులు నిర్వర్తించే సిబ్బంది నుండి గౌరవ వందనాన్ని స్వీకరించారు. కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వర్తించే సిబ్బంది ప్రభుత్వ కిట్ ఆర్టికల్స్‌ను ఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న పోలీస్ అధికారులు మరియు సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని,వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్లో వర్టికల్స్ వారీగా విధులు నిర్వర్తించే సిబ్బందిని ఒక్కొక్కరిగా వారి పనితీరు గురించి పరిశీలించారు.పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా నిత్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలకు అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. పెట్రోలింగ్, బ్లూ కోట్స్ వాహనాలతో సంచరిస్తూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. డయల్ 100 కు ఫోన్ రాగానే సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు అండగా నిలవాలని సూచించారు. పోలీస్ స్టేషన్లో పనిచేసే అధికారులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీతో పాటు అధికారులు, సిబ్బంది మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్, సీఐ శివ ప్రసాద్, ఎస్ఐలు పురుషోత్తం, విజయ కుమారి పాల్గొన్నారు.

## పిల్లల సంరక్షణ అందరి భాధ్యత

- **కలెక్టర్ జితేష్ వి. పాటిల్**
- **సంరక్షణ గృహాలలో పిల్లల ఆరోగ్య పై శ్రద్ధ చూపించాలి**
- **జిల్లా బాలల సంరక్షణ యూనిట్ (డి సి పి యు) సమావేశం**
- **చైల్ హెల్ప్ లైన్ 1098 పోస్టర్ ఆవిష్కరణ**

**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 8 (మనంప్రతినిధి):** పిల్లల సంరక్షణ అందరి బాధ్యత అని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. జిల్లా బాలల సంరక్షణ యూనిట్ (డి సి పి యు) సమావేశాన్ని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధ్యక్షతన మంగళవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్




మాట్లాడుతూ, జిల్లాను బాల కార్మిక రహిత జిల్లాగా ఉండాలని, మారుమూల ప్రాంతాల ప్రజలకు దీనిపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని కోళ్ల ఫామ్స్,ఇటుక బట్టీలు, షాపింగ్ మాల్ లో తదితర అన్నిచోట్ల తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. మణుగూరులో నిర్వహిస్తున్న బాలల సంరక్షణ గృహం జిల్లా కేంద్రంకి దూరంగా ఉండటం వలన పర్యవేక్షించడానికి అనువుగా లేదని జిల్లా కేంద్రంలో కొత్తగూడెంలో బాలల సంరక్షణ గృహం ఏర్పాటుకు ప్రణాళికల రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం మణుగూరు లో ఉన్న బాలల సంరక్షణ గృహమును సిడిపిఓ కార్యాలయంగా మార్చాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని బాలల సంరక్షణ గృహంలో పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని, సంరక్షణ గృహాలలో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి చేపట్టవలసిన చర్యలపై వారంలోగా సమగ్ర నివేదిక అందించాలని, వెంటనే సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు.సంరక్షణ గృహాలలో పిల్లల ఆరోగ్య పై శ్రద్ధ చూపించాలని, ఏదైనా పెద్ద ఆరోగ్య సమస్యలు పిల్లలకు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో బాల్య వివాహాలు అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని పాఠశాలల్లో విద్యార్థినిల హాజరు పర్యవేక్షించాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పిల్లల సంరక్షణ చేపట్టాలని, పిల్లల సంరక్షణ మన అందరి బాధ్యత అని అన్నారు. చైల్ హెల్ప్ లైన్ కు వచ్చే ఫిర్యాదులను జిల్లా, మండల, గ్రామ స్థాయిలో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం చైల్ హెల్ప్ లైన్ 1098 పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి జయలక్ష్మి , సిపిఓ సంజీవరావు, మహిళా శిశు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి లెనీనా, సి డబ్ల్యు సి సభ్యులు సుమిత్రా దేవి, బీసీ సంక్షేమ శాఖ అధికారి ఇందిరా, ఐటీ కోర్ సిఐ రాము సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేడే దేశవ్యాప్త సార్వత్రిక

- **పెట్టుబడిదారుల కోసం కార్మిక వర్గాన్ని బలి చేస్తున్న కేంద్రం**
- **29 కార్మిక చట్టాలను రద్దు చేసిన మోడీ ప్రభుత్వం**
- **తక్షణమే నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలి - కార్మిక సంఘాలు**




**కరీంనగర్ క్రైమ్ జులై 8 (మనం న్యూస్)** మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్స్ అమలుకు వ్యతిరేకంగా 2025 మే 20వ తేదీన దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెకు కార్మిక వర్గం సన్నార్థమవుతున్న సందర్భంలో పహిల్గాంలో ఉగ్రవాదుల దారుణమైన దాడులు జరిగాయి, ఆ తరువాత పాకిస్థాన్లోని ఉగ్రవాద శిబిరాలపై భారతదేశం జరిపిన వైమానిక దాడులు మరియు భారత్-పాకిస్తాన్ రెండు పొరుగు దేశాల మధ్య ఉద్రిక్తతలు జరగడం వంటి పరిణామాల దృష్ట్యా మే 20 సార్వత్రిక సమ్మెను నేటికి వాయిదా వైయాల్సి వచ్చింది , ఈ పరిణామాలు సరిహద్దు రాష్ట్రాల్లో సమ్మె కోసం ప్రచారం చేయడానికి ఆటంకంగా ముందుకు వచ్చాయి, ఈ ప్రాంతాలలో కూడా సమ్మె ప్రచారానికి అవాంతరాలు ఏర్పడ్డాయి , కానీ బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఈ పరిస్థితుల్లో కూడా అత్యంత దారుణంగా లేబర్ కోడ్స్ అమలుకు ముందుకు తీసుకురావడానికి మరియు కార్మికుల హక్కులపై దాడులను తీవ్రతరం చేయడం కొనసాగుతోంది. ప్రస్తుత పరిస్థితిని పరిగణలోకి తీసుకొని జాయింట్ ప్లాట్ఫామ్ ఆఫ్ యూనియన్స్ మరియు అసోసియేషన్స్, ఫెడరేషన్స్, నేడు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె చేయాలని నిర్ణయించాయి, మోడీ నేతృత్వంలో కార్పొరేట్ మతోన్మాదులు కార్మిక వర్గంపై చేస్తున్న దాడిని తిప్పి కొట్టి నయా ఉదారవాద విధానాలను ప్రతిఘటిస్తూ నాలుగు లేబర్ కోడ్లు రద్దుకై యావత్ కార్మిక వర్గం సిద్ధంగా ఉంది. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసింది , నాలుగు లేబర్ కోడ్స్ తెచ్చింది ,1991 తర్వాత దేశంలో అమలు జరిపిన నూతన ఆర్థిక విధానాలు ప్రవేశపెట్టబడ్డాయి, 2014 సంవత్సరం తరువాత కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నయా ఉదారవాద విధానాలను వేగవంతంగా అమలు చేస్తుంది, పెట్టుబడిదారులు కాంట్రాక్టర్లు ప్రయోజనాలు లాభాల కోసం కార్మిక వర్గాన్ని ఆధునిక బానిసలుగా తయారు చేసేందుకు ఈ నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చింది. ఇందులో మొదటగా వేతనాల కోడ్ ను 2019 లో పార్లమెంటులో ఆమోదింప చేసుకున్నది, మిగతా మూడు కోడ్స్ రెండవది పారిశ్రామిక విధానాల కోడ్, మూడవది సామాజిక భద్రత కోడ్, నాల్గవది విధినిర్వహణలో భద్రత ఆరోగ్యం పని పరిస్థితుల కోడ్ లను 2020 సెప్టెంబర్ లో ఎటువంటి చర్చకు అవకాశం ఇవ్వకుండా ముందుకు తెచ్చింది , పార్లమెంట్లో ప్రతిపక్ష పార్టీలకు చెందిన పార్లమెంట్ సభ్యులు సభను బాయ్కాట్ చేసిన సందర్భంలో బిజెపి ప్రభుత్వం ఏకపక్షంగా నిరంకుశంగా లేబర్ కోడ్లను ఆమోదింపజేసింది ప్రజలంతా కరోనా కల్లోలంతో తెల్లడిల్లుతున్న సమయంలో మోడీ సర్కార్ ఈ విగ్రహ చర్యకు పాల్పడ్డది. గత మూడున్నర దశాబ్దాలలో కేంద్రంలో పాలకవర్గాలు కార్మిక హక్కులపై ఏదో ఒక స్థాయిలో దాడి చేస్తూనే ఉన్నాయి, అధికార పార్టీలకు పూర్తి మెజారిటీ లేకపోయినా ప్రతిపక్షంలో ఉన్న బూర్జువా పార్టీల సహకారంతో కార్మిక ప్రజా వ్యతిరేక విధానాల అమలుకు ప్రయత్నించాయి, పార్లమెంటులో వామపక్ష పార్టీ బలమైన ప్రతిఘటన పార్లమెంట్ బయట కార్మిక వర్గ సమరశీల పోరాటాలతో వాటికి అమలు చేయడంలో పాలకులు వెనకడుగు వేయాల్సి వచ్చింది, మోడీ ప్రభుత్వం 2019 20 లోనే 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తెచ్చినప్పటికీ కార్మిక వర్గ ప్రతిఘటన వలన వాటిని అమలుకు సాహసించలేదు, ఇప్పుడు కార్పొరేట్ ప్రయోజనాల కోసం మతోన్మాద పాలకులు ఈ కోడ్ లను అమలు చేయాలని చూస్తున్నారు, కేంద్ర ప్రభుత్వం అనుసరించే కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సమ్మెతో సహా పెద్ద ఎత్తున దేశవ్యాప్త ఉద్యమానికి 10 కేంద్ర కార్మిక సంఘాలతో పాటు రాష్ట్ర కార్మిక సంఘాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు స్వతంత్ర ఫెడరేషన్లు అసోసియేషన్లు పిలుపునిచ్చాయి.

**సమ్మె డిమాండ్లు..**

- నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలి.
- కనీస వేతనం నెలకు 26,000 గా నిర్ణయించాలి .
- ఔట్సోర్సింగ్ ఫిక్స్డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్ అప్రెంటిషిప్ ట్రైనీలు వంటి రూపాలలో వివిధ పథకాల కింద పనిచేస్తున్న కార్మికుల ఎవరిని క్యాజువలైజ్ చేయరాదు.
- సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి.
- నెలకు కనీస పెన్షన్ 9000 ఇవ్వాలి అసంఘటిత కార్మికులు మరియు వ్యవసాయ కార్మికులతో సహా అన్ని తరగతుల కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలి.

# ప్రైమరీ స్కూల్ పిల్లలు ఇంగ్లీష్ లో మాట్లాడుతున్నారు

- **ఇది ప్రభుత్వ పాఠశాలల గొప్పతనం**
- **జిల్లా కలెక్టర దివాకర టి.ఎస్.**



**ములుగు, జులై 8, మనం ప్రతినిధిః** ప్రైమరీ పిల్లల్లో ఇంగ్లీష్ పట్ల భయాన్ని పోగొట్టి ఇంగ్లీష్ లో మాట్లాడే విధంగా దిశా నిర్దేశనం చేసిన దిశా ఫౌండేషన్ జిల్లా పాలనా యంత్రాంగంములుగు జిల్లా విద్యాశాఖ మరియు దిశా ఫౌండేషన్ ఈఎల్ఎఫ్ ఇంగ్లీష్ వారి సౌజన్యంతో జిల్లాలోని 54 ప్రాథమిక పాఠశాలల్లో లర్న్ టు రీడ్ 90 రోజుల విద్యా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. ఉపాధ్యాయులకు శిక్షణ, అదనపు మెటీరియల్ఈ కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక స్థాయి పాఠశాలల విద్యార్థులలో ఇంగ్లీష్ పై ప్రత్యేక శిక్షణ.దిశా ఫౌండేషన్ ఉఔఊ ఇంగ్లీష్ వారి సహకారంతో ముందుగా జిల్లా స్థాయిలో 54 ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేసి ఈ పాఠశాలల్లో బోధించే 108 మంది టీచర్స్ కు ప్రత్యేక శిక్షణను ఇప్పించి, ప్రాథమిక స్థాయి విద్యార్థులు సులువుగా ఆసక్తిగా ఇంగ్లీష్ నేర్చుకునేందుకు అనేక బోధనోపకరణాలను పోస్టర్స్, ఫ్లాష్ కారడ్స్ మరియు డిజిటల్ పాటలు, రైమ్స్ ను డిజిటల్ రూపంలో పెన్ డ్రైవ్ నందు పొందు పరిచి అందజేయడం జరిగింది. అలాగే ప్రతి విద్యార్థికి సులువుగా అభ్యాసం చేసే విధంగా వర్క్ బుక్స్ అందిస్తూ, విద్యార్థులకు కావలసిన అదనపు మెటీరియల్స్ అందజేసి 108 మంది టీచర్స్ తో దిశా ఫౌండేషన్, జిల్లా పాలన యంత్రాంగం మరియు జిల్లా విద్యాశాఖ ఒక ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి దాని ద్వారా టీచర్స్ ను ఎప్పటికప్పుడు మానిటర్ చేస్తూ విద్యార్థులకు ప్రారంభ పరీక్ష నిర్వహించి వారి యొక్క ప్రగతిని అంచనా వేస్తూ 90 రోజులపాటు ఈ ప్రత్యేక బోధన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. దీని ద్వారా ఎంపిక చేసినటువంటి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఆటపాటలతో ఇంగ్లీషు లో బోధిస్తూ, విద్యార్థులకు బోధనోపకరణ సామాగ్రి అందజేయడం ద్వారా ఆహ్లాదకరమైన స్వేచ్ఛాయుత వాతావరణంలో అనుభవం ద్వారా విద్యను అందించడం జరిగింది. దీని ఫలితంగా విద్యార్థులు ఆటపాటలతో ఇంగ్లీషు పై మక్కువ పెంచుకొని ఆశించిన అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచుకోవడం జరిగింది. తధానుగుణంగా దిశా కార్యక్రమం అమలు చేయబడుతున్నటువంటి పాఠశాలల్లో విద్యార్థులు ఇంగ్లీషులో ధారాళంగా మాట్లాడే విధంగా శిక్షణను ఇవ్వడం జరిగింది. దిశ కార్యక్రమం సాధించిన ప్రగతి కార్యక్రమం ద్వారా ప్రాథమిక స్థాయి పిల్లల్లో 50% విద్యార్థుల్లో అక్షరాలను గుర్తించడం, 20 శాతం విద్యార్థులు మూడు అక్షరాలు ఉన్న పదాలను చదవడం రాయడం, 45 శాతం విద్యార్థులు వాక్యాల రూపంలో ఉన్న వాటిని చదవడం రాయడం ద్వారా ప్రగతిని సాధించారు. ఈ కార్యక్రమం ప్రారంభం తర్వాత విద్యార్థులలో చదవడం రాయడానికి సంబంధించి అభివృద్ధి అనేది స్పష్టంగా కనబడింది. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మన జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు కొండపర్తి గ్రామంలో విద్యార్థుల యొక్క ఇంగ్లీష్ భాష నైపుణ్యాన్ని చూసి చాలా సంతోషించి విద్యార్థులను మరియు ఉపాధ్యాయులను అభినందించారు. రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క చల్వాయి ప్రాథమిక పాఠశాలను సందర్శించినప్పుడు విద్యార్థుల ఇంగ్లీష్ నైపుణ్యాన్ని చూసి సంభ్రమాశ్చర్యానికి గురై ఈ కార్యక్రమాన్ని మన జిల్లాలో చేపట్టిన జిల్లా కలెక్టర్ను ఇంతటి ప్రగతికి కృషి చేసిన దిశ ఫౌండేషన్ సభ్యులను, ఉపాధ్యాయులను అభినందించారు. చివరగా మొదటి విడత లో చేపట్టిన కార్యక్రమ ముగింపు ఉత్సవాలు కలెక్టరేట్ సమావేశ మందిరం నందు నిర్వహించగా జిల్లా కలెక్టర్ హాజరయ్యి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. అదే విధంగా పిల్లల్లో అంతటి నైపుణ్య సాధనకు కృషి చేసిన ఉపాధ్యాయులకు సన్మాన పత్రం, బహుమతులను అందచేశారు. ప్రైమరీ పిల్లలు ఇంగ్లీష్లో మాట్లాడడం సంతోషాన్నిచ్చిందిః జిల్లా కలెక్టర దివాకర టి.ఎస్.బండారుపల్లి ప్రాథమిక పాఠశాలలో దిశ ఫౌండేషన్ వారు నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిక కావడం జరిగింది. ఇందులో పనిచేసే ఉపాధ్యాయురాలు దిశ ఫౌండేషన్ వారిచే శిక్షణ పొంది వారిచ్చిన మెటీరియల్ సహాయంతో బోధించడం ప్రారంభించారు. పిల్లలు చాలా ఉత్సాహంగా పాల్గొంటూ ఆడుతూ పాడుతూ ఇంగ్లీష్ నేర్చుకోవడం లో చాలా క్రియాశీలకంగా పాల్గొన్నారు. అతి తక్కువ కాలంలోనే ఒకటవ తరగతి చదివే పిల్లలు కూడా ఇంగ్లీష్ మాట్లాడేందుకు ప్రయత్నిస్తున్నారు. పిల్లల్లో ఇంగ్లీష్ మాట్లాడే స్పృహ కల్పించిన దిశ ఫౌండేషన్ విజయం సాధించిందని చెప్పుకోవచ్చు. అదే విధంగా ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరగడానికి కూడా ఈ దిశా ఫౌండేషన్ దోహదం చేసింది అనడంలో అతిశయోక్తి లేదని చెప్పవచ్చు. దిశ ఫౌండేషన్ వారి ఈ కార్యక్రమం అతి తక్కువ కాలంలోనే సత్ఫలితాలు ఇచ్చినందున ఈ సంవత్సరం కూడా కొనసాగిస్తూ రెండవ విడతలో మరో 52 పాఠశాలలను ఎంపిక చేసుకొని ఆ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం రూపొందించడం జరిగింది. ఈ రెండవ విడత ప్రారంభ కార్యక్రమాన్ని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈ నెల 9వ తేదీన జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసి ప్రారంభిస్తారని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తెలిపారు.

# మహానేత వైఎస్సార్





**ములుగు, జూలై 8 (మనం ప్రతినిధి)ః** మంగళవారం ములుగు జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి డా,, వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి 76వ జయంతి సందర్భముగా తెలంగాణ రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి మరియు మహిళా శిశు సంక్షేమ శాఖా మాత్యులు దనసరి అనసూయ సీతక్క వై.ఎస్.ఆర్. చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాలులు అర్పించారు.ఈ సందర్భముగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మహానేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.ఆర్ రాష్ట్ర సీఎంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చేసిన సేవలు అమోఘం అని అన్నారు. ఆయన సీఎంగా ఉన్న రోజులు ఆయన రూపొందించిన పథకాలు దేశానికే దిక్సూచీల మారాయని, ముఖ్యంగా రైతులకు ఉచిత విద్యుత్ పథకం, రైతులకు ఏక కాలంలో పంట రుణమాఫీ, 104, 108 అత్యవసర వైద్య సేవలు, ఆరోగ్య శ్రీ, విద్యార్థులకు ఫీజ్ రీ-ఇంబార్సుమెంట్ పథకం ద్వారా పేదలకు ఉన్నత విద్యను అందించడం, అర్హత కలిగిన ప్రతి వారికి ఇందిరమ్మ ఇండ్లు పథకం, ఇందిర జల ప్రభ ద్వారా పేదలకు బోర్లు వేయించడం లాంటి అత్యున్నత పథకాలతో దేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆత్మ గౌరవాన్ని పెంచి, దేశం మొత్తం గర్వించదగ్గ నాయకుడిగా మన్ననలు పొందాడని కొనియాడారు. ఆయన వ్యూహాత్మకంగా, ప్రతిష్టాత్మకంగా, ప్రణాళిక బద్దంగా చేసిన ప్రతి ఒక్క పథకం విజయవంతం అయి పేదల పాలిట పెన్నిధి వై.ఎస్.ఆర్. అయ్యారని అన్నారు. ఇవ్వాళ మహానేత వై.ఎస్.ఆర్. 76వ జయంతి సందర్భముగా వారికి మా ఘన నివాళులు అర్పిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి తో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా బ్లాక్ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైతంగాన్ని కంటికి రెప్పలగా కాపాడింది కేసీఆర్

- **మాజీ శాసనసభ్యుడు కోరుకంటి చందర్**



**గోదావరిఖని, జూలై 08 (మనం న్యూస్)ః** తెలంగాణ రైతంగాన్ని కంటికి రెప్పలగా కాపాడింది తొలి సిఎం కేసీఆర్ అని, వారి పాలనలో తెలంగాణ రైతులంతా రాజులుగా బతికారన్నారని రామగుండం మాజీ శాసనసభ్యుడు కోరుకంటి చందర్ అన్నారు. రైతులకు ఎవరు ఏం చేశారో చర్చిద్దామన్న రేవంత్ ఛాలెంజ్ను స్వీకరించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైదరాబాదు సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో చర్చ చేద్దామన్నా నేపథ్యంలో మంగళవారం హైదరాబాదులో తొలి సిఎం కేసీఆర్ ను రామగుండం మాజీ శాసనసభ్యుడు పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్ కలిసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అన్నదాతలకు అండగా నిలిచింది కేసీఆర్ మాత్రమే అన్నారు. రేవంత్ పాలనలో రైతులకు చేసింది ఏమి లేదన్నారు. యావత్తూ తెలంగాణ ప్రజలంతా కేసీఆర్ పాలనను తిరిగి కోరుకుంటున్నారన్నారు.

# ఎరువులకు కూడా కరువేనా ఈ ప్రభుత్వంలో ?

- **రైతు గోస పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం**
- **రైతులకు ఇచ్చిన హామీల అమలులో పూర్తి వైఫల్యం**
- **జిల్లా పరిషత్ తొలి చైర్ పర్సన్ దావ వసంత సురేష్**



**జగిత్యాల, జులై 08 ( మనం ప్రతినిధి)ః** కాంగ్రెస్ పాలనలో ఎరువులకు కూడా కరువు ఉండడం విచారకరం అని జిల్లా పరిషత్ తొలి చైర్ పర్సన్ దావ వసంత సురేష్ అన్నారు. జిల్లాలో రైతులు ఎదురుకుంటున్న యూరియా సమస్య కొరత తీర్చాలని, పెంచిన యూరియా బస్తా ధర తగ్గించాలని కోరుతూ బిఆర్ఎస్ పార్టీ జెడ్పి తొలి చైర్ పర్సన్ దావ వసంత సురేష్ ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రం లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రైతుల దుస్థితి అధ్వణంగా మారిందని అవేదన వ్యక్తం చేశారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం, కేసీఆర్ పాలన రైతు పక్షపాతి గా ఉంటే అందుకు భిన్నంగా రేవంత్ రెడ్డి పాలన రైతులపై కక్ష్య పూరితంగా వ్యవహరిస్తుంది అన్నట్లుగా పాలన సాగుతుందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం చేసి బీడు వారిన నేలలను సిరుల మాగానిగా మార్చారని అలాంటి కాళేశ్వరం పైన అసత్య ప్రచారం చేస్తూ ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పబ్బం గడుపు కుంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయానికి ఎరువులు, సాగు నీరు, 24 గంటల ఉచిత కరెంట్, రైతు భరోసా, రుణమాఫీ, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుకు కష్టం రాకుండా చూసి రైతుల కన్నీరు తుడిచిన రైతు బాంధవుడు కేసీఆర్ అని కొనియాడారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రుణమాఫీ పూర్తి చేయకుండా, భరోసా రెండు పంటలకు ఎగగొట్టి, సకాలంలో యూరియా అందించకుండా రైతులను అరిగోస పెడుతుందన్నారు. కాంగ్రెస్ అంటేనే కరువు అనే మాటను నిజం చేస్తూ, ఆఖరికి ఎరువుల కరువు కు కూడా కాంగ్రెస్ కేరాఫ్ గా నిలిచిందని ఏద్దేవా చేశారు. గత ప్రభుత్వం లో రైతుల కళ్ళలో ఉన్న ఆనందం, నేడు ఈ ప్రభుత్వం పాలనలో కన్నీళ్లను మిగిలిస్తుందని ఆరోపించారు .కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 2 లక్షల కోట్లు అప్పు చేసింది,అంటే నెలకి 10 వేల కోట్ల చేసి ఒక్క ప్రాజెక్ట్ కట్టలే ఒక్క కొత్త పథకం అమలు చేయలేదు. రైతు కంట తడి పెట్టించినా ప్రభుత్వం మనుగడ సాధించలేదని మండి పడ్డారు. ఇప్పటికైనా రాష్ట్రం ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం ఆదుకోవాలని, ఎరువుల ధరలు తగ్గించాలని, రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల నియోజకవర్గ మండల అధ్యక్షులు ఆనంద్ రావు, తుమ్మ గంగాధర్ , ఏలేటి అనిల్ , బర్కం మల్లేష్, తెలు రాజు , మాజీ సర్పంచ్ లు బుర్ర ప్రవీణ్, నడేం శంకర్, గంగాధర్, సీనియర్ నాయకులు సాగి సత్యం రావు, శీలం ప్రవీణ్, శ్రీధర్ రెడ్డి, గంగారెడ్డి , ప్రశాంత్ రావు , ముత్తయ్య హరీష్ ,సన్నిత్ రావు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాలలో రాణించాలి

## ఎంపీడీవో పరిమి. విజయ



**మరిపెడ, జూలై 08(మనం న్యూస్):** పురుషులతో సమానంగా స్త్రీలు అన్ని రంగాలలో సాంఘికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని మరిపెడ ఎంపీడీవో పరిమి. విజయ అన్నారు. మంగళవారం మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని సమైక్య భవనంలో ఏపీఎం రాములు ఆధ్వర్యంలో శ్రీ దుర్గా మండల సమైక్య ఇందిరా మహిళా శక్తి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు గతంలో సాధించిన విజయాల కన్నా ఈ సంవత్సరం విజయాలు అధికంగా సాధించాలని ఆకాంక్షించారు. మహిళా సంఘాలలో లేని వారిని గుర్తించి సంఘంలో చేర్చుకోవాలని అన్నారు. గ్రామాలలో తోపాటు గిరిజన తండాలలోని వృద్ధులు, వికలాంగులు, కిషోర్ బాలికలకు వేరువేరుగా సంఘాలు ఏర్పాటు చేయాలన్నారు. గతంలో అత్యధికంగా విజయాలు సాధించిన మహిళలను గౌరవించి, సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల సమైక్య ఓబి సభ్యులు, సీసీలు, గ్రామ సంఘం సభ్యులు, రి.చ్.ౕ. లు, మండల సమైక్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి

**జగిత్యాల / వెల్గటూర్ జూలై 8 ( మనం ప్రతినిధి)ః** జగిత్యాల జిల్లా లోని వెల్గటూర్ మండలంలోని స్తంభంపల్లి కిషన్ రావుపేట్ నూతనంగా నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం పనులను మంగళవారం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేషనల్ హెల్త్ మిషన్ రూ. 20 లక్షల నిధులతో ఆయుష్మాన్ ఆరోగ్యం మందిరం భవన నిర్మాణ పనులను పరిశీలించి చిన్న చిన్న పెండింగ్ పనులు ఉన్నట్లయితే వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ప్లంబింగ్, వాటర్ ట్యాబ్, డోర్స్,వాష్ రూమ్ పెండింగ్ ఉన్నట్లయితే పూర్తి చేసుకోవాలని వారం రోజుల లోపు ఓపెనింగ్ చేయడం కొరకు పూర్తి ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట జగిత్యాల రెవెన్యూ డివిజనల్ అధికారి మధుసూదన్ ఈ పి ఆర్ ఓ లక్ష్మణరావు డిప్యూటీ డిఎంహెచ్ఓ శ్రీనివాస్ పిడి హౌసింగ్ ప్రసాద్ తహసిల్దార్ శేఖర్ ఎంపీడీవో శ్రీనివాస్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వన సంరక్షణ సమితి ఏర్పాటుపై రైతులకు అవగాహన



- **జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**

**ఏటూరునాగారం,జులై 8, (మనం న్యూస్)ః** మంగళవారం జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్. అదనపు కలెక్టర్ రెవిన్యూ సి.హెచ్. మహేందర్ జి తో కలిసి ఎక్కెల గ్రామంలో ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోదావరి నది ప్రవాహ ప్రాంతం భూటారం ముంపు ప్రాంత గ్రామస్తులకు నివాస స్థలం కేటాయించుటకు స్థల పరిశీలన చేసి పూర్తి నివేదిక సమర్పించాలని సంబంధిత తహసిల్దార్ ను ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలో ఫారెస్ట్ గెస్ట్ హౌస్ సమీపన ఉన్న ఫారెస్ట్ నర్సరీ ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఏటూరు నాగారంలో వెజ్ నాన్వెజ్ మార్కెట్ ఏర్పాటు కొరకు ల్యాండ్ సర్వే చేసి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్, డి ఎఫ్ ఓ రాహూల్ కిషన్ జాదవ్ తో కలిసి చిన్నబోయినపల్లి సర్వే నెంబర్.98 అటవీ భూ సాగుదారులకు ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టాలు ఇవ్వడానికి వీలు లేనందున అటవి సంరక్షణ సమితి ఏర్పాటు వలన కలుగు లాభాలను 70 మంది రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జగదీశ్వర్, ఎం పి ఓ, ఆర్ ఐ, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి సంఘాలపై జిల్లా కలెక్టర్ కు ట్రస్మా ఫిర్యాదు



**మంచిర్యాల,జూలై 8( మనం న్యూస్)ః** విద్యారంగ సమస్యలపై విద్యార్థి సంఘాల పేరుతో కొంతమంది పలు పాఠశాలలను బెదిరింపులకు గురిచేసి, డబ్బులు ఇవ్వాలని పాఠశాల యాజమాన్యాలను బ్లాక్మెయిల్ చేస్తున్నారని ట్రస్మా జిల్లా అధ్యక్షుడు దామెర్ల సిద్దయ్య అన్నారు. మంచిర్యాల జిల్లాలో విద్యార్థి సంఘ నాయకులుగా చెలామణి అవుతూ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యా లను భయభ్రాంతులకు గురి చేస్తున్నారనీ జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ను మంగళవారం కలసి ఫిర్యాదు చేశారు, ఈ మేరకు వినతి పత్రం ఇచ్చారు . ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ముఖ్యంగా మంచిర్యాల జిల్లాలో రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా విద్యార్థి సంఘాలు, కుల సంఘాలు ఉన్నాయ ని, విద్యార్థి సంఘాలు, కులసంఘాలు పాఠశాలలో బుక్స్, యూనిఫామ్స్ అమ్ముతు న్నారని మా ప్రైవేట్ పాఠశాలలపై అధికారులకు ఫిర్యాదు చేయడమే కాకుండా స్వయంగా వారే తనిఖీ చేస్తామని పాఠశాల సమయంలో పాఠశాల ఆవరణలోకి వచ్చి పాఠశాలను సజావుగా నడుప కుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు.తాము రాష్ట్ర ప్రభుత్వం ద్వారా విద్యాశాఖ ఇచ్చిన గుర్తింపు ప్రకారం పాఠశాలను నడుపు తున్నామని , కానీ చాలామంది ఎలాంటి గుర్తింపు లేకుండా ఏ యూనివర్సిటీలో చదవకుండా కొంత మంది, ఉద్యోగాలు చేస్తూ కొంతమంది, పెళ్ళి అయి వారి పిల్లలు ఏదో ఒక పాఠశాలలో లేదా కాలేజీలో చదివిస్తున్న వారు కొంతమంది విద్యార్థి సంఘ నాయకుడినని చెప్పుకొని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలను బెదిరిస్తూ బ్లాక్మెయిల్ చేస్తున్నారనీ అన్నారు. విద్యార్థి సంఘానికి నాయకుడిగా ఉండాలంటే వారు ఏదైనా యూనివర్సిటీలో(దూర విద్య కాకుండా) విద్యను అభ్యసిస్తూ ఉండాలనీ, కానీ తెలంగాణ రాష్ట్రంలో ఏ జిల్లాలో లేని విధంగా ఇలాంటి నకిలీ విద్యార్థి సంఘాలు వారు అడిగిన డబ్బులు ఇవ్వకపోతే ఆ పాఠశాలపై లేనిపోని అబద్ధపు ప్రచారం చేసి పాఠశాల ఆస్తులను ధ్వంసం చెస్తున్నారనీ అన్నారు. తెలంగాణా రాష్ట్రంలో ప్రైవేట్ హాస్పిటలలో వారి ఆస్తులను రక్షణకోసం, ఎవరైనా ధ్వంసం చేస్తే వారిపై చట్ట పరంగా చర్యలు తీసుకునే విధంగా ఏదైతే చట్టం ఉన్నదో, ఆ చట్టాని తమ ప్రైవేట్ పాఠశాలల కు కూడా వర్తించే విధంగా చూడాలని ప్రైవేటు పాఠశాలల సంఘం ట్రస్మ సభ్యులు కలెక్టర్ కు విన్నవించుకున్నారు. ఏ విద్యార్థి సంఘ నాయకుడికి కూడా పాఠశాల నడిచే సమయంలో ప్రవేశం లేదని, వారు పాఠశాల సమయంలో పాఠశాలకు వచ్చి ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలను బెదిరింపులకు గురిచేసిన, డబ్బుల కోసం బ్లాక్ మెయిల్ చేసినట్టు ఆధారాలు చూపిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారులు సంఘంలోని కొన్ని పాఠశాలలకు సమాచార చట్టం కింద నోటీసులు ఇస్తున్నారని, కానీ ప్రైవేట్ పాఠశాలలకు ఈ చట్టం వర్తించదని గతంలో పలుమార్లు జిల్లా విద్యాశాఖ అధికారికి వివరణ ఇచ్చినా కూడా మళ్ళీమళ్ళీ నోటీసులు ఇస్తున్నా రని ట్రస్మా జిల్లా కోశాధికారి ఉదారి చంద్రమోహన్ గౌడ్ తెలిపారు. సుమారు సుమారు 60 మంది ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు నేడు రామగుండం పోలీస్ కమిషనర్ ను కలిసి ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షులు దామెర్ల సిద్దయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగు శ్రీకాంత్ రెడ్డి, జిల్లా కోశాధికారి ఉదారి చంద్రమోహన్ గౌడ్, రాష్ట్ర నాయకులు రాపోలు విష్ణువర్ధన్ రావు, కస్తూరి పద్మ చరణ్, సురభి శరత్ కుమార్, అఖిలేందర్ సింగ్, గోపతి సత్తయ్య, మంచిర్యాల పట్టణ అధ్యక్షు లు కొమ్ము దుర్గాప్రసాద్, పట్టణ కోశాధికారి మోహన్ వర్మ, మందమరి పట్టణ అధ్యక్షు లు పెద్దపల్లి ఉప్పలయ్య, దండేపల్లి మండల అధ్యక్షుడు బొలిశెట్టి లక్ష్మీనారాయణ, బెల్లంపల్లి మండల అధ్యక్షులు రాజలింగు, పోలు శ్రీనివాస్, కరుణాకర్ రెడ్డి సిహెచ్ విక్రమ్ రావు, వసీం, పెంచాల శ్రీధర్, కృష్ణమూర్తి, శేషు, తదితరులు సుమారు జిల్లావ్యాప్తంగా 60 మంది కరస్పాండెంట్ లు పాల్గొన్నారు.

# ఇసుక లారీ కాంట్రాక్టర్లు పార్కింగ్ నిబంధనను పాటించాలి

- **ఏ ఎస్ పి శివం ఉపాధ్యాయ**



**ఏటూరు నాగారం, జూలై 8 (మనం ప్రతినిధి)ః** ఇసుక లారీలు సరైన పార్కింగ్ ప్రదేశాలలో నిలిపి నిబంధనలు పాటించాలని ఏ ఎస్ పి శివం ఉపాధ్యాయ అన్నారు. మల్లూరు ఇసుక క్వారీ కాంట్రాక్టర్లు, పోలీసులతో తన కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా పరిమితికి మించి లారీలను ఆన్లైన్లో నమోదు చేయరాదని, రోడ్లపై లారీలను నిలప రాదని, నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. లారీలను నిలుపుటకు సరైన పార్కింగ్ ప్రదేశాలను చూసుకోవాలని కాంట్రాక్టర్లకు సూచించారు.

# ప్రపంచానికి చక్రవర్తి అవసరం లేదు..

## ట్రంప్‌నకు బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డిసిల్వా కౌంటర్



బ్రెసిలియా, జూలై 8: అమెరికా విధానాలకు వ్యతిరేకంగా వ్యవహరించే బ్రిక్స్ అనుకూల దేశాలపై అదనంగా 10 శాతం సుంకం విధిస్తానంటూ ఆ దేశాధ్యక్షుడు డొనాల్ ట్రంప్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఈ బెదిరింపులపై తాజాగా బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డిసిల్వా స్పందిస్తూ.. ట్రంప్‌నకు గట్టి కౌంటర్ ఇచ్చారు. ప్రపంచం ఇంతకుముందులా లేదని.. కాబట్టి చక్రవర్తి అవసరం లేదని వ్యాఖ్యానించారు.

బ్రెజిల్‌లో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం ముగింపు కార్యక్రమంలో లూలా మాట్లాడుతూ.. 'ప్రపంచం మునుపటిలా లేదు మారిపోయింది. కాబట్టి మనకు చక్రవర్తి అవసరం లేదు. మన దేశాలు సార్వభౌమాధికారాన్ని కలిగిఉన్నాయి. ట్రంప్ సుంకాలను జారీ చేస్తే.. ఇతర దేశాలకు అదే చేసే హక్కు ఉంది. అగ్రరాజ్యానికి అధ్యక్షుడైన ఆయన సుంకాల గురించి సోషల్ మీడియాలో ప్రపంచాన్ని బెదిరించడం బాధ్యతారాహిత్యంగా భావిస్తున్నా. ఇలాంటి అంశాలపై ఇతర దేశాలతో మాట్లాడేందుకు చాలా వేదికలు ఉన్నాయి' అని పేర్కొన్నారు. ఒకరిని ఎదుర్కోవడం కోసం బ్రిక్స్ ఎవరికీ హాని చేయదని, కానీ రాజకీయాలు చేసేందుకు మరో ఉదాహరణ ఉండాలని మాత్రమే ఈ కూటమి కోరుకుంటోందని లూలా వ్యాఖ్యానించారు.

బ్రిక్స్ సదస్సు జరుగుతున్న వేళ ట్రంప్ తన ట్రూత్ సోషల్లో ఒక పోస్టు పెట్టారు. అందులో 'బ్రిక్స్ అమెరికా వ్యతిరేక విధానాలకు మద్దతిచ్చే ఏ దేశానికైనా అదనంగా 10 శాతం టారిఫ్లు విధిస్తాం. ఇందులో ఎలాంటి మినహాయింపులు ఉండవు' అని పేర్కొన్నారు. ట్రంప్ హెచ్చరికలపై చైనా ఆచితూచి స్పందించింది. బ్రిక్స్ ఘర్షణను కోరుకునే కూటమి కాదని ఆ దేశ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ స్పష్టం చేశారు. ఏ ఒక్క దేశాన్నీ అది లక్ష్యంగా చేసుకోదన్నారు. ఈ క్రమంలో ట్రంప్ వ్యాఖ్యలపై వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన లీవిట్ మాట్లాడుతూ.. బ్రిక్స్ సదస్సును ట్రంప్ నిశితంగా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. అందులోని దేశాలు బలపడుతున్నాయని ఆయన అనుకోవడం లేదన్నారు. కానీ అమెరికా ప్రయోజనాలను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని ట్రంప్ భావిస్తున్నారన్నారు.

---

# విమాన ప్రమాదం..

## కేంద్రానికి ప్రాథమిక నివేదిక



ఢిల్లీ, జూలై 8: అహ్మదాబాద్‌లో చోటుచేసుకున్న దిగ్భ్రాంతికర విమాన ప్రమాద ఘటనపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్‌పై ఇన్వెస్టిగేషన్ బ్యూరో దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ప్రమాదంపై ఇప్పటివరకు జరిపిన విశ్లేషణ, దర్యాప్తు ఆధారంగా ఏఏఐబీ ప్రాథమిక నివేదిక రూపొందించింది. దాన్ని మంగళవారం కేంద్ర పౌరవిమాన మంత్రిత్వశాఖతో పాటు సంబంధిత ఇతర అధికారులకు సమర్పించినట్లు ప్రభుత్వ ఉన్నతస్థాయి వర్గాలు వెల్లడించాయి.

ప్రస్తుతానికి ఈ నివేదికను అధికారులు బయటపెట్టలేదు. ఈ వారాంతంలో విడుదల చేసే అవకాశమున్నట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి. విమాన డేటా, చివరి నిమిషంలో సిబ్బంది చర్యలు, వాతావరణ పరిస్థితులు తదితర అంశాలతో ఈ ప్రాథమిక నివేదిక రూపొందించినట్లు తెలుస్తోంది. ఈ నివేదికతో ప్రమాదానికి గల కారణాలపై ఓ కొలిక్కి వచ్చే అవకాశాలు కన్పిస్తున్నాయి.

జూన్ 12న ఈ దుర్ఘటన చోటుచేసుకోగా.. ఆ మరుసటిరోజే ప్రమాదంపై దర్యాప్తునకు ఏఏఐబీ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. దీనికి ఏఏఐబీ డైరెక్టర్ జనరల్ జీవీజీ యుగంధర్ నేతృత్వం వహిస్తుండగా.. ఏవియేషన్ మెడిసిన్, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ నిపుణులు, నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డు నిపుణులు సభ్యులుగా ఉన్నారు. ప్రమాదానికి గురైన విమానం నుంచి సేకరించిన బ్లాక్ బాక్స్‌లను ఏఏఐబీ ల్యాబ్‌కు తరలించారు. అందులోని డేటాను విజయవంతంగా డౌన్‌లోడ్ చేసి ప్రమాదానికి గల కారణాలను విశ్లేషిస్తున్నారు.

---

### రాజులా.. రాజకీయనాయకులా?:

# మద్రాస్ హైకోర్టు




చెన్నై, జూలై 8: అనుచిత వ్యాఖ్యలతో వివాదంలో చిక్కుకున్న డీఎంకే నేత, మాజీ మంత్రి పొన్ముడిపై మద్రాస్ హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. తమిళనాడు పోలీసులు ఆయనపై సరైన రీతిలో చర్యలు తీసుకోకపోతే సీబీఐ విచారణకు ఆదేశిస్తామని హెచ్చరించింది. ఈ కేసులో మంగళవారం విచారణ జరిగింది.

'ఆర్టికల్ 19ను ఆసరాగా చేసుకొని రాజకీయ నాయకులు ఆకాశమే హద్దుగా నోరుపారేసుకుంటున్నారు. ఈ సమాజంలో ఎన్నో వర్గాలతో మనం కలిసి జీవిస్తున్నాం. దేశం రాజకీయ నేతలది మాత్రమే కాదు. వారు మనుషుల మధ్య జీవిస్తున్నట్టు గుర్తుంచుకోవాలి. ప్రతి ఒక్కరు మైక్ తీసుకొని, రాజుల్లా మాట్లాడుతున్నారు. ఇలాంటి అంశాలపై మేం చూస్తూ ఉండలేం' అని కోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. తదుపరి విచారణను ఆగస్టు ఒకటికి వాయిదా వేసింది. గతంలో చెన్నైలో ఓ కార్యక్రమంలో పొన్ముడి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. సెక్స్ వర్కర్, కస్టమర్ మధ్య సంభాషణ ఇలా ఉందంటూ.. అసభ్యకర పదజాలాన్ని ఉపయోగిస్తూ మాట్లాడిన వీడియో వైరల్ అయ్యింది. మంత్రి మాట్లాడిన తీరు మహిళలను కించపర్చేలా ఉందంటూ ఆయనపై సామాజిక మాధ్యమాల్లో తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. డీఎంకే ఎంపీ కనిమొళి, గాయని చిన్మయి, నటి ఖుష్బూతోపాటు పలువురు ప్రముఖులు ఆయన తీరును ఖండించారు. మరోవైపు డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ ఆయనను పార్టీ ఉప ప్రధాన కార్యదర్శి పదవి నుంచి తొలగించారు.

---

# ఉద్యోగాల్లో మహిళలకు 35 శాతం రిజర్వేషన్

- నీతీశ్ ఎన్నికల వ్యూహం



పాట్నా, జూలై 8: బిహార్ అసెంబ్లీ ఎన్నికలు ఈ ఏడాది చివర్లో జరగనున్నాయి. ఈనేపథ్యంలో రాజకీయ పార్టీలు తమ వ్యూహాలకు పదునుపెడుతున్నాయి. ప్రజాకర్షక నిర్ణయాలు ప్రకటించడంలో పోటీ పడుతున్నాయి. తాజాగా బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ అలాంటి ప్రకటనే చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 35 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చారు.

బిహార్‌లో శాశ్వత నివాసితులుగా ఉన్న మహిళలకు ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో భాగంగా ప్రతి విభాగంలోని అన్ని పోస్టులకు ఆ ప్రత్యేక రిజర్వేషన్ వర్తిస్తుందని సీఎం చెప్పారు. దీనివల్ల ప్రభుత్వ సర్వీసుల్లో స్త్రీల ప్రాతినిధ్యాన్ని పెంచడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. పట్నాలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. మహిళా ఓటర్ల కోసం రిజర్వేషన్ ప్రకటించగా.. యువత కోసం బిహార్ యూత్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. దీనికింద యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, శిక్షణ ఇస్తామని వెల్లడించారు. వారి సంక్షేమం,ఉన్నతికి సంబంధించిన అంశాలపై కమిషన్ సలహాలు ఇవ్వొచ్చు. అలాగే మెరుగైన విద్య, ఉపాధి అవకాశాల విషయంలో ప్రభుత్వ విభాగాలతో సమన్వయం చేసుకోనుంది.

ఇదిలాఉంటే.. బిహార్ అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో అధికార పక్షమైన ఎన్డీయే, ప్రతిపక్ష మహాగట్ బంధన్ సీట్ల పంపిణీకి సిద్ధమవుతున్నాయి. ఈమేరకు మిత్రపక్షాల మధ్య చర్చలు జరుగుతున్నాయి. ప్రధాన కూటముల్లోనూ అంతర్గత విభేదాలను అధిగమించడానికి గతేడాది లోక్‌సభ ఎన్నికల ప్రాతిపాదికన సీట్ల పంపకం చేసుకోవాలని నిర్ణయించుకున్నాయి. మరోవైపు.. విపక్ష కూటమి మహాగట్ బంధన్ సీట్ల పంపిణీపై ఇప్పటికే పలు సమావేశాలు నిర్వహించింది. దీనికి అన్ని పార్టీల ముఖ్య నేతలు హాజరయ్యారు. కొన్ని పార్టీలు తమకు ఎక్కువ సీట్లు కావాలని డిమాండ్ చేస్తున్నాయి. అన్ని పార్టీలు తాము పోటీ చేయాలనుకొంటున్న సీట్ల జాబితా ఇవ్వాలని ఆర్జేడీ నాయకుడు తేజస్వీయాదవ్ మిత్రపక్షాలను కోరారు. ఈ ఏడాది అక్టోబర్, నవంబర్ నెలల్లో బిహార్ అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది.

---

# వజ్రాల నగరాన్ని ఇసుక మింగేసింది!



రియో డి జనీరో, జూలై 8: విదేశీ పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ జులై 9న (బుధవారం) నమీబియా వెళ్లనున్నారు. అక్కడి పార్లమెంట్లో ప్రసంగించనున్నారు. ఈ నేపథ్యంలో అసలు నమీబియా దేశ విశిష్టత, అక్కడి చరిత్రాత్మక స్థలాల తదితర అంశాలు వార్తల్లోకి వస్తున్నాయి. ఆ కోవకు చెందినదే 'కాల్మనోస్కోప్'. ఒకప్పుడు సకల సౌభాగ్యాలతో అలరారిన ఈ నగరం ఇప్పుడు కాలగర్భంలో కలసిపోయింది. వజ్రాల గనులకు నిలయమైన ఆ నగరాన్ని ఇసుక మింగేసింది!

కాల్మనోస్కోప్.. నమీబ్ ఎడారిలో నిర్మితమైన ఓ అందమైన నగరం. ఒకప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద నగరాల్లో ఒకటి. 1900 ప్రారంభంలో అక్కడ పెద్దమొత్తంలో వజ్రాలు దొరికేవి. దీంతో జర్మనీ తదితర దేశాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు, వర్తకులు ఇక్కడికి వచ్చి స్థిరపడ్డారు. ఎడారి ప్రాంతమైనప్పటికీ.. అద్భుతమైన నీటి వసతులు కల్పించుకొని, పెద్ద పెద్ద భవంతులు నిర్మించారు. విద్యుత్, ఆస్పత్రులు, పార్కులు, థియేటర్లు ఇలా ఒకటేమిటి సకల సౌకర్యాలతో ఆ ఎడారి ప్రాంతం ఓ అందమైన నగరంగా రూపుదిద్దుకుంది. ఒకానొక సమయంలో 'కాల్మనోస్కోప్' విలాసాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయింది. జర్మన్ శిల్పకళాకృతులు ఉట్టిపడేలా నిర్మించిన కట్టడాలు అక్కడికి వెళ్లేవారిని మంత్రముగ్ధుల్ని చేసేవి. అక్కడి ప్రజలు విలాసవంతమైన జీవనం గడిపేవారు. ఎడారిలో నిక్షిప్తమై ఉన్న వజ్రాలను వెలికి తీసి, వాటి ద్వారా వచ్చే డబ్బుతో సకల సౌకర్యాలు అనుభవించేవారు. ఒక దశలో ఆ నగరం ఎడారి భూమిలో మెరిసే రత్నంలా వెలుగొందింది.

### మసకబారిన అందాలు

కాల్మనోస్కోప్ అందాలు ఎంతోకాలం కొనసాగలేదు. ఎంత పెద్ద గని అయినా.. తవ్వుతూ ఉంటే తరిగిపోక మానదు కదా. క్రమంగా ఆ ప్రాంతంలో వజ్రాల ఆచూకీ కనుమరుగైంది. దక్షిణాది ప్రాంతాల్లో ఎక్కువగా వజ్రాలు దొరుకుతున్నట్లు గుర్తించిన జర్మన్లు అటువైపు నడక ప్రారంభించారు. కాల్మనోస్కోప్‌తో పోల్చుకుంటే దక్షిణాదిలో గనుల నుంచి వజ్రాలను వెలికి తీయడం సులభమని గ్రహించి.. కుటుంబాలతో సహా పెట్టేబేడా సర్దుకొని వలస వెళ్లడం ప్రారంభించారు. 1950 నాటికి చాలా మంది ఈ నగరాన్ని ఖాళీ చేసేశారు. దీంతో సందడి సందడిగా ఉన్న నగరం బోసిపోయింది. విద్యుత్ వెలుగుల్లో కాంతులీనిన నగరం మసకబారింది.

### ఇసుక మింగేసింది..

అక్కడున్న వారంతా వెళ్లిపోవడంతో కాల్మనోస్కోప్ ఓ దెయ్యాల నగరంలా మిగిలిపోయింది. ఒకప్పుడు ఎడారిని చదును చేసి నిర్మించిన నగరాన్ని.. మళ్లీ అదే ఎడారి మింగేసింది. అప్పుడప్పుడూ వచ్చిన ఇసుక తుఫాన్లు, భీకర గాలులకు అక్కడి ఇళ్లు, ఆస్పత్రులు, ఇతర భవనాల్లో పెద్ద మొత్తంలో ఇసుక పేరుకుపోయింది. ఒకప్పటి థియేటర్లు, భోజనశాలలు, పార్కుల్లో ఇసుక దిబ్బలు దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం చరిత్ర కారులకు, ఫొటోగ్రాఫర్లకు ఈ నగరం ఇష్టమైన ప్రదేశంగా మారింది. సాహసయాత్రలు చేసేవారు అక్కడికి వెళ్లి.. దృశ్యాలను చిత్రీకరిస్తుంటారు. ఇది కేవలం ఓ శిథిలమైన నగరం మాత్రమే కాదు.. ప్రకృతికి విరుద్ధంగా ఏం చేసినా.. కొంతకాలానికి తిరిగి పొందే శక్తి దానికి ఉంటుందని చెప్పడానికి ఓ నిదర్శనం.

---

# శుభాంశుకు హాయ్ చెప్పిన ఢిల్లీ వాసులు..!

## మన గగనతలంపై ఐఎస్ఎస్



ఢిల్లీ, జూలై 8: భారత అంతరిక్ష రంగంలో కొత్త అధ్యాయాన్ని లిఖిస్తూ మన వ్యోమగామి శుభాంశు శుక్లా ఇటీవలే అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి వెళ్లిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఐఎస్ఎస్ పరిశోధనల్లో నిమగ్నమై ఉన్న ఆయనకు ఢిల్లీ ప్రజలు హాయ్ చెప్పారు. అదెలా అనుకుంటున్నారా..? కొన్ని వందల కిలోమీటర్ల ఎత్తులో తిరిగే ఈ ఐఎస్ఎస్ తాజాగా దేశ రాజధాని వాసులను కనువిందు చేసింది. సోమవారం అర్ధరాత్రి తర్వాత నిశీధిలో మిలమిలా మెరుస్తూ ఢిల్లీ గగనతలంపై కన్పించింది.

ఈ అరుదైన దృశ్యాలను కెమెరాలో బంధించిన కొందరు.. మన వ్యోమగామి శుభాంశుకు 'హాయ్' అంటూ వాటిని నెట్టింట పంచుకున్నారు. ప్రస్తుతం ఆ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. రానున్న రోజుల్లోనూ పలుమార్లు ఇది భారత గగనతలం మీదుగా ప్రయాణిస్తుందని, అప్పుడు సాధారణ పౌరులకు కూడా కన్పించే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ఆకాశంలో మెరిసే వస్తువుల్లో మూడో అతిపెద్దది ఈ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రమే. ఇది మానవ నివాసయోగ్యమైన, మానవ నిర్మిత ఉపగ్రహం. భూమికి సగటున 400 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న దిగువ కక్ష్యలో పరిభ్రమిస్తుంది. ఇది భూమి చుట్టూ ఒకసారి తిరగడానికి 93 నిమిషాలు పడుతుంది. అంటే రోజుకు 15.5 సార్లు భూమిని చుట్టేస్తుంది. అమెరికా, రష్యా, జపాన్, ఐరోపా, కెనడా సంయుక్తంగా దీన్ని నిర్వహిస్తుంటాయి. అనేకమంది శాస్త్రవేత్తలు భూమి నుంచి వెళ్లి కొన్ని నెలల పాటు ఇందులో పరిశోధనలు సాగిస్తుంటారు. జూన్ 25న మన వ్యోమగామి శుభాంశు శుక్లా కూడా ఐఎస్ఎస్‌కు చేరుకున్నారు. గతంలోనూ పలుమార్లు భారత గగనతలంలో ఈ స్పేస్ స్టేషన్ కన్పించింది. సూర్యుడి కాంతి దీనిమీద ప్రతిబింబించినప్పుడు భూమిపై ఉన్న ప్రజలు దీన్ని చూసేందుకు వీలుంటుంది. సాధారణంగా చంద్రుడు కూడా మనకు ఇలాగే కన్పిస్తాడు. అయితే, జాబిల్లి అంత ప్రకాశవంతంగా ఉండకపోవడంతో పగటిపూట అంతరిక్ష కేంద్రాన్ని భూమిపై నుంచి మనం గుర్తించలేం. అదే రాత్రివేళల్లో అయితే మెరుస్తూ కన్పిస్తుందని గతంలో నాసా ఓసారి వెల్లడించింది.

---

# డీకే సీఎం కావడం ఖాయం

## మెజార్టీ ఎమ్మెల్యేల మద్దతు ఆయనకే : యోగేశ్వర్



బెంగళూరు, జూలై 8: కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు ఉండదని చెప్పినా ఉత్కంఠ కొనసాగుతోంది. ఐదేళ్లపాటు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని ఓ వైపు సిద్ధరామయ్య చెబుతున్నా.. అక్కడి పరిస్థితులు మాత్రం ప్రతికూలంగా కనిపిస్తున్నాయి. 'సీఎం పదవిని ఆశించడంలో తప్పులేదు కదా' అని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ బహిరంగంగా తన కోర్కెను వెల్లడించడంతో సీఎం మార్పు అంశం తార స్థాయికి వెళ్లింది. తాజాగా డీకేకు అనుకూలంగా ఎమ్మెల్యే సీపీ యోగేశ్వర్ కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీలోని మెజార్టీ ఎమ్మెల్యేల మద్దతు, ప్రజల మద్దతు ఆయనకే ఉందని చెప్పారు. 'చాలా మంది ఎమ్మెల్యేలు ఒకే మాటపై ఉన్నారు. డీకే శివకుమార్ ముఖ్యమంత్రి కావడం ఖాయం. ఇది కేవలం నా ఒక్కడి అభిప్రాయం మాత్రమే కాదు. పలువురు ఎమ్మెల్యేలు, ప్రజలు ఇదే కోరుకుంటున్నారు.' అని మంగళవారం యోగేశ్వర్ అన్నారు. అయితే, నిర్ణయం మాత్రం అధిష్ఠానం చేతిలో ఉందని చెప్పారు. డీకేకు 100 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని మరో నేత చెప్పుకొచ్చారు. సీఎం మార్పు సిద్ధరామయ్య, డీకే శివకుమార్ వర్గాల మధ్య తీవ్ర అంశంగా మారిన నేపథ్యంలో కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ రణదీప్ సూర్జేవాలా ఇటీవల వారిద్దరితో సంప్రదింపులు జరిపిన సంగతి తెలిసిందే. అనంతరం రాష్ట్రంలో నాయకత్వ మార్పు లేదని ఆయన ప్రకటించారు. ఆ తర్వాత సోమవారం డీకే మాట్లాడుతూ.. సీఎం పదవిని ఆశించడంలో తప్పులేదు కదా.. అంటూ తన కోరికను పరోక్షంగా బయటపెట్టారు. ఈ తరుణంలో ఆయనకు మద్దతిస్తూ ఎమ్మెల్యేలు ప్రకటనలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే వీరిద్దరి మధ్య భేదాభిప్రాయాలు వచ్చాయి. దీని ప్రభావం ఎన్నికలపై పడుతుందని గ్రహించిన అధిష్ఠానం వీరి మధ్య ఓ ఒప్పందాన్ని కుదిరిచ్చినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. మొదటి రెండున్నరేళ్లపాటు సిద్ధరామయ్య సీఎంగా ఉంటారని, ఆ తర్వాతి రెండున్నరేళ్లు డీకేను ముఖ్యమంత్రి చేయాలని ఆ ఒప్పందం సారాంశం. ఆ గడువు సెప్టెంబరుతో ముగియనుంది. ఈ నేపథ్యంలోనే సీఎం మార్పు తెరపైకి రావడం గమనార్హం.

---

# జ్యోతి మల్హోత్రా పర్యటనపై ప్రభుత్వ పాత్రేమీ లేదు: కేరళ మంత్రి



తిరువనంతపురం, జూలై 8: పాకిస్థాన్ నిఘా సంస్థలకు భారత్‌కు చెందిన సున్నితమైన సమాచారాన్ని చేరవేస్తున్నారన్న ఆరోపణలపై యూ ట్యూబర్ జ్యోతి మల్హోత్రా అరెస్టయిన సంగతి తెలిసిందే. గతంలో కేరళ పర్యాటకాన్ని ప్రచారం చేసేందుకు ఆ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి పీఏ. మహమ్మద్ రియాస్ నేతృత్వంలోని టూరిజం డిపార్ట్‌మెంట్‌కు అమెకు స్పాన్సర్ చేసిందని తాజాగా పలు వార్తలు వచ్చాయి. తనపై వస్తున్న ఆరోపణలపై మహమ్మద్ రియాస్ స్పందించారు. గతంలో రాష్ట్రంలోని పర్యాటకాన్ని ప్రచారం చేసేందుకు నియమించిన ఓ ఏజెన్సీ టూరిజాన్ని ప్రమోట్ చేయడానికి దేశంలోని పలువురు యూ ట్యూబర్లను రాష్ట్రానికి ఆహ్వానించిందని తెలిపారు. ఆ విధంగా ఆహ్వానించిన ఇన్‌ఫ్లుయెన్సర్లలో జ్యోతి ఒకరని..ఆమెపై గూఢచర్య ఆరోపణలు రావడానికి చాలా కాలం ముందు ఇది జరిగిందని తెలిపారు. జ్యోతి మల్హోత్రా ఎంపిక వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వ పాత్రేమీ లేదని మహమ్మద్ రియాస్ స్పష్టం చేశారు. కాగా పాక్ గూఢచారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న జ్యోతి మల్హోత్రా కేరళ రాష్ట్ర ప్రభుత్వ ఆహ్వానం మేరకు గతంలో ఆ రాష్ట్రాన్ని సందర్శించారని పలువురు బీజేపీ నేతలు సోమవారం ఆరోపించారు. 'ఆమె ఎవరిని కలిసింది? ఎక్కడికి వెళ్లింది? అసలు ఆమె అజెండా ఏంటి? పాకిస్థాన్‌తో సంబంధాలు ఉన్న వ్యక్తికి కేరళలో రెడ్ కార్పెట్ ఎందుకు వేశారు?' అంటూ ప్రశ్నించారు. ట్రావెల్ బ్లాగర్, యూట్యూబర్ అయిన జ్యోతి మల్హోత్రా ట్రావెల్ విత్ జో పేరుతో ఓ యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తోంది. 2023లో పాకిస్థాన్‌కు వెళ్లిన సమయంలో ఆమె అక్కడి గూఢచర్య సంస్థ ప్రతినిధులతో టచ్‌లోకి వెళ్లినట్లు తెలిసింది. ఆపరేషన్ సిందూర్ సమయంలోనూ జ్యోతి..పాక్ అధికారులతో మాట్లాడినట్లు సమాచారం. దీంతో పోలీసులు ఆమెను అరెస్టు చేసి, ప్రశ్నిస్తున్నారు. అయితే ఆమె పూర్తి అవగాహనతోనే పాకిస్థానీ ఇంటెలిజెన్స్ అధికారులతో సంప్రదింపులు కొనసాగించినట్లు అధికారులు పేర్కొన్నారు.

---

# శ్రీ రాముడి జన్మస్థలం నేపాలే

- ప్రధాని కేపీ శర్మ ఓలి వివాదాస్పద వ్యాఖ్యలు




ఖాట్మండ్, జూలై 8: శ్రీ రాముడి జన్మస్థలంపై నేపాల్ ప్రధానమంత్రి కేపీ శర్మ ఓలి మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. రాముడు తమ దేశంలోనే జన్మించాడని ఆయన పేర్కొన్నారు. సోమవారం ఖాట్మండులో జరిగిన పార్టీ కార్యక్రమంలో ఓలి పాల్గొని ఈ వ్యాఖ్యలు చేశారు. శ్రీరాముడు నేపాల్లోనే జన్మించాడని ఓలి పునరుద్ఘాటించారు. వాల్మీకి రాసిన అసలైన రామాయణం ఆధారంగానే తాను ఈ మాట చెబుతున్నానని తెలిపారు. ఈవిషయం ప్రచారం చేయడానికి దేశ ప్రజలు ఏమాత్రం సంకోచించవద్దని పిలుపునిచ్చారు. రామ జన్మస్థలంపై ఎవరైనా వేరే కథలను ఎలా సృష్టించగలరని ప్రశ్నించారు. రాముడు పుట్టిన స్థలం నేపాల్లోనే ఉందని, అది ఇప్పటికీ అక్కడే ఉందన్నారు. దీన్ని తాము అంతగా ప్రచారం చేయలేకపోతున్నామని వ్యాఖ్యానించారు. అది కొందరిని బాధిస్తుందని తాను భావిస్తున్నానన్నారు. ఈసందర్భంగా ఆయన శివుడు, విశ్వామిత్రుడు కూడా తమ దేశంలోనే జన్మించారని పేర్కొన్నారు. ఇది తాను సొంతంగా చెబుతున్నది కాదని, వాల్మీకి రాసిన రామాయణంలోనే ఇది కూడా ఉందన్నారు. ఇక, గతంలోనూ ఓలి ఇలాంటి వివాదాస్పద ప్రకటనలే చేశారు. 2020లో అయోధ్య తమ దేశంలోని చిత్వాన్‌లోని థోరిలో ఉందని పేర్కొన్నారు. ఇక్కడే రాముడు పుట్టాడని ఆయన అన్నారు. అలాగే దశరథుడు పుత్రకామేష్ఠి యాగం చేసిన ప్రాంతం కూడా తమ దేశంలోనే ఉందన్నారు. అప్పట్లో ఓలి చేసిన ఈ వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈక్రమంలో నేపాల్ విదేశాంగ శాఖ ఓ ప్రకటనను విడుదల చేసింది. ఎవరి మనోభావాలు దెబ్బతీయడానికి ప్రధాని ఈ వ్యాఖ్యలు చేయలేదని స్పష్టం చేసింది. రాముడు జన్మస్థలంపై అనేక అభిప్రాయాలు ఉన్నాయని.. రామాయణంపై విస్తృతమైన సాంస్కృతిక, భౌగోళిక అధ్యయనం జరపాల్సిన అవసరం ఉందని మాత్రమే చెప్పారని తెలిపింది.

# రాజ్యాంగ రద్దుకు ఆర్ఎస్ఎస్ కుట్ర

- రాజ్యాంగ మూల స్తంభాలైన సోషలిస్టు సెక్యూలర్ పాదాలను తొలగిస్తే ఊరుకోం
- కేవీపీఎస్ పేట జిల్లా సమాలోచన సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శితప్పెట్ల స్కైలాబ్ బాబు




**సూర్యాపేట, జూలై 8(మనం ప్రతినిధి):** భారత రాజ్యాంగంలో సోషలిజం సెక్యులరిజం పదాలను తొలగించాలని ఆర్ఎస్ఎస్ నేత దత్తాత్రేయ హోసభలే వ్యాఖ్యానించడం దేశ ప్రజలందరినీ అవమానించినట్లేనని, సోషలిస్ట్ సెక్యులర్ పదాలను తొలగించాలని ప్రయత్నిస్తే ఊరుకోబోమనీ, రాజ్యాంగం రద్దుకు ఆర్ఎస్ఎస్ బిజెపి కుట్రలు చేస్తున్నాయని ఆ కుట్రలను నేటితరం ఐక్యంగా ప్రతిఘటించాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని స్టార్ బాంకెట్ హాల్‌లో కేవీపీఎస్ ఆధ్వర్యంలో రాజ్యాంగం - ఆర్ ఎస్ ఎస్ బీజేపీ వైఖరి₹పై సమాలోచన సమావేశం కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కోట గోపి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు మాట్లాడుతూ బీజేపీ పాలిత రాష్ట్రాలలో దళితులపై క్రూర దౌర్జన్యాలు, దాడులు పెరిగిపోతున్నాయని ఈ అమానవీయ సంఘటనలతో దేశం సిగ్గుతో తలదించుకుంటుందన్నారు. రాజ్యాంగంలో సెక్యులరిజం సోషలిజం అనే పదాలు తొలగించాలని వ్యాఖ్యానించడం రాజ్యాంగం రద్దు చేయడానికి చేస్తున్న కుట్రలలో అంతర్భాగమనిచెప్పారు. ఆర్ఎస్ఎస్ మూల సిద్ధాంతంలో భారత రాజ్యాంగం విదేశాల నుంచి దిగుమతి చేయబడిందని తమ ప్రాచీన భారత రాజ్యాంగం అంటే మనుస్మృతి చాతుర్వర్ణ వ్యవస్థ అని ఆర్ఎస్ఎస్ బిజెపి భావిస్తుందన్నారు. తద్వారా మనుషుల మధ్య అంతరాలు కులాల వారీగా హెచ్చుతగ్గులు మహిళల అణిచివేత వంటి అమానుష చర్యలు అమలు చేయాలనుకుంటుందన్నారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను లేకుండా చేసి మత రాజ్యాంగ మార్చాలని కుట్ర చేస్తుందన్నారు.సెక్యులరిజం, సోషలిజం అనే పదాలు రాజ్యాంగంలో అంతర్లీనంగా ఉన్నాయని చెప్పారు. భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 14 ప్రకారం చట్టం ముందు అందరూ సమానులేనని అర్థిక అంతరాలు తొలగించాలని ఉందని అదే సోషలిజం అని చెప్పారు. భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 25 ప్రకారంగా మతం వ్యక్తిగత విశ్వాసమని మతాన్ని దేవుడిని రాజకీయాల్లోకి లాగవద్దని అది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని చెప్పారు కానీ ఆర్ఎస్ఎస్ బిజెపి ప్రతిరోజు మత విద్వేషాలు రెచ్చగొడుతుందన్నారు. ఈ తరుణంలో సెక్యులర్, ప్రజాస్వామిక విలువలను కాపాడాలన్నారు. దేశ సమైక్యత సమగ్రతల కోసం నేటి యువతరం రాజ్యాంగ రక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాలన్నారు. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాలో ఇద్దరు దళిత యువకులు ఆవు దూడలను తీసుకెళ్తుండగా గోరక్షక దళాల ముసుగులో ఆర్ఎస్ఎస్ మతోన్మాద గో గుండాలు అమానవీయ చర్యలకు ఒడిగట్టారని అన్నారు. అరగుండు కొట్టించి బలవంతంగా మురుగునీటిలో ముంచి మోకాళ్లపై ఊరిలో నడిపించడం గడ్డి తినిపించడం వంటి చిత్రహింసల పాలు చేశారని చెప్పారు. గోరక్షక దళాలు రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహరిస్తున్నాయని చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటున్నాయని, గోరక్షక దళాలను తక్షణమే నిషేధించాలన్నారు. ఆ దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గోరక్షక దళాలు ఆర్ఎస్ఎస్ ప్రోత్బలంతోనే ఇలాంటి ఘాతుకాలకు పాల్పడుతున్నారన్నారు. 78 ఏళ్ల స్వాతంత్రం తర్వాత మధ్యయుగాల కాలంనాటి శిక్షలను ఇంకా ఈ దేశం భరించాలా? అని ప్రశ్నించారు.

దీనిని ప్రజలు ప్రజాస్వామిక వాదులు ముక్తకంఠంతో ఖండించాలన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో అట్టడుగు వర్గాలపై జరుగుతున్న ఈ అమానవీయ ఘటనలను అందరూ ఐక్యంగా ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు మౌలానా ముఫ్తీ అస్రార్ సాహెబ్, ప్రముఖ జర్నలిస్టు బంటు కృష్ణ, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు బోయిల్ల అఖిల్, బొల్లెద్దు వినయ్, సమత సైనిక్ దల్ మాజీ జిల్లా అధ్యక్షుడు చెవుల నాగరాజు, సీనియర్ దళిత నాయకులు కొండగడుపుల సూరయ్య, దుబ్బ రమేష్, కత్తి వెంకటేశ్వర్లు, జీఎంపీఎస్ జిల్లా గౌరవాధ్యక్షులు వీరబోయిన రవి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు దనియాకుల శ్రీకాంత్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు టేకుల సుధాకర్, పీఎన్ఎం జిల్లా సహాయ కార్యదర్శి నందిపాటి సతీష్, కేవీపీఎస్ జిల్లా నాయకులు తక్కెళ్ళపల్లి శ్యామ్, సుంచు నరసింహ, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.



# బీజేపీ పాలనలో వ్యవసాయం అన్ని రంగాల్లో అభివృద్ధి

మోడీ పాలనపై విమర్శలు మానుకోవాలి: అనంత్ గుర్వయ్య గౌడ్

**గరిడేపల్లి, జూలై 8(మనం న్యూస్):** కేంద్రంలో బీజేపీ పాలనలో వ్యవసాయం అభివృద్ధి చెందుతుందని, మోడీ పాలనపై కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు విమర్శలు మానుకోవాలని మండల వన్ నేషన్ వన్ ఎలక్షన్ కన్వీనర్ అనంతు గురవయ్య గౌడ్ కోరారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై మోడీ పాలనపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు నిందలు వేయడం సమంజసం కాదన్నారు. 11 సంవత్సరాలుగా కేంద్రంలో మోడీ పాలనలో వ్యవసాయ రంగం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందన్నారు.రైతుల అభివృద్ధి లక్ష్యంగా దేశ ప్రధాని మోదీ వ్యవసాయ రంగాన్ని అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నారని తెలిపారు.గతంలో యూరియా కోసం రైతులు ఎన్నో ఇబ్బందులు పడే వారిని తిండి నిద్రాహారాలు వదిలి ఎరువుల దుకాణాల వద్ద పడి కాపులు కాసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడి మోడీ పాలనలో యూరియాకు సబ్సిడీ ఇచ్చి రైతులని ఆదుకున్న విషయం వాస్తవం కాదా అన్నారు. కేవలం నిరాధారమైన ఆరోపణను బిజెపి ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ బురద చల్లి ప్రయత్నాన్ని మానుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వం సమన్వయం చేసుకుంటూ పోవాలని అలాంటిది బిజెపి ప్రభుత్వంపై ఇకనైనా నీచమైన మాటలు కాంగ్రెస్ పార్టీ మానుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రైతులకు యూరియా ఇబ్బందులేకుండా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో యూరియా బ్లాక్ మార్కెట్లోకి తరలి వెళ్లకుండా రైతులకు అందుబాటులో ఉంచి ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో బిజెపి నాయకులు జిల్లా కౌన్సిల్ మెంబర్ నర్సింగ్ అంజయ్య గౌడ్, జనగల శ్రీనివాస్, చిత్తలూరి సోమయ్య, నర్సింగ్ నాగ సైదులు గౌడ్, మేకపోతుల వీర ప్రసాద్, మండవ సత్యం తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రతతోనే ఆరోగ్య భద్రత: మున్సిపల్ డీఈ




**సూర్యాపేట, జూలై 8(మనం ప్రతినిధి):** పరిసరాల పరిశుభ్రత తోనే ఆరోగ్య భద్రత అని మున్సిపల్ డిఈ సత్య రావు శాంతి ఇన్స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పట్టణంలోని 33వ వార్డులో 100 రోజుల ప్రణాళికలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు.100 రోజుల శానిటరీ ఇన్స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్ పాల్గొని ప్రజలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఇరువురు అధికారులు మాట్లాడుతూ.., వర్షాకాలంలో నీటి నిల్వలతో దోమలు పెరిగి డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు విస్తరించే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, డ్రైనేజీలలో నీరు నిలిచేలా ఉంచకూడదని తెలిపారు. గృహ, వాణిజ్య, వ్యాపార ప్రదేశాల్లో చెత్తను తడి, పొడి, హానికర చెత్తగా వేరు చేసి మున్సిపల్ వాహనాలకు ఇవ్వాలని కోరారు. అలాగే వీధుల్లో సంచరించే కుక్కలకు బెల్టులు వేసి, టీకాలు వేయించాలన్నారు. శిథిల భవనాల్లో నివసించొద్దని, రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. పౌరులు పరిశుభ్రతను అలవర్చుకుంటేనే అనారోగ్య సమస్యలు దరిచేరవని, అందులో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# భూ సమస్యల ఫిర్యాదులను వెంటనే పరిష్కరించండి

- రెవెన్యూ సదస్సులో కలెక్టర్ హనుమంతరావు



**యాదగిరిగుట్ట, జూలై 8(మనం న్యూస్):** రెవెన్యూ సదస్సులో, భూభారతి లో వివిధ భూ సమస్యల పై వచ్చిన దరఖాస్తులను రెవెన్యూ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం యాదగిరిగుట్ట తహసిల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సదస్సులు, భూభారతిలో వచ్చిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి, రెవిన్యూ సదస్సులో ప్రజల నుండి వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇచ్చి పెండింగ్ లేకుండా డిస్పోజ్ చేయాలన్నారు.భూ భారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చేపడుతున్న చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధించిన అన్ని దరఖాస్తులను క్లియర్ చేయాలన్నారు. అన్ని మాడ్యూల్స్ లో దాఖలైన భూ భారతి దరఖాస్తులను పెండింగ్ ఉంచకుండా వెంటనే పరిష్కరించేందుకు చొరవ చూపాలి అన్నారు. భూ భారతి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను మండల తహసీల్దార్ లాగిన్‌లో ఉన్న దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అవసరమైన రికార్డులను కూడా క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. రెవెన్యూ పరంగా ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

అనంతరం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులపై ఎంపీడీవోతో సమీక్షిస్తూ.. ఇళ్లు మంజూరి అయ్యి ఇంకా ఇళ్లు మొదలు పెట్టని వారితో మాట్లాడి వారి ఆర్థిక పరిస్థితుల గురించి తెలుసుకొని డబ్బులు లేకపోతే మహిళా సంఘాల ద్వారా లోన్ ఇప్పించి త్వరగా ఇళ్లు మొదలు పెట్టుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. పురోగతిలో ఉన్న ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతంగా లబ్ధిదారులు పూర్తి చేసేలా సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. పేద వారికి ఇళ్లు కట్టిస్తే దానికి మించినది ఇంకొకటి ఉండదని తదనుగుణంగా ఇళ్లు నిర్మాణ పనులు పూర్తి చేసుకొని గృహ ప్రవేశాలు చేపట్టేలా చూడాలన్నారు. ప్రతి సోమవారం బేస్మెంట్ లెవెల్, పిల్లర్ లెవెల్, స్లాబ్ లెవెల్ పూర్తి అయిన వారి ఖాతాలో డబ్బులు జమ చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మహిళా శక్తి సంబురాలు విజయవంతం చేయాలి



**మేళ్లచెరువు, జూలై 8(మనం న్యూస్):** ఇందిరా మహిళా శక్తి' సంబురాలు నిర్వాహణపై గ్రామ సంఘం అధ్యక్షురాళ్లతో మరియు వివోఏలతో ఏపీఎం ఆర్. శ్రీనివాస్ సమీక్ష నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల 18 వరకు జరిగే ఇందిరా మహిళా శక్తి సంబురాలు పండుగ వాతావరణంలో మహిళా సంఘాల సభ్యుల సమన్వయంతో నిర్వహిం చాలని సూచించారు. అన్ని గ్రామ సంఘాల్లో బుధవారం సమావేశాలు నిర్వహించి ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా ప్రభుత్వం చేపడుతున్న అనేక రకాల సంక్షేమ పథకాలను మహిళా సంఘం సభ్యులకు తెలియజేయాలని కోరారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలని ప్రభుత్వ సంకల్పంతో ఇందిరా మహిళా శక్తి పథకంలో సోలార్ విద్యుత్ ప్లాంట్, ఆర్టీసీ బస్సుల నిర్వహణ చేపట్టాలని గ్రామ అధ్యక్షురాళ్లకు సూచించారు.

# ప్రభుత్వం నిర్దేశించిన ధరకే ఎరువులు అమ్మాలి

- ఎరువులను అధిక ధరకు అమ్మితే కఠిన చర్యలు తప్పవు
- జిల్లాలో అన్ని మండలాల్లో ఎరువులు అందుబాటులో ఉంచాలి
- ప్రతిరోజు 9 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉంచాలి
- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నల్లగొండ, జూలై 8(మనం ప్రతినిధి):** ప్రభుత్వం నిర్దేశించిన ఎంఆర్పీ ధరలకు మించి ఎరువులను అమ్మినా లేదా ఇతర ఎరువులతో లింకు పెట్టినా అలాంటి వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. జిల్లాలో యూరియాతో సహా అన్ని ఎరువులు సరిపోయినంతగా నిల్వలు ఉన్నాయని, అందువల్ల రైతులెవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె స్పష్టం చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ జిల్లాలోని అన్ని మండలాల్లో తగినంతగా ఎరువుల నిలువలు ఉన్నాయని, ఈ నెలాఖరు వరకు ఎలాంటి ఎరువుల కొరత లేదని, జిల్లాలోని అన్ని మండలాలలో ప్రతిరోజు 9000 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉండేలా చూస్తున్నామని, ఈ నెలాఖరు వరకు ఎలాంటి కొరతలేదని స్పష్టం చేశారు. అంతేకాక జూలై 15 నుండే ఆగస్టు నెలకు అవసరమైన బఫర్ ఎరువులను సిద్ధంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రైవేటు ఎరువుల డీలర్లు లేదా ఇతరులు ఎవరైనా ప్రభుత్వం నిర్దేశించిన ఎమ్మార్పీ ధరలకే ఎరువులను విక్రయించాలని, యూరియా ఇతర ఎరువులు అమ్మేందుకు ఇతర ఎరువులతో ఎట్టి పరిస్థితులలో లింకు పెట్టవద్దని, ఎవరైనా అలా చేసినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆయా మండలాలలో అందుబాటులో ఉన్న ఎరువుల వివరాలను విడుదల చేశారు.

# టూరిజం శాఖకే వన్నెతెచ్చిన రమేష్ రెడ్డి



**సూర్యాపేట, జూలై 8(మనం ప్రతినిధి):** తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా పటేల్ రమేష్ రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టి సంవత్సర కాలంలో ఎంతో అభివృద్ధి చేశారని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, సూర్యాపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు గట్టు శ్రీనివాస్ గుప్త తెలిపారు. ఇందు లో భాగంగా మంగళవారం సూర్యాపేట జిల్లా కేం ద్రంలోని కృష్ణ కాలనీలో గల పటేల్ రమేష్ రెడ్డి నివాసంలో టూరిజం కార్పొరేషన్ చైర్మన్ గా సంవ త్సరం కాలం పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేసి పటేల్ రమేష్ రెడ్డికి తినిపించి సంబరాలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.., ముఖ్యమం త్రి రేవంత్ రెడ్డి ఆశీస్సులతో పటేల్ రమేష్ రెడ్డి కార్పొరేషన్ పదవి చేపట్టి తెలంగాణను టూరిజం హబ్‌గా మారుస్తున్నారని కొనియాడారు. పురాతనమైన ఉండ్రుగొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం అభివృద్ధితో పాటు సద్దల చెరువు మినీ ట్యాంక్ బండ్‌కు కోట్ల రూపాయల నిధులు విడుదల చేయించి అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉండ్రుగొండ గిరిదుర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ ఊర రామమూర్తి యాదవ్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ముదిరెడ్డి రమణా రెడ్డి, పిసిసి అధికార ప్రతినిధి ధరావత్ వెంకన్న నాయక్ మాజీ కౌన్సిలర్లు వెలుగు వెంకన్న, నిమ్మల వెంకన్న, తండు శ్రీనివాసు గౌడ్, వల్దాసు దేవేందర్, యాట ఉపేందర్, పిల్లల రమేష్ నాయుడు, కుంచం అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# మహిళల కోసం లాభదాయక యూనిట్లు ఏర్పాటు



**తిరుమలగిరి, జూలై 8(మనం న్యూస్):** మహిళలు ఉపాధి యూనిట్లను ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా ముందుకు ఎదగాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. తిరుమలగిరి పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం జరుగుతున్న మండల సమాఖ్య సమావేశానికి కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన పాలకవర్గం అధ్యక్షురాలు టి.కవిత, కార్యదర్శి రమ్య, కోశాధికారి మామిడిలక్ష్మి, కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా ఏర్పడిన సంఘం గ్రూపులలో కొత్త సభ్యులను చేర్పించాలని ప్రతి ఇంటి నుంచి మహిళ సంఘ సభ్యురాలుగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. 15 ఏళ్ల నుండి 18 సంవత్సరాలు నిండిన కిషోర్ బాలికలతో సంఘాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. 60 సంవత్సరాలు నిండిన వారిని కూడా సభ్యులుగా తీసుకోవాలని, సంఘాలకు శిక్షణ ఇచ్చి వారు ఆర్థికంగా బలపడేలా చూడాలని తెలిపారు. ఎస్‌హెచ్‌జీ సభ్యురాలు అందరూ ఆర్థికంగా ఎదగాలని చెప్పారు. రుణాలు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి తీసుకున్న సభ్యులు మళ్లీ తిరిగి సక్రమంగా కట్టే విధంగా చూడాలని అలాగే తీసుకున్న లోన్లతో వినూత్నంగా ఆలోచించి మంచి లాభదాయక ఉపాధి యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. సంఘాలలోని నాయకురాలు తప్పకుండా బాధ్యతలు కలిగి ఉండాలని ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా ప్రతి నిరుపేద మహిళను కోటీశ్వరాలిగా తీర్చిదిద్దుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు, డిఆర్‌డిఓ అప్పారావు, ఆర్డీఓ వేణు మాధవరావు, ఎమ్మార్వో హరి ప్రసాద్, ఎంపీడీవో లాజర్, ఏపిఎం మధు సూధన్, సిసి విజయ లక్ష్మి, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# నాంపల్లి పీహెచ్‌సీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- వైద్యాధికారిని డాక్టర్ భవానిని అభినందించిన కలెక్టర్
- నాంపల్లి కేజీబీవీని సందర్శించి సమస్యలు తెలుసుకున్న కలెక్టర్
- మండలంలో నెలకొన్న సమస్యల నివేదికను పంపించాలని ఎంపీడీవో శ్రీనివాస శర్మకు ఆదేశం




**మర్రిగూడ, జూలై 8(మనం న్యూస్):** రక్తహీనతతో బాధపడుతున్న మహిళలు పౌష్టికాహారం తీసుకునే విధంగా అవగాహన కల్పిస్తుండడం పట్ల నాంపల్లి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని డాక్టర్ భవానిని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అభినందించారు. అంతేకాక రోగులకు వారి సహాయకులకు, బంధువులకు ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పిస్తుండడం పట్ల కూడా ఆమె అభినందించారు. ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలలో డాక్టర్లు, సిబ్బంది ఇలాగే మంచి వైద్య సేవలు అందించాలని చెప్పారు. మంగళవారం ఆమె నల్గొండ జిల్లా, నాంపల్లి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.డాక్టర్లు, రోగులతో ముఖాముఖి మాట్లాడారు. ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని డాక్టర్ భవాని తో ఆమె మాట్లాడి గత నెల ఎన్ని కాన్పులు చేశారని అడగగా, రెండు కాన్పులు చేసినట్లు డాక్టర్ తెలిపారు. ఆసుపత్రి ద్వారా పేద ప్రజలకు అందిస్తున్న సేవల పట్ల జిల్లా కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అంతేకాక మంగళవారం డాక్టర్ భవాని రోగులకు ఆరోగ్య విద్యపై అవగాహన కల్పిస్తుండగా, రోగులతో పాటు వారి భర్త లు, బంధువులు కూడా ఈ అవగాహన కార్యక్రమానికి హాజరు కావడం పట్ల డాక్టర్ భవానిని కలెక్టర్ అభినందించారు. ఆసుపత్రి ఆవరణను శుభ్రం చేయించి మొక్కలు నాటేందుకు డాక్టర్ చర్యలు తీసుకుంటుండడం పట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ భవానిని ప్రత్యేకంగా అభినందిస్తూ ఇలాగే విధులు నిర్వహించాలని చెప్పారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ కేజీబీవీని సందర్శించి కేజీబీవీలో విద్యార్థులకు అందిస్తున్న విద్య, భోజనం, తదితర సౌకర్యాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతేగాక తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. కాగా, టాయిలెట్ సమస్యను, ఇతర సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వాటిపై నివేదిక పంపించాలని ఎంపీడీవో శ్రీనివాస శర్మను ఆదేశించారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూ భారతి దరఖాస్తులన్నింటిని ఆగస్ 14 లోగా పరిష్కరించాలని తహసిల్దార్ జి. దేవసింగ్‌ను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట చండూర్ ఆర్డీవో శ్రీదేవి, ఎం పి ఓ ఝాన్సీ, ఆర్ఐ విజయ, తదితరులు ఉన్నారు.

# ముఖ్యమంత్రి సభకు ముమ్మర ఏర్పాట్లు

- సభా స్థలిని పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే

**తిరుమలగిరి, జూలై 8(మనం న్యూస్):** తిరుమలగిరి పట్టణంలో ఈనెల 14 న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమా, సభ కోసం ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం తిరుమలగిరి పట్టణంలో ముఖ్యమంత్రి సభా ఏర్పాట్లను తుంగతుర్తి నియోజకవర్గ శాసన సభ్యులు మందుల సామ్యేలు, జిల్లా ఎస్పి నరసింహతో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సభ జరిగే ప్రాంగణం పరిశీలిస్తూ హెలిప్యాడ్ నుండి సభా వేదిక వరకు వెళ్లే రోడ్డును వేయాలని, డబుల్ బారికేడ్లు నిర్మించాలని తెలిపారు. వీఐపి, అధికారుల పార్కింగులను పరిశీలించారు. హెలిప్యాడ్‌ను, అంతర్గత రోడ్లు వెడల్పుగా చేయాలని తెలిపారు. ప్రజలు ఎక్కువగా వస్తారు కాబట్టి ట్రాఫిక్ సమస్య లేకుండా పలు చోట్ల పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. పార్కింగ్ స్థలాలకి వెళ్లే రోడ్లలో గుంటలు పూడ్చి, చదును చేయాలని, దారి పొడువునా ఏమైనా చెట్ల కొమ్మలు అడ్డు వస్తే తొలగించాలని, పార్కింగ్ లో ఫ్లడ్ లైట్స్ ఏర్పాటు చేయాలని, ప్రతి పార్కింగ్ లో రెండు దారులు లోపలకు, బయటకు వెళ్ళేల తయారు చేయాలని మున్సిపల్ కమిషనర్‌కి సూచించారు. హెలిప్యాడ్, పార్కింగ్, వీఐపిలకు ప్రోటోకాల్, సభవేదిక వద్ద ఆర్డీఓ ఇంచార్జిలను నియమించాలని విధులు కేటాయించామని, ప్రజలకు ఏలాంటి ఇబ్బంది కలగకుండా జాగ్రత్తగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. బారికెట్స్ అర్ అండ్ బి అధికారులు పకడ్బందీగా వేయాలన్నారు. ప్రజలకోసం చల్లని త్రాగునీరు, మజ్జిగ ఏర్పాట్లు చేయాలని ప్రతి సెక్టార్‌కి ఒక అధికారిని ఇన్‌చార్జిగా ఉంచాలని, గ్రామ పంచాయతీ సిబ్బంది సహాయంతో సభకు వచ్చిన ప్రజలకి త్రాగునీరు, మజ్జిగ అందజేయాలని తెలిపారు. అధికారులు ఐడి కార్డులు తహసిల్దార్ చూడాలన్నారు. సమాచార శాఖ ద్వారా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులచే ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు కమిషన్ మెంబర్ చెవిటి వెంకన్న యాదవ్, ఆర్డీఓ వేణు మాధవ్, డీఎఫ్ఓ సతీష్ కుమార్, డిఆర్.డి ఓ వివి అప్పారావు, డిఏఓ శ్రీధర్ రెడ్డి, డి.ఎం.హెచ్.ఓ చంద్రశేఖర్, డిపిఓ యాదగిరి, డిఎండబ్ల్యుఓ జగదీష్ రెడ్డి, డి టి డి ఓ శంకర్, ఫైర్ ఆఫీసర్ క్రిష్ణా రేడ్డి, తహసీల్దార్ హరిప్రసాద్, మున్సిపల్ కమిషనర్ మున్వర్, అధికారులు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.






## ఇల్లంద ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు డైరీలు

**వర్ధన్నపేట, జూలై 8(మనం ప్రతినిధి):** ఇల్లంద ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులు తమ సొంత ఖర్చులతో డైరీలు ప్రింట్ చేయించి150 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉంటాయని ఉపాధ్యాయ బృందం నిరూపించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయ మాట్లాడుతూ విద్యార్థులు రోజువారి ఇంటి పని రాసుకుని విద్యార్థులు తల్లిదండ్రుల పర్యవేక్షణలో చదవడానికి వీలుగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ కృష్ణ, వి మమత, బి సుజాత, కే శ్రీనివాసరావు, పి.సీతారాం రెడ్డి, ఎస్.కె.హసన్ అలి, ఎస్.మాధవి, బి.ఉమాదేవి, ఎన్.రోజా, శోభారాణి కిషోర్ కుమార్ శరవన్, అంజయ్య, భవాని, శ్రీధర్, స్వామి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో 42% రిజర్వేషన్స్ అమలు చేయాల్సిందే

- ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

**వరంగల్, జూలై 8(మనం ప్రతినిధి):** బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ ముదిరాజ్, మండలిలో బీఆర్ఎస్ పక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రులు గంగుల కమలాకర్,తలసాని శ్రీనివాస్ యాదవ్, వీ.శ్రీనివాస్ గౌడ్, బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద పటేల్, కోతి కిశోర్ గౌడ్, పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యురాలు సుమిత్రా ఆనంద్, జేడ్పీ మాజీ ఛైర్ పర్సన్ తుల ఉమ, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దూదిమెట్ల బాలరాజు యాదవ్ తదితరులతో కలిసి తెలంగాణ భవన్ లో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించిన తర్వాతనే స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిపించాలని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కామారెడ్డి బహిరంగ సభలో, ఎన్నికల ప్రచారంలో, మేనిఫెస్టోలో బీసీలకిచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో,విద్యా, ఉద్యోగ రంగాలలో 42శాతం రిజర్వేషన్స్ అమలుకు పార్లమెంట్ ద్వారా చట్టబద్ధత కల్పించాల్సిందేనని స్పష్టం చేశారు.అప్పటి తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత, ఆ రాష్ట్రానికి చెందిన అన్ని పార్టీల నాయకులు ఐకమత్యంతో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి 69శాతం రిజర్వేషన్స్ అమలునకు పార్లమెంట్ ద్వారా చట్టం చేయించుకోవడాన్ని ఎంపీ రవిచంద్ర గుర్తు చేశారు. అదే మాదిరిగా తెలంగాణలో కూడా రిజర్వేషన్స్ అమలునకు బాధ్యతగల ప్రతిపక్షంగా తమ పార్టీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటం కొనసాగిస్తుందన్నారు. కాంగ్రెస్ పాలకులు, నాయకత్వంపై మరింత వత్తిడి పెంచుతూనే ఉంటామని చెప్పారు.కాంగ్రెస్ పార్టీకి లోకసభలో 100 మంది సభ్యులు ఉన్నారని, ఇండియా కూటమి ఎంపీలతో కలిసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడిని తీవ్రతరం చేసి బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో, విద్యా, ఉద్యోగ రంగాలలో 42శాతం రిజర్వేషన్స్ కోసం పార్లమెంటులో బిల్లు ప్రవేశపెడితే తమ నాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖర రావు మార్గ నిర్దేశనంలో సంపూర్ణ మద్దతునిస్తామని ఎంపీ వద్దిరాజు చెప్పారు.

కాంగ్రెస్ బీసీలకు అన్ని రంగాలలో తీరని అన్యాయం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు మంత్రిమండలిలో కేవలం మూడం టే మూడు పదవులు మాత్రమే ఇవ్వడం తీవ్ర విచారకరమన్నారు. మున్నూరు కాపు, యాదవ, ముస్లిం, లంబాడీ, కురుమ, చాకలి కులాల వారికి మంత్రివర్గంలో చోటివ్వకపోవడం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ పాలకులను గట్టిగా నిలదీయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. జనాభా దమాషా ప్రకారం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 12 మంత్రి పదవులు ఇవ్వాల్సి ఉండేదన్నారు. కామారెడ్డి డిక్లరేషన్, బూటకపు హామీలు, కల్లబొల్లి కబుర్లు చెప్పి అధికారంలోకి వచ్చాక, వాటిని నెరవేర్చలేక 'డైవర్షన్ పాలిటిక్స్' చేస్తున్నారని ఎంపీ వద్దిరాజు కాంగ్రెస్ పాలకులపై మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పిస్తూ స్థానిక సంస్థల ఎన్నికలు జరిపించాలని, ఇందుకోసం కాంగ్రెస్ పాలకులు కేంద్ర ప్రభుత్వంపై మరింత వత్తిడి పెంచాలని ఎంపీ రవిచంద్ర డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు, విద్యా, ఉద్యోగ రంగాలలో 42% రిజర్వేషన్స్ సాధించుకునేందుకు ఇదే సరైన సమయమని, ఇందుకు బీసీ కులాల వారందరం కూడా మరింత ఐక్యతతో పోరాడుదామన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించి 80 ఏండ్లు సమీపిస్తున్నా కూడా కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ లేకపోవడం బాధాకరమని ఎంపీ వద్దిరాజు వ్యాఖ్యానించారు.



## దివంగత మహానేత వైఎస్‌కు ఘనంగా నివాళి

- దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**మంగపేట, జూలై 8(మనం ప్రతినిధి):** రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మాత్యులు దనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు పెద్దలు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షు లు పైడాకుల అశోకన్న సూచన మేరకు, మంగపేట మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహానికి మంగ ళవారం పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జయరాం రెడ్డి ఆధ్వర్యంలో దివంగత నేత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను నిర్వహించి మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల కార్యకర్తల మధ్య కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ అనే మూడు అక్షరాల పదం చాలా ప్రత్యేకమైనది. వైఎస్ఆర్ ఆం ధ్రప్రదేశ్ రాజకీయాలలో ఒక ప్రముఖ వ్యక్తిగా నిలిచారు. ఆయన రాజకీయ ప్రయాణం విధానాలు మరియు ప్రజా సేవా కార్యక్రమాలకు ఆయనను ప్రజానాయకుడిగా ప్రసిద్ధి చేస్తాయి పుట్టిన ప్రాంతం రుణం తీర్చుకోవాలని ఒక్క రూపాయికే వైద్యం చేసి రూపాయి డాక్టర్‌గా పేరొంది, అనతి కాలంలో 1978లో మొదటిసారిగా పులివెందుల నుండి శాసన సభ్యునిగా గెలుపొంది సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతిసారి ప్రజల మద్దతుతో వరుసగా ఓటమనేది తెలియకుండా 14 సార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజలకు చేరువై 1980 సంవత్స రంలో ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గంలో వివిధ శాఖలకు మంత్రిగా తనదైన శైలిలో బాధ్యతలు నిర్వహించి 2004 లో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని విజ య తీరాలకు చేర్చి మొదటిసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రారంభించి వ్యవసాయం సాగునీరు జల యజ్ఞం 26 సాగునీటి ప్రాజెక్టును పొట్టు చేసి 20 లక్షల ఎకరాకు దాకా నీరందించిన ఘనత వైయస్ రాజశేఖ ర్ రెడ్డి గారిది అదే విధంగా రైతన్నను రాజును చేయడమే ధ్యేయంగా ఉచిత విద్యుత్ సదుపాయా న్ని ప్రవేశపెట్టిన ఘనత అయినది రైతు సంక్షేమం కొరకు రైతు రుణమాఫీ సబ్సిడీ రుణాలను బీమా పథకాలను ప్రవేశపెట్టి కాంగ్రెస్ పార్టీ అంటే రైతన్నల పార్టీ అని మరొకసారి రుజువు చేసిన రాజశేఖర్ రెడ్డి, అదే విధంగా పేదవాడు పెద్ద హాస్పిటల్‌కి వెళ్లి ఆరోగ్య సమస్యలు పరిష్కారం కావాలనే ఉద్దేశంతో రాజీవ్ ఆరోగ్యశ్రీ అనే పథకాన్ని ప్రవేశపెట్టి అందులో ఉచి త హార్ట్ సంబంధించినవి కిడ్నీ సర్జరీలు మెడికల్ ట్రీట్మెంట్లు ఆరోగ్యశ్రీలో చేర్చి ఎంతోమందికి పేదవాళ్లకు ఉపయోగపడే విధంగా చేసి 108 అంబులెన్స్ సేవా అనేది ఉచితంగా వెంటనే వచ్చి ఏ సందర్భంలో ఉన్నా కూడా ప్రాణాలను కాపాడిన సందర్భం గుర్తు చేస్తూ అదేవిధంగా ఉచిత మధ్యాహ్నం భోజనం ఉచిత పాఠ్య పుస్తకాలు ఇందిరా ప్రియదర్శిని గృహాలు ఉపాధి హామీ పథకం ఇలా ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకువచ్చిన రాజశేఖర్ రెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెంది మన మధ్య లేకపోవడం బాధాకరం అని అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గ, బ్లాక్ కాంగ్రెస్, మండల, గ్రామ, నాయకులు అన్ని అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# రైతుల పక్షపాతి సీఎం రేవంత్ రెడ్డి

- తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ జాటోతు రామచంద్రనాయక్

**మరిపెడ, జూలై 8(మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రైతుల పక్షపాతిగా రైతులకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వారి గుండెల్లో స్థిర స్థాయిగా నిలిచారని తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ స్పీకర్, డోర్నకల్ ఎమ్మెల్యే, (ప్రభుత్వ విప్) డాక్టర్ జాటోతు రామచంద్ర నాయక్ అన్నారు. మంగళవారం మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో వారు వచ్చిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు వి.యుగంధర్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి, శాలువా కప్పి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనతి కాలం లోనే ప్రజాహిత సంక్షేమాలు అమలు చేస్తూ! ప్రజా పాలన కొనసాగిస్తుందన్నారు. నాడు, నేడు ఎప్పటికీ కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షపాతి అని రైతు హితం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో కృషి చేస్తుందని తెలిపారు. సాగుకు యోగ్యమైన భూములన్నిటికీ రైతు భరోస పథకం గుర్తింపజేస్తున్నామన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో సబ్బండ వర్గాల ప్రజలకు ప్రజాహిత సంక్షేమాలు ప్రవేశపెట్టి నిరుపేదలకు ఆసరాగా నిలుస్తోందన్నారు. మండలంలోని ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రత్యక్షంగా ఉచిత కరెంటు, ఉచిత బస్సు, రూ. 500 సిలిండర్, వసతిగృహాల్లు విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు పెంచి, వారికి ఆపన్న హస్తం అందిస్తోందన్నారు. 21లక్షల మంది రైతుల రుణ మాఫీ చేసి, సన్నాలకు బోనస్, భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టం, అమలు చేస్తున్నామన్నారు. అర్హులైన రైతులకు ఎకరాకు రూ.6వేల రైతు భరోసా ప్రజలకు, నిజమైన లబ్ధిదారులకు అందించిందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు మొదటి విడతగా 4000వేల మందికి ఇందిరమ్మ ఇళ్లు అందించి ప్రజా ప్రభుత్వంగా ప్రజల మన్ననలు పొందు తున్నామన్నారు. ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అన్ని విధాల బలపరచాలని కోరారు. మర్యాద పూర్వకంగా కలిసిన కాంగ్రెస్ జిల్లా నాయకులు ఒంటికొమ్ము. యుగంధర్ రెడ్డి, నూకల .అభినవ్ రెడ్డి, మాజీ సర్పంచ్ పానుగోతు రామ్ లాల్, అంబరీష,మరిపెడ మండల నాయకులు, పట్టణ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## వృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం పకడ్బందీగా అమలు

- ఆర్డీఓ ఎన్.వెంకటేశ్

**ములుగు, జూలై 8( మనం ప్రతినిధి):** ములుగు జిల్లాలో తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ సంక్షేమ చట్టం, 2007 ను పకడ్బందీగా అమలుచేస్తున్నామని రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్డీఓ) ఎన్. వెంకటేశ్ మంగళవారం తెలిపారు. తల్లిదండ్రులు, వృద్ధుల హక్కులు, వారి ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు డివిజన్ లోని తాహసీల్దార్లు, న్యాయ బృందాలతో సమన్వయం చేసుకుంటూ గత 6 నెలల్లో 28 ఫిర్యాదులను స్వీకరించి 24 ఫిర్యాదులకి ఉత్తర్వులు జారీ చేయగా మిగతా 4 విచారణ దశలో ఉన్నాయని ఆయన తెలిపారు. పరిష్కరించిన ఫిర్యాదులలో 2 కేసులలో వారసుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయబడిన భూములను తిరిగి వారి తల్లితండ్రులు పేరు మీద బదిలీ చేయడానికి ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని తెలిపారు. వృద్ధుల పట్ల నిర్లక్ష్యం చేసిన వారసులకు నెలవారీ పోషణ ఖర్చుగా రూ.3000/- నుంచి రూ.10,000/- వరకు సంబంధిత తల్లిదండ్రులు/ వృద్ధుల ఖాతాలో జమ చేయాలన్న ఆదేశాలు జారీతో అనేక కేసులు విజయవంతంగా పరిష్కారమై, వృద్ధుల పోషణ మరియు రక్షణ సుస్థిరంగా అమలయ్యాయి. వృద్ధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన లేదా వేధింపులకు పాల్పడ్డవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ స్పష్టం చేశారు. పోషణ ఖర్చులు చెల్లించని వారసులపై తల్లిదండ్రులు పోషణ, వృద్ధుల సంక్షేమ చట్టం, 2007 ప్రకారం ఒక నెల జైలు శిక్ష విధించబడుతుందని హెచ్చరించారు. ఈ సందర్భంలో తహశీల్దార్లకు వ్యక్తిగతంగా ఇటువంటి కేసులను పర్యవేక్షిస్తూ చట్టపరంగా తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలందరూ వృద్ధులను గౌరవించి, వారి సంక్షేమం కోసం సహకరించాలని ఆర్డీఓ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. వృద్ధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన లేదా వేధింపులకు పాల్పడ్డవారిపై ఫిర్యాదులు ఇవ్వాలనుకున్న వృద్ధులు తాహసీల్దార్ లేదా ఆర్డీఓ కార్యాలయాన్ని నేరుగా సంప్రదించవచ్చని ఆర్డీఓ పేర్కొన్నారు.



## ఆయిల్ పామ్ విస్తరణ లక్ష్యాలను పూర్తి చేయాలి: కలెక్టర్ దివాకర టీఎస్

**ములుగు, జూలై 8(మనం ప్రతినిధి):** ఆయిల్ పామ్ విస్తరణ లక్ష్యాలను పూర్తి చేయాలని, రైతులకు ఆయిల్ పామ్ సాగు, లాభాలపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులకు సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తన ఛాంబర్లో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జీతో కలిసి ఆయిల్ ఫామ్ సాగు విస్తీర్ణము, ప్రాసెసింగ్ ఇండస్ట్రీ (ఫ్యాక్టరీ) నిర్మాణము పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయిల్ పామ్ పంట సాగు పై, ఆయిల్ ఫామ్ కంపెనీ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం అవసరమైన డాక్యుమెంట్స్, పర్మిషన్స్, మౌలిక వసతుల కల్పన, కావలసిన ఏర్పాట్ల పై వివరంగా జిల్లా కలెక్టర్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ హార్టికల్చర్ సహకార, సంఘాల బలోపేతం, రైతుల సౌకర్యార్థం అనేక పథకాలు ప్రవేశపెడుతుందని తెలిపారు. పంట మార్పిడి ద్వారా ఆయిల్ పామ్ పంట సాగు పై రైతులకు అవగాహన కల్పించాలని, క్షేత్రస్థాయిలో సంబంధిత శాఖ అవగాహన సదస్సులు, ప్రచారం నిర్వహించాలని సూచించారు. పామ్ ఆయిల్ పంట సాగు ద్వారా రైతులకు అనేక లాభాలు చేకూరుతాయని, ప్రభుత్వం కల్పించిన సబ్సిడీ, రాయితీల వివరాలను తెలియపరచాలన్నారు. జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగు లక్ష్యమునకు మించి సాధించాలని, లబ్ధిదారుల ఎన్నిక, రైతుల నుంచి దరఖాస్తులను, రైతు వాటా సేకరణ, ప్లాంటేషన్ పూర్తి, మొదలగు పనులను, ఆయిల్ ఫామ్ కంపెనీ యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. జిల్లాకు కేటాయించిన ఆయిల్ ఫామ్ విస్తీర్ణం లక్ష్యం 3000 ఎకరాలు సాధించడానికి వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ అధికారులు కలిసి ఒక నిర్దిష్ట ప్రణాళికలు తయారు చేసి ఈ మొదటి సీజన్ లోనే 75శాతం లక్ష్యాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రతి వారంలో బుధవారం, శనివారం గూగుల్ మీట్ ఏర్పాటు చేసి తద్వారా ప్రగతిని వివరించాలని, జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారిని ఆదేశించారు. జిల్లాలో ఇండస్ట్రీస్ ఏర్పాటు చేయడానికి స్థలం కేటాయింపు, సంబంధించిన అనుమతులు త్వరితగతిన అన్ని ఏర్పాట్లు త్వరగా చేయడానికి సంబంధిత శాఖల అధికారులు సహకరించాలని సూచించారు. జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి డి.సంజీవరావు, జిల్లా వ్యవసాయ అధికారి సురేష్ కుమార్, జిల్లా ఇండస్ట్రీస్ అధికారి సిద్ధార్థ రెడ్డి, డీఈఆర్‌డబ్లు ఎస్.వెంకట సతీష్, విద్యుత్ శాఖ డీఈ నాగేశ్వరరావు, కే.ఎన్ బయోసైన్స్ ఏరియా మేనేజర్ హేమంత్, మైక్రో ఈఈ వినోద్ కుమార్ పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇండ్ల పనులు త్వరగా పూర్తి చేయాలి

- ఇండ్ల పురోగతిపై అధికారులతో ఎమ్మెల్యే రేవూరి సమీక్ష

**పరకాల, జూలై 8(మనం న్యూస్):** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పరకాల శాసన సభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. మంగళవారం నడికూడ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం నందు కార్యాలయ సమావేశ మందిరంలో మండల పరిధిలోని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై అధికారులతో కలిసి పరకాల శాసన సభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా ఎమ్మెల్యే రేవూరి మొక్కలను నాటారు. అనంతరం, గ్రామాల వారిగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై అధికారులు, ఇందిరమ్మ కమిటీ కలిసి సమీక్షించారు. ఇల్లు లేని ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అర్హులైన ప్రతి పేదవారికి ప్రాధాన్యతా క్రమంలో ఇందిరమ్మ ఇండ్లను దశల వారీగా మంజూరు చేస్తామన్నారు. మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసుకుంటే అదనంగా ఆ గ్రామానికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామన్నారు. ఇండ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న వారికి దశలవారీగా బిల్లులను కాం గ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇస్తుందన్నారు. ప్రభుత్వం సూచించిన నిబంధన మేరకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం లో పేదింటి వాడి సొంతకాల నెరవేరుతుందని, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు మహిళా సంఘాల ద్వారా రుణాలు తీసుకోవచ్చన్నారు. మండల స్పెషల్ ఆఫీసర్ నవీన్ కుమార్. మండల పరిషత్ అభివృద్ధి అధికారి విమల, తహసిల్దార్ రవీందర్ రెడ్డి. మండల పంచాయతీ అధికారి రవి, మండల ప్రోగ్రామ్ ఆఫీసర్ విద్యావతి, పరకాల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు బుర్ర దేవేందర్ గౌడ్. గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఇందిర మ్మ కమిటీ సభ్యులు పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## చిల్లర రాజకీయాలు మాని, నిర్మాణాత్మకంగా వ్యవహరించండి

- కేటీఆర్.. మీ చెల్లి నీ మీద దుమ్మెత్తి పోస్తోంది.. ఆమె సంగతేందో చూడు
- నీలాగా కుల బలం, తన బలం, అహంకార బలం నా వద్ద లేదు
- నియోజకవర్గమే నాకు అండ.. ములుగు ప్రజలు దీవిస్తే మంత్రినయ్యాను: మంత్రి సీతక్క

**ములుగు, జూలై 8 మనం ప్రతినిధి):** ములుగు అభివృద్ధిని అడ్డుకునేందుకు కె టి ఆర్ కుట్రలు చేస్తున్నారని నువ్వు నిర్వహించిన పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖకు నేను మంత్రయితే కేటీఆర్ తట్టుకోలేక నాపై అసత్యపు ప్రచారాలు బి ఆర్ ఎస్ నాయకులు చేస్తున్నారని, ఇప్పటికైనా ఆసత్యపు ప్రచారాలను మానుకొని నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరించలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆమె బీఆర్ఎస్ నాయకులపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇంట్లో ఆడబిడ్డను నువ్వు కుట్రలు కుతంత్రాలతో వేధిస్తున్నావు. ములుగులో ఇందిరమ్మ పాలన ప్రజాస్వామ్య పాలన సాఫీగా సాగుతుందన్నారు. నా మీద ఉన్న అభిమానాన్ని, ములుగు అభివృద్ధిని అడ్డుకునేందుకు కేటీఆర్ కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. పక్క నియోజకవర్గాలలో చిత్తుగా ఓడిపోయి అక్కడ ఎవరు పట్టించుకోక ఇక్కడికి వచ్చి డ్రామాలు హాస్యాస్పదమన్నారు. కేటీఆర్ నిజంగా మనిషి అయితే పోలీసు రాజ్యం ములుగులో ఉందని నిరూపిస్తావా? మీ హాయంలో మా కార్యకర్తల మీద ఎస్సీ ఎస్టీ కేసులు నమోదు చేశారు. లక్ష్మీదేవి పేట, చల్వాయి తో పాటు ఎన్నో గ్రామాల యువకుల మీద మీరు కేసులు పెట్టి వేధించారు..చర్చకు సిద్ధమా? ములుగు లో శాంతియుత వాతావరణం ఉంది ప్రజాస్వామ్య పాలన కొనసాగుతోంది దొర దురంకారంతో కుట్రలను రాష్ట్ర ప్రజలు ములుగు ప్రజలు అర్థం చేసుకున్నారు మీరు శాంతియుత ధర్నా చేసుకుంటామని చెప్పి మంత్రుల కాన్వాయ్ ని అడ్డుకునే ప్రయత్నం ఎందుకు చేశారు

మీకు రాజకీయ డ్రామాలు తప్ప.. బాధిత కుటుంబాలను ఆదుకునే సోయి లేదన్నారు. నియోజకవర్గంలో 90% ఎస్సీ,ఎస్టీ,బీసీ పోలీస్ అధికారులు ఉన్నారు వారి మనోస్థైర్యాన్ని దెబ్బతీసేలా మీరు ఆరోపణలు మానుకోవాలన్నారు. మీ పాలనలో ములుగు నియోజకవర్గంలో మీ మంత్రులు పర్యటిస్తే విపక్ష నేతలను హౌస్ అరెస్టులు చేసేవారన్నారు. చల్వాయిలో రమేష్ అనే యువకుడు ఆత్మహత్య చేసుకుంటే.. మమ్మల్ని నిందించడానికి బుద్ధి ఉండాలని, ఆ కుటుంబాన్నీ పరామర్శించి అండగా ఉంటామని హామీ ఇచ్చామన్నారు. మీరు ప్రజలను పొట్టన పెట్టుకుంటే.. మేము కడుపులో పెట్టుకొని చూసుకుంటున్నామన్నారు. మీ పాలనలో బిఆర్ఎస్ నేతల వేధింపులకు ఎందరో బలయ్యారన్నారు. సూసైడ్ లేఖలు, సెల్ఫీ వీడియోలు తీసుకొని ఆత్మహత్యలు చేసుకున్నారని, సిరిసిల్లలో ఇసుక లారీలతో ప్రజలను తొక్కించి చంపించిన చరిత్ర మీదన్నారు. మంథనిలో అడ్వకేట్ దంపతులను నరికి చంపింది ఎవరని, సిద్దిపేటలో ఆటో డ్రైవర్ శిలాసాగరం రమేశ్ కు డబల్ బెడ్ రూం రాకుండా మీ బిఆర్ఎస్ కౌన్సిలర్ అడ్డుకుంటే సిద్దిపేట కలెక్టరేట్ వద్ద పురుగు మందు తాగి సెల్ఫీ వీడియో తీసుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. కొత్తగూడెం అప్పటి ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు కొడుకు బీఆర్ఎస్ నేత రాఘవేంద్ర వేధింపులు తాళలేక ఓ కుటుంబం సుసైడ్ చేసుకుందన్నారు. మెదక్ జిల్లా రామాయంపేట లో మీ నేతలు వేధిస్తున్నారని తల్లి, కొడుకు పద్మ,సంతోష్ సెల్ఫీ తీసుకుని పెట్రోల్ పోసుకుని సుసైడ్ చేసుకున్నారన్నారు. మీ మంత్రి పువ్వాడ అజయ్ బెదిరింపులతో ఖమ్మంలో సాయి గణేష్ అనే యువకుడు సూసైడ్ లెటర్ రాసి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. ఇలా ఎందరో మీ వేధింపులకు బలి అయితే.. ఆ కుటుంబాను కనీసం పరామర్శించలేదన్నారు. ముఖ్యమంత్రిని వ్యక్తిగతంగా దూషించే కేటీఆర్ కు సంస్కారం లేదు.. కేటీఆర్ కు ఒళ్లంతా దూరంకారమే, ఉద్యమ సమయంలో జనాలను రెచ్చగొట్టి చనిపోయేలా చేసి మీరు మాత్రం అధికారం అనుభవించారన్నారు. బి ఆర్ ఎస్ పదేళ్ల పాలనలో ములుగులో కనీసం వేయి ఇండ్లు కట్టించి ఇవ్వలేదు.. మీకు మాట్లాడే అర్హత ఉందా? అధికారం కోసం చావులకు ప్రేరేపించిన చరిత్ర మీది అని, ఇప్పటికైనా ప్రభుత్వంపై విమర్శలు మానుకొని అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు.



## తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదు

- ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు గుమ్మడి సోమయ్య

**మంగపేట, జూలై 8(మనం ప్రతినిధి):** మంగళవారం రోజున కమలాపురం గ్రామంలోనీ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద గ్రామ కమిటీ అధ్యక్షులు బేవర సత్యానారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షులు గుమ్మడి సోమయ్య హాజరై మాట్లాడుతూ నిన్నటి రోజున రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మాత్యులు ధనసరి అనసూయ సీతక్క పర్యటనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపె ట్టిన ఇందిరమ్మ ఇండ్లలో కమలాపురం గ్రామంలో అవకతవకలు జరిగాయని ఇండ్ల ఎంపికలో డబ్బులు తీసుకొని ఎంపిక చేశారు అని మాకు అన్యాయం జరిగింది అని ఎస్కే పర్వీన,గాజర్ల రాజు గార్లు వాళ్ల ఉద్దేశపూర్వకంగానే ఆరోపణలు చేయడం పూర్తిగా అవస్తవం అని తెలియజేస్తూ ఏ నాయకుడు అయినా డబ్బులు తీసుకొని ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక చేశారో 24 గంటల్లోగా నిరూపించాలని లేనియెడల అధిష్టానం నిర్ణయం మేరకు క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని తెలియజేస్తూ ఎస్సీ సామాజిక వర్గానికి నాలుగు ఇండ్లను కేటాయించడం జరిగింది అని ఎస్సీ ఎస్టీ, బీసీ మైనారిటీ ఓసి కులాలలో అందరికి న్యాయం జరిగేలా అధికారులతో ఎంక్వయిరీ చేసిన తరువాతనే కచ్చితంగా అర్హులైన వారికే ఇండ్ల ఎంపిక జరిగిందని , కమలాపురం గ్రామంలో ఔ1లిస్టులో అర్హులైన జాబితాలో 1136 ఉన్నారని అందులో 27 ఇండ్లకు పట్టాలు వచ్చాయి ఇంకా అధికారుల వెరిఫికేషన్ లో 18 ఇండ్లు పెండింగ్ లో ఉన్నాయి అర్హులైన ప్రతి పేదవాళ్లకు క్రమ పద్ధతిలో విడుదల వారీగా పార్టీ లకు అతీతంగా ఇవ్వడం జరుగుతుంది ఇందిరమ్మ ఇండ్లు నిరంతర ప్రక్రియ అని ఎవరు కూడా నిరాశకు చెందవద్దని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో జిల్లా సెక్రటరీ తుడి భగవాన్ రెడ్డి, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు పెద్ది నర్సింహారావ్, సీనియర్ నాయకులు చింత పున్నారావు, నిమ్మల రాంబాబు లతో పాటుగా జిల్లా, మండల, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ‘ట్రయథ్లాన్’లో సయామీ ఖేర్ రికార్డు..
# అలా తొలి భారతీయ నటిగా



సినిమాలతో బిజీగా ఉన్నా ఇతర రంగాలపైనా కొందరు హీరోయిన్లు ఆసక్తి చూపిస్తుంటారు. వారిలో సయామీ ఖేర్ ఒకరు. ఫిట్‌నెస్‌కు అధిక ప్రాధాన్యం ఇచ్చే ఆమె విదేశాల్లో నిర్వహించే ట్రయథ్లాన్ పోటీల్లో పాల్గొంటుంటారు. ఏడాది వ్యవధిలో రెండు సార్లు ‘ఐరన్‌మ్యాన్ 70.3’ పూర్తి చేసిన తొలి భారతీయ నటిగా తాజాగా రికార్డు నెలకొల్పారు. గతేడాది సెప్టెంబరులో తొలిసారిగా మెడల్ అందుకున్న ఆమె.. ఇప్పుడు స్వీడన్‌లో నిర్వహించిన రేస్‌లో సత్తా చాటి మరో పతకం అందుకున్నారు. 1.9 కి.మీ. ఈత, 90 కి.మీ. సైక్లింగ్, 21.1 కి.మీ. పరుగు ట్రయథ్లాన్‌లో భాగం. అత్యంత కష్టమైన పోటీల్లో ఇదొకటి. తన విజయంపై స్పందించారు సయామీ ఖేర్. ఎంతో ఆనందంగా ఉందంటూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. క్రమశిక్షణతో ఏదైనా సాధ్యమే అని పేర్కొన్నారు. ప్రపంచానికి తానెంటో నిరూపించుకోవాలన్న ఉద్దేశంతో ఇదంతా చేయలేదని, తన మనసుకు నచ్చింది చేస్తున్నానని తెలిపారు. గతేడాది కన్నా ఈ ఏడాది రేస్‌ను 32 నిమిషాల ముందే పూర్తి చేశానని చెప్పారు. నాసిక్‌కు చెందిన సయామీ తెలుగు సినిమా ‘రేయ్’తో తెరంగేట్రం చేసిన సంగతి తెలిసిందే. అందులో సాయి దుర్గాతేజ్ హీరో. ఆ తర్వాత బాలీవుడ్‌లో అవకాశాలు అందుకున్న ఆమె.. కొన్నాళ్ల గ్యాప్ అనంతరం ‘వైల్డ్‌డాగ్’తో తెలుగు ఆడియన్స్‌ను పలకరించారు. మళ్లీ తెలుగులో నటించలేదు. ఇటీవల వచ్చిన హిందీ చిత్రం ‘జాట్’లో కీలక పాత్ర పోషించారు. ట్రయథ్లాన్‌లో ఏడాది పాటు శిక్షణ తీసుకున్నారామె.






## క్రికెట్‌లో కన్నా.. వింబుల్డన్‌లోనే ఎక్కువ ఒత్తిడి ఉంటుంది: విరాట్ కోహ్లీ

లండన్‌లోని సెంటర్ కోర్టులో జకోవిచ్, అలెక్స్ డి మినార్ మధ్య సోమవారం వింబుల్డన్ మ్యాచ్ జరిగింది. దీన్ని సతీసమేతంగా విరాట్‌కోహ్లీ వీక్షించాడు. ఈ మ్యాచ్ అనంతరం ఓ స్పోర్ట్స్ ఛానల్‌తో మాట్లాడాడు. క్రికెట్ కన్నా.. వింబుల్డన్‌లోనే ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని అభిప్రాయపడ్డాడు. వరల్డ్‌కప్‌లో టీమ్ఇండియా, పాకిస్థాన్ మధ్య మ్యాచ్‌లు ఉన్నప్పుడు ఎంత తీవ్రమైన ఒత్తిడి ఉంటుందో, ప్రతి వింబుల్డన్ మ్యాచులోనూ అంతే స్థాయిలో ఉంటుందని వివరించాడు. ప్రేక్షకులతో కిక్కిరిసిన క్రికెట్ మైదానంలో ఆడటం కంటే.. సెంట్రల్ కోర్టులో వింబుల్డన్ ఆడటమే కాస్త కష్టమన్నాడు.

ఇటీవలే.. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తమ తొలి ఐపీఎల్ టైటిల్‌ను గెలుచుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విజయోత్సవం సందర్భంగా బెంగళూరులో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో 11 మంది తమ ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటన తర్వాత కోహ్లీ మళ్లీ ఇప్పుడే బయట కనిపించాడు.‘క్రికెట్‌లో అభిమానులు ఆటగాళ్లకు దూరంగా ఉంటారు. కేవలం బౌండరీ దగ్గర ఫీల్డింగ్ చేసేవాళ్లే ప్రేక్షకులకు కాస్త దగ్గరగా ఉంటారు. కానీ వింబుల్డన్‌లో అలా కాదు. జనాలు మనకు చాలా దగ్గరగా ఉంటారు. ఇది ఒత్తిడిని పెంచుతుంది. ఈ కారణంగానే నాకు టెన్నిస్ ఆటగాళ్లంటే అపారమైన గౌరవం ఉంది.

## భారత్‌తో వన్డే సిరీస్.. జట్టును ప్రకటించిన ఇంగ్లాండ్



ఇంగ్లాండ్‌తో పరిమిత ఓవర్ల సిరీస్‌ల కోసం ప్రస్తుతం భారత మహిళల జట్టు యూకే పర్యటనలో ఉన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఐదు టీ20ల సిరీస్‌లో మూడు మ్యాచ్‌లు ముగియగా.. భారత్ 2-1తో ఆధిక్యంలో ఉంది. ఈ పొట్టి సిరీస్ జులై 12న ముగుస్తుండగా.. 16 నుంచి ఇరుజట్ల మధ్య మూడు వన్డేల సిరీస్ ప్రారంభంకానుంది. ఈ సిరీస్ కోసం ఇంగ్లాండ్ 15మందితో కూడిన జట్టును ప్రకటించింది. ఎకిల్‌స్టోన్, మైయా బౌచియర్ తిరిగి వన్డే జట్టులోకి వచ్చారు.

ఇంగ్లాండ్ జట్టు: ఎమ్ ఆర్లాట్, టామీ బ్యూమాంట్, లారెన్ బెల్, మైయా బౌచియర్, ఆలిస్ కాప్సే, కేట్ క్రాస్, ఆలిస్ డేవిడ్సన్ రిచర్డ్స్, చార్లీ డీన్, సోఫియా డంక్లీ, సోఫీ ఎకిల్‌స్టోన్, లారెన్ ఫైలర్, అమీ జోన్స్, ఎమ్మా లాంబ్, నాట్ సీవర్ బ్రంట్ (కెప్టెన్), లిన్సే స్మిత్.

ఇంగ్లాండ్ %జ% భారత్ వన్డే సిరీస్ షెడ్యూల్

జులై 16 - తొలి వన్డే (సౌతాంప్టన్)
జులై 19 - రెండో వన్డే (లార్డ్స్, లండన్)
జులై 22 - మూడో వన్డే (చెస్టర్-లే-స్ట్రీట్)

## లార్డ్స్ టెస్ట్.. బెన్‌స్టోక్స్‌కు పెద్ద సవాలే: మైకేల్ అథర్టన్



ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్ మ్యాచ్‌లో టీమ్ఇండియా చేతిలో ఇంగ్లాండ్ ఘోర పరాజయం ఎదుర్కొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జులై 10 నుంచి లార్డ్స్‌లో జరగనున్న మూడో టెస్ట్ మ్యాచ్.. ఇంగ్లిష్ జట్టు కెప్టెన్ బెన్‌స్టోక్స్‌కు పెద్ద సవాలే అని ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ మైకేల్ అథర్టన్ అన్నాడు. రెండో మ్యాచ్‌లో, టాస్ సమయంలో పొరపాటు జరిగిందని ఇంగ్లాండ్ కోచ్ బ్రెండన్ మెకల్లమ్ అంగీకరించాడు. దీంతో బెన్‌స్టోక్స్ కెప్టెన్సీ సామర్థ్యంపై ప్రశ్నలు తలెత్తాయి. ‘కెప్టెన్‌గా బెన్‌స్టోక్స్‌కు లార్డ్స్‌లో జరగనున్న మూడో టెస్ట్ మ్యాచ్ కీలకం కానుంది. ఈ నేపథ్యంలో అతడు ప్రస్తుతం కఠినమైన సవాళ్లను ఎదుర్కొంటున్నాడు. ఈ టెస్ట్ మ్యాచ్ అతని నాయకత్వ పటిమ, మానసిక, శారీరక సామర్థ్యానికి పరీక్ష కానుంది’ అని మైకేల్ అథర్టన్ విశ్లేషించాడు. రాబోయే రెండు రోజులు బెన్‌స్టోక్స్‌కు చాలా ముఖ్యమని అథర్టన్ అన్నాడు. ‘మొదటి టెస్ట్ మ్యాచ్‌కు, రెండో టెస్ట్‌కు మధ్యలో ఏడు రోజుల విరామం దొరికింది. కానీ రెండో, మూడో టెస్ట్ మ్యాచ్‌ల మధ్య కేవలం మూడు రోజులు మాత్రమే ఉంది.

# కీరవాణి తండ్రి కన్నుమూత



ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి ఇంట విషాదం నెలకొంది. ఆయన తండ్రి శివశక్తి దత్తా (92) మణికొండలోని తన నివాసంలో సోమవారం రాత్రి కన్నుమూశారు. ప్రముఖ సినీ రచయిత విజయేంద్ర ప్రసాద్‌కు సోదరుడు అయిన శివశక్తి.. పలు సినీ గీతాలను రచించారు.

శివశక్తి దత్తా అసలు పేరు కోడూరి సుబ్బారావు. 1932 అక్టోబరు 8న రాజమహేంద్రవరం సమీపంలోని కొవ్వూరులో జన్మించారు. చిన్నతనంలోనే కళలపై ఆసక్తి ఉన్న ఆయన.. ఇంటినుంచి వెళ్లిపోయి ముంబయిలోని ఓ ఆర్ట్స్ కాలేజీలో చేరారు. రెండేళ్ల తర్వాత కొవ్వూరుకు తిరిగొచ్చి కమలేశ్ అనే కలం పేరుతో చిత్రకారుడిగా పనిచేశారు. ఆ తర్వాత సంగీతంపై ఇష్టంతో గిటార్, సితార్, హార్మోనియం నేర్చుకున్నారు.అనంతరం మద్రాసు వెళ్లిపోయి సోదరుడు విజయేంద్రప్రసాద్‌తో కలిసి సినీరంగంలోకి వచ్చారు. 1988లో వచ్చిన ‘జానకి రాముడు’ సినిమాతో వీరికి మంచి పేరొచ్చింది. ఈ సినిమాకు శివశక్తి దత్తా స్క్రీన్‌రైటర్‌గా పనిచేశారు. బాహుబలి 1 (మమతల తల్లి, ధీవర), బాహుబలి 2 (సాహో బాహుబలి), ఎన్టీఆర్: కథానాయకుడు (కథానాయక), ఆర్ఆర్ఆర్ (రామం రాఘవమ్), హనుమాన్ (అంజనాద్రి థీమ్ సాంగ్), సై (నల్లా నల్లాని కళ్ల పిల్ల), ఛత్రపతి (మన్నేల తింటివిరా), రాజన్న (అమ్మా అవని) వంటి సినిమాల్లో కొన్ని పాటలకు లిరిక్స్ రాశారు.శివశక్తి దత్తాకు ముగ్గురు సంతానం. కీరవాణి, కల్యాణి మాలిక్, శివశ్రీ కంచి. ఆయనకు ఒక అన్న, అక్క, నలుగురు తమ్ముళ్లు ఉన్నారు. ఆయన తమ్ముడు ప్రముఖ సినీ రచయిత విజయేంద్ర ప్రసాద్. ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి, గాయని, సంగీత దర్శకురాలు ఎం.ఎం.శ్రీలేఖకు శివశక్తి దత్తా పెద్దనాన్న.

## అత్యధికంగా ఆర్జిస్తున్న నటిగా స్కార్లెట్ జోహన్సన్



హాలీవుడ్ హీరోయిన్ స్కార్లెట్ జోహన్సన్ అత్యధికంగా ఆర్జిస్తున్న నటిగా టైటిల్ నిలబెట్టుకున్నది. ప్రస్తుతం ఆమె నటించిన జురాసిక్ వరల్డ్ రీబర్త్ చిత్రానికి ప్రపంచవ్యాప్తంగా మంచి ఓపెనింగ్స్ వచ్చాయి. హాలీవుడ్ మేటి నటులు రాబర్ట్ డౌనీ జూనియర్, టామ్ క్రూయిజ్‌లను కూడా దాటేసిందామె. బ్లాక్ విడో చిత్రంలో నటాషా రోమనాఫ్ పాత్రలో ఆమె నటించింది. ఆ పాత్ర నుంచి ఆమెకు భారీగా ఆదాయం వచ్చినట్లు తెలుస్తోంది. ఐరన్ మ్యాన్ 2, అవెంజర్స్ ఎండ్‌గేమ్ చిత్రాలోనూ స్కార్లెట్ జోహన్సన్ నటించింది.మ్యారేజ్ స్టోరీ, జోజో రాబిట్, లూసీ, హర్ చిత్రాల్లోనూ ఆమె చేసిన పాత్రలకు మంచి పేరు వచ్చింది. ఆ చిత్రాల్లో జోహన్సన్ తన వైవిధ్య నటనను ప్రదర్శించింది. బాక్సాఫీసు వద్ద కూడా ఆ చిత్రాలు రాణించాయి. సాధారణంగా మేల్ నటుల డామినేషన్ ఉండే హాలీవుడ్‌లో.. తొలిసారి ఓ హీరోయిన్ టాప్ ప్లేస్ కొట్టేసింది. వాస్తవానికి స్కార్లెట్ ఆర్జనలో మూడవ స్థానంలో ఉంది. కానీ జురాసిక్ వరల్డ్ రీబర్త్ హిట్ కావడంతో ఆమె ఏకంగా ప్రథమ స్థానానికి జంప్ చేసింది.40 ఏళ్ల స్కార్లెట్ ఇప్పటి వరకు 36 చిత్రాల్లో నటించింది. సామ్యూల్ జాక్సన్ 71, రాబర్ట్ డౌనీ జూనియర్ 45 సినిమాల్లో నటించారు.

## సోషల్ మీడియాకు బ్రేక్..



ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ అభిమానులతో చిట్‌చాట్ చేస్తుంటారు నటి శ్రుతి హాసన్. తన సినిమా విశేషాలతో పాటు వ్యక్తిగత విషయాలను కూడా పంచుకుంటుంటారు. తాజాగా ఆమె పెట్టిన పోస్ట్ చర్చనీయాంశంగా మారింది.

తాను కొన్ని రోజులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు శ్రుతి హాసన్ తెలిపారు. సోమవారం ఇన్‌స్టాలో తన ఫాలోవర్స్‌ను ఉద్దేశించి ఓ పోస్ట్ చేశారు. కొన్ని రోజులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలనుకుంటున్నట్లు తెలిపారు. నిశ్శబ్దాన్ని ఆస్వాదించాలనుకుంటున్నట్లు చెప్పారు.ప్రస్తుతం శ్రుతి హాసన్ ‘కూలీ’లో నటిస్తున్నారు. కథానాయకుడు రజనీకాంత్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రమిది. యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో లోకేశ్ కనగరాజ్ తెరకెక్కించారు. కథానాయకుడు నాగార్జున, ఉపేంద్ర, ఆమిర్ ఖాన్, సత్యరాజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. అన్నీ పనులు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## చిన్న ప్రోమోతో గట్టి హైప్ తెచ్చుకున్న ‘కింగ్డమ్’

సెన్సేషనల్ స్టార్ ది విజయ్ దేవరకొండ హీరోగా భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్ గా దర్శకుడు గౌతమ్ తిన్ననూరి తెరకెక్కించిన భారీ యాక్షన్ చిత్రమే “కింగ్డమ్”. విజయ్ ని సరికొత్తగా ఆవిష్కరించిన ఈ సాలిడ్ ప్రాజెక్ట్ ని ఎట్టకేలకి ఈ జూలై ఆఖరులో విడుదలకి సిద్ధం చేశారు. అయితే దీనిపై విడుదల చేసిన నిమిషం లేని కూడా ఓ ప్రోమో కట్ సినిమాపై మరిన్ని అంచనాలు పెంచింది అని చెప్పవచ్చు.క్రేజీ యాక్షన్ ఎలిమెంట్స్, విజయ్ దేవరకొండలో కొన్ని షేడ్స్ లో చూపించిన విజువల్స్ కానీ గౌతమ్ టేకింగ్, అనిరుద్ స్కోర్ ఇవన్నీ నెక్స్ట్ లెవెల్ ట్రీట్ ని ప్రామిస్ చేస్తున్నాయి. దీనితో ఇది చూసాల చూసాక మాత్రం ఇన్ని రోజులు ఆలస్యం అయ్యినా కూడా థియేటర్స్ లో బ్లాస్టింగ్ ట్రీట్ ఖాయం అనేట్టుగా ఈ సింగిల్ ప్రోమోతో కన్ఫర్మ్ అయ్యిపోయింది. ఇక ఈ జూలై 31న థియేటర్స్ లో వచ్చే సినిమా ఎలాంటి రెస్పాన్స్ ని అందుకుంటుందో చూడాలి.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.